



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY






SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 128 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | శుక్రవారం 30 జనవరి 2026 | పేజీలు : 12 | వెల : 2/-


# 2027 నాటికి బెంగుళూరు-విజయవాడ ఎకనామిక్ కారిడార్



- రవాణా వ్యయం తగ్గించేలా రాష్ట్రంలో రహదారి ప్రాజెక్టులు
- ఏపీలో 2029 నాటికి రూ.1.4 లక్షల కోట్ల ఎన్‌హెచ్ పనులు పూర్తి లక్ష్యం
- ఓడరేవులు, ముఖ్యమైన ప్రాంతాలను అనుసంధానిస్తూ రోడ్ల నిర్మాణం
- రాష్ట్రంలో జాతీయ రహదారులు, ఆర్ అండ్ బీశాఖపై ముఖ్యమంత్రి చంద్రబాబు సమీక్ష

**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో ప్రస్తుతం చేపట్టిన రూ.1.40 లక్షల కోట్ల విలువైన జాతీయ రహదారుల ప్రాజెక్టులు 2029 నాటికి పూర్తి కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. జాతీయ రహదారుల సంస్థ, కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ చేపట్టిన వివిధ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసేలా కార్యాచరణ ఉండాలని సీఎం స్పష్టం చేశారు. క్యాంపు కార్యాలయంలో గురువారం జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారి ప్రాజెక్టులపై సీఎం సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారుల నెట్వర్క్ విస్తరణ, రాష్ట్ర రహదారులు, రోడ్ డెన్సిటీ పెంపు, ప్రస్తుతం ఏపీలో చేపట్టిన ఎన్‌హెచ్ ప్రాజెక్టుల పురోగతి, కొత్త రహదారుల నిర్మాణం తదితర అంశాలపై సీఎం దిశానిర్దేశం చేశారు. సరుకు రవాణా వ్యయాన్ని గణనీయంగా తగ్గించటమే లక్ష్యంగా రాష్ట్రంలో రహదారి ప్రాజెక్టులు చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులకు దిశానిర్దేశం చేశారు. శ్రీకాకుళం జిల్లాలోని మూలపేట, విశాఖ, కాకినాడ, మచిలీపట్నం, రామాయపట్నం, కృష్ణపట్నం ఓడరేవులను ఈ జాతీయ రహదారులతో అనుసంధానించాలని సూచనలు జారీ చేశారు. ఈ పోర్టులకు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా సరుకు రవాణా చేసేలా హింటర్ ల్యాండ్‌ను కనెక్టు చేసేలా రోడ్లు నిర్మించాలని స్పష్టం చేశారు. ప్రాజెక్టులను పూర్తి చేసే విషయంలో దేశంలోనే ఏపీ బెంచ్ మార్క్ గా ఉండాలని స్పష్టం చేశారు. ప్రస్తుతం రెండు లేన్లుగా ఉన్న జాతీయ రహదారులను 4 లేన్లుగా, 6 లేన్లుగా మార్చేందుకు ప్రణాళికలు చేపట్టాలని సీఎం సూచించారు. ప్రస్తుతం రూ.42,194 కోట్ల విలువైన జాతీయ రహదారుల నిర్మాణం పురోగతిలో ఉన్నాయని వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. రాజధాని అమరావతిని అనుసంధానించే బెంగుళూరు-కడప- విజయవాడ ఎకనామిక్ కారిడార్ పనులు 2027 కల్లా పూర్తి కావాలని సూచించారు. ఖరగ్ పూర్-అమరావతి గ్రీన్ ఫీల్డ్ ఎక్స్ ప్రెస్ వే కూడా త్వరలోనే డీపీఆర్‌లు మిగతా .. 2లో..


## రాహుల్ ఉన్నారు..
# విజయ్ బూస్ట్ అవసరం లేదు
### నటుడి తండ్రి వ్యాఖ్యలపై కాంగ్రెస్



**విశ్వం వాయిస్ న్యూస్ :** త్వరలో జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే-కాంగ్రెస్ కూటమి ఏర్పాటుకు కసరత్తులు జరుగుతున్నాయని కొన్ని రోజులుగా ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో టీవీకే అధ్యక్షుడు విజయ్ తండ్రి ఎస్ఏ చంద్రశేఖర్ ఇచ్చిన ఆఫర్‌పై కాంగ్రెస్ స్పందించింది. తమకు విజయ్ బూస్ట్ అవసరం లేదని పేర్కొంది. "కాంగ్రెస్‌కు ఒక చరిత్ర ఉంది. ఆ పార్టీకి మద్దతు ఇవ్వడానికి, అది పూర్వ వైభవం పొందడంలో సహకరించేందుకు విజయ్ సిద్ధంగా ఉన్నారు. ఇక ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవడం కాంగ్రెస్ చేతిలోనే ఉంది" అని వ్యాఖ్యలు చేశారు. వీటిపై టీవీకే కానీ.. విజయ్ కానీ మిగతా .. 2లో..


## వన్యప్రాణి సంరక్షణలో కార్పొరేట్లు
# భాగస్వాములు కావాలి

- జంతువుల సంరక్షణ బాధ్యతను ప్రతి ఒక్కరు స్వీకరించాలి
- తల్లి అంజనాదేవి జన్మదినం సందర్భంగా జిరాఫీలు దత్తత
- ఏడాదిపాటు వాటి పోషణ ఖర్చులు భరిస్తానని ప్రకటన
- విశాఖ జూ పార్క్ ఆద్యంతం పరిశీలించిన పవన్ కళ్యాణ్



**విశాఖపట్నం, విశ్వం వాయిస్ న్యూస్ :** పర్యావరణ సమతుల్యత, స్థిరత్వానికి వన్యప్రాణి సంరక్షణ చాలా ముఖ్యమని, ప్రతి ఒక్కరు వన్యప్రాణి సంరక్షణలో భాగం కావాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ, పర్యవరణ శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ పిలుపు నిచ్చారు. తన తల్లిగా అంజనా దేవి జన్మదినాన్ని పురస్కరించుకొని విశాఖ ఇందిరాగాంధీ జూలాజికల్ పార్క్ లో రెండు జిరాఫీలను దత్తత తీసుకున్నారు. ఏడాదిపాటు వాటి సంరక్షణకు అయ్యే ఖర్చును భరించనున్నట్టు ప్రకటించారు. గురువారం ఉదయం విశాఖ జూ పార్కును పవన్ కళ్యాణ్ పరిశీలించారు. జూ పార్క్‌లో జంతువుల సంరక్షణ నిమిత్తం ప్రస్తుతం ఏర్పాటు చేసిన సౌకర్యాలకు మిగతా .. 2లో..

# మావోయిస్టుల కుట్ర భగ్నం..
### రెండు భారీ ఐఈడీల గుర్తింపు



**చర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** ఛత్తీస్‌గఢ్‌లో గురువారం భద్రతా దళాలు రెండు భారీ ఐఈడీ (ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైస్)లను గుర్తించారు. బీజాపూర్‌లోని ఇల్మిడి-లంకపల్లి మిగతా .. 2లో..

## అత్యంత ప్రమాదకర డ్యామ్‌ల జాబితాలో
# మేడిగడ్డ బ్యారేజీ : కేంద్రం



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** తెలంగాణలోని మేడిగడ్డ బ్యారేజీపై పార్లమెంట్ వేదికగా కేంద్ర ప్రభుత్వం కీలక సమాధానం ఇచ్చింది. డ్యామ్‌ల భద్రతపై అడిగిన ప్రశ్నకు కేంద్ర జల్‌శక్తి శాఖ సమాధానం ఇచ్చింది. కేటగిరీ - 1 ప్రమాదకర డ్యామ్‌గా మేడిగడ్డ ఉందని పేర్కొంది. తెదేపా ఎంపీలు లక్ష్మీనారాయణ, శబరి ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. దేశంలో 50 ఏళ్లు పైబడిన డ్యామ్‌లు 1,681 ఉన్నాయని జల్‌శక్తి శాఖ తెలిపింది. గతేడాది వర్షాకాలం కంటే ముందు 6,524 డ్యామ్‌లు తనిఖీ చేశామని కేంద్రం వెల్లడించింది. వర్షాకాలం తర్వాత 6,553 డ్యామ్‌లు తనిఖీ చేసినట్లు తెలిపింది. తనిఖీల్లో 3 డ్యామ్‌లు అత్యంత ప్రమాదకరంగా మిగతా .. 2లో..

# ముగిసిన అజిత్ పవార్ అంత్యక్రియలు



**ముంబయి, విశ్వం వాయిస్ న్యూస్ :** విమాన ప్రమాదంలో కన్నుమూసిన మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ అంత్యక్రియలు ముగిశాయి. గురువారం బారామతిలోని విద్యా ప్రతిష్ఠాన్ మైదానంలో ప్రభుత్వ లాంఛనాలతో అజిత్‌కు అంతిమ సంస్కారాలు నిర్వహించారు. కేంద్ర మంత్రులు అమిత్ షా, నితిన్ గడ్కరీ, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్, డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్, తదితర రాజకీయ ప్రముఖులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అజిత్ పవార్‌ను కడసారి చూసేందుకు ఎన్సీపీ కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున మైదానానికి వచ్చి పార్టీ అధినేతకు కన్నీటి వీడ్కోలు పలికారు. బుధవారం ఉదయం బారామతి విమానాశ్రయం సమీపంలో జరిగిన ప్రమాదంలో అజిత్ పవార్ దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే. విమానం రన్‌వేపై దిగేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో కుప్పకూలి మంటల్లో చిక్కుకుంది. దీంతో అజిత్ పవార్‌తో పాటు మరో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. జిల్లా పరిషత్ ఎన్నికల ప్రచారం నిమిత్తం బారామతికి వస్తుండగా ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. పవార్‌కు భార్య సునేత్ర పవార్ (రాజ్యసభ సభ్యురాలు), ఇద్దరు కుమారులు పార్థ్, జే ఉన్నారు.

## ఫోన్ ట్యాపింగ్ కేసు..
# కేసీఆర్‌కు సిట్ నోటీసులు



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఫోన్ అక్రమ ట్యాపింగ్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. భారత రాష్ట్ర సమితి అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు సిట్ అధికారులు నోటీసులు ఇచ్చారు. నందినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి అందజేశారు. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు విచారణ చేస్తామని నోటీసుల్లో పేర్కొన్నారు. 65 ఏళ్ల వయసు దృష్ట్యా మిగతా .. 2లో..

# ఉత్సాహంగా అరకు ఫెస్ట్..
### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు



**అరకు, విశ్వం వాయిస్ న్యూస్ :** అల్లూరి జిల్లాలో ఆంధ్రా ఊటీ అరకులోయలో అరకు ఉత్సవాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ ఫెస్ట్‌ను మంత్రులు కందుల దుర్గేశ్, గుమ్మడి సంధ్యారాణి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను మంత్రులు పరిశీలించారు. అనంతరం కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

## మళ్లీ సమాజాన్ని
# వెనక్కి తీసుకెళ్తున్నామా?
### యూజీసీ 'సమానత్వ' నిబంధనపై సుప్రీంకోర్టు స్టే



**దిల్లీ, విశ్వం వాయిస్ న్యూస్ :** కుల వివక్షను రూపుమాపి.. ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వాన్ని పెంపొందించేందుకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తీసుకొచ్చిన కొత్త నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. ఈ నిబంధనలను సవాల్ చేస్తూ దాఖలైన పిల్‌పై గురువారం విచారణ జరిపిన అత్యున్నత న్యాయస్థానం.. కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ మార్గదర్శకాలు అస్పష్టంగా ఉన్నాయని, వీటిని దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కేంద్రం, యూజీసీకి సుప్రీం ధర్మాసనం నోటీసులు జారీ చేసింది. తదుపరి నోటీసులు ఇచ్చేంతవరకు నిబంధనలపై స్టే అమల్లో మిగతా .. 2లో..

## మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధే
# ప్రభుత్వ ధ్యేయం

- ప్రతి మత్స్యకారుడు పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే సంకల్పం
- మత్స్యకార సొసైటీల బలోపేతానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఆక్వా రంగంలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నిలపడమే లక్ష్యం
- మంత్రులు కొల్లు రవీంద్ర, సవిత, అచ్చెన్నాయుడు




**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఆఫ్ కాఫ్) నూతన చైర్మన్ యాటగిరి రాంప్రసాద్ మాట్లాడుతూ.. మత్స్యకార గ్రామాల్లో పర్యటించి, వారి సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించే దిశగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కుల, మతాలకు అతీతంగా కష్టపడి పనిచేసే కార్యకర్తలను గుర్తించే వ్యక్తి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపై, ముఖ్యంగా మత్స్యకార సామాజిక వర్గం ఎదుర్కొన్న సమస్యలపై అనేక పోరాటాలను చేసానన్నారు. అధిష్టానం, రాష్ట్ర మంత్రులు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, సవిత సూచనల మేరకు, మిగతా .. 2లో..

## గతంలో అధికారం ఇస్తే
# ఏం చేశారు జగన్
### వైఎస్ షర్మిల



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** వైకాపా అధినేత జగన్ పాదయాత్ర చేయనున్నట్లు ప్రకటించడంపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల స్పందించారు. అధికారం కోసమే జగన్ పాట్లు అని ఎద్దేవా చేశారు. గతంలో అధికారం ఇస్తే ఏం చేశారని ప్రశ్నించారు. జలయజ్ఞం పూర్తి చేయగలిగారా? నవరత్నాల్లో పెట్టిన హామీలను అమలు చేశారా? మద్యనిషేధం అమలు చేశారా? అని నిలదీశారు. అధికారం ఇస్తే ఒక్క రోజు కూడా బయటకు రాలేదని, ఆ పార్టీ వాళ్లకే అందుబాటులో లేరని విమర్శించారు. ఏడాది మిగతా .. 2లో..

## జనాభా లెక్కల సేకరణ-2027పై
# ప్రజల్లో అవగాహన కల్పించాలి
### ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్రంలో జనాభా లెక్కల సేకరణ 2027పై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ కలక్టర్లకు స్పష్టం చేశారు.రానున్న 2027 జనాభా లెక్కల సేకరణ,175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు,డిస్పెన్సరీలు, ఐఎంఎస్ ఆసుపత్రుల మిగతా .. 2లో..

## కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో
# జగన్ చర్చకు రావాలి
### మంత్రి కొల్లు రవీంద్ర



**అమరావతి, విశ్వం వాయిస్ న్యూస్ :** కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో చర్చకు వైకాపా సభ్యులతో కలిసి జగన్ రావాలని ఏపీ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. గత ఐదేళ్లలో శ్రీవారి ప్రసాదం కల్తీ చేసే అపవిత్ర కార్యానికి జగన్ తెరలేపారని విమర్శించారు. "దేవుడిపై మిగతా .. 2లో..

(మొదటిపేజీ తరువాయి)

## బెంగుళూరు- విజయవాడ ఎకనామిక్ కారిడార్

సిద్ధం చేయాలని ఆదేశించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి అయితే ప్రజలకు తక్షణం ప్రయోజనం కలుగుతుందని అన్నారు. రాష్ట్రంలో ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన వివిధ రోడ్డు ప్రాజెక్టులకు కూడా అనుమతులు తీసుకుని వేగంగా పనులు చేపట్టాలని సూచించారు. కేంద్రానికి ఇవ్వాల్సిన ప్రతిపాదనల్ని కూడా తక్షణమే సమర్పించాలని స్పష్టం చేశారు. మహారాష్ట్రలోని నాగ్ పూర్ నుంచి విజయవాడ మీదుగా మచిలీపట్నం, రాయపూర్-అమరావతి, మూలపేట పోర్టు జగదల్ పూర్, రాయపూర్‌లను కూడా అనుసంధానించేలా రహదారుల నిర్మాణం జరగాలని సీఎం నిర్దేశించారు.

**రాష్ట్రంలో రహదారి నెట్వర్క్ విస్తరణ**

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న రహదారి నెట్వర్క్ ను మరింత విస్తరించేలా ప్రణాళికలు చేయాలని ముఖ్యమంత్రి రహదారులు భవనాల శాఖను ఆదేశించారు. రూ.2500 కోట్లతో 6,054 కిలోమీటర్ల మేర రహదారుల నిర్మాణం చేపట్టేందుకు కార్యాచరణ చేపట్టామని అధికారులు తెలిపారు. ఆధునిక టెక్నాలజీ ద్వారా రహదారుల నిర్మాణం కోసం ప్రయత్నాలు చేస్తున్నట్టు వివరించారు. డేనిష్ ఫైబర్, వేస్ట్ ప్లాస్టిక్ బిటుమిన్, తిరుపతి ఐఐటీ రూపొందించిన నానో కాంక్రీట్ టెక్నాలజీ ద్వారా ప్రయోగాత్మకంగా రోడ్లను వేస్తున్నామని తెలిపారు. 45 వేల కిలోమీటర్ల రాష్ట్ర, జిల్లా రహదారుల్లో ఎక్కడా గుంతలు లేకుండా చూడాలని సీఎం స్పష్టం చేశారు. రహదారుల నిర్వహణకు అవసరమైన నిధులను సమకూర్చుకోవాలని సూచించారు. రామ్స్ టెక్నాలజీ ద్వారా రోడ్ల పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. పీపీపీ కింద 709 కిలోమీటర్ల మేర 12 రహదారులను కూడా చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో పటిష్టంగా రోడ్ల నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్షకు రహదారులు భవనాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు, జాతీయ రహదారుల సంస్థ అధికారులు హాజరయ్యారు.

## భాగస్వాములు కావాలి

సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. జూపార్క్‌ను మరింత అభివృద్ధి చేసేందుకు ఉన్న అవకాశాలపై అటవీశాఖ అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ "మన దేశంలో వన్యప్రాణుల సంరక్షణ అంశంలో జూపార్కులు చాలా ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. అంతరించిపోతున్న జీవ జాతులను రక్షిస్తున్నాయి. ప్రశాంతమైన వాతావరణంలో సుమారు 650 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న విశాఖ జూపార్క్ లో వందలాది వన్యప్రాణులు, పక్షులు ఆహ్లాదకర వాతావరణం మధ్య జీవిస్తున్నాయి. వాటిని సంరక్షణ మనందరి బాధ్యత. జూ పార్కుల అభివృద్ధిలో కార్పొరేట్లు భాగస్వాములు కావాలి. తమకు నచ్చిన జంతువును ఎంచుకొని వాటి సంరక్షణ బాధ్యత తీసుకోవాలి. మా కుటుంబం మొత్తం జంతు ప్రేమికులం. జంతు సంక్షణపై చాలా శ్రద్ధపెడతాం. మా ఇంట్లో నాలుగు కుక్కలను పెంచుతున్నాం" అన్నారు.

**జూ పార్క్ మొత్తం కలియదిరుగుతూ.. జంతువుల వివరాలు తెలుసుకుంటూ..**

అంతకు ముందు విశాఖ ఇందిరా గాంధీ జూలాజికల్ పార్కును శ్రీ పవన్ కళ్యాణ్ గారు పరిశీలించారు. మొదట జూ వెనుక గేటుకి సమీపంలో ఉన్న సీతాకోక చిలుకల పార్కును సందర్శించారు. పార్కులో ఎన్ని రకాల సీతాకోక చిలుకలు ఉన్నాయి? వలల మధ్య ఉన్న వాటికి ఆహారం ఎలా అందిస్తారు? తదితర వివరాలు జూ క్యూరేటర్ శ్రీమతి మంగమ్మను అడిగి తెలుసుకున్నారు. అటవీశాఖ అధికారులు బటర్ ఫ్లై పార్క్ లో వదిలేందుకు సేకరించిన వివిధ రకాల సీతాకోక చిలుకలను పవన్ కళ్యాణ్‌ార్కులోకి విడుదల చేశారు. టైగర్ రకానికి చెందిన సీతాకోక చిలుకలు ఆయనపై దుస్తులపై వాలగా, వాటిని సున్నితంగా పూల మొక్కల పైకి మళ్లించారు. అనంతరం జూ పార్క్ లో ఉన్న నీటి ఏనుగులను పరిశీలించారు. వాటికి ఇచ్చే ఆహారం, జూ అధికారులు వాటికి పెట్టిన పేర్లు, సంరక్షణలో తీసుకుంటున్న జాగ్రత్తలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ఎలుగుబంట్ల ఎన్ క్లోజర్ ప్రారంభోత్సవం**

జూలో నూతనంగా ఎలుగుబంట్ల కోసం ఏర్పాటు చేసిన ఎన్ క్లోజర్‌ను పవన్ కళ్యాణ్ ప్రారంభించారు. జూలో ఉన్న రెండు నల్ల ఎలుగుబంట్ల వివరాలు తెలుసుకుని, వాటికి ఆహారం అందించారు. జింకలపార్క్, జూలో ఉన్న సింహాలు, ఆఫ్రికన్ మకావు జాతి చిలుకలు, పులులను తిలకించారు. వారి రక్షణకు తీసుకుంటున్న చర్యలు, జూలో ఏర్పాటు చేయాల్సిన సౌకర్యాలపై చర్చించారు. జూ పార్క్ లోని ఏనుగుల శాలను సందర్శించారు. జూ నిబంధనలు పాటిస్తూ శానిటైజ్ చేసుకుని ఏనుగుల వద్దకు వెళ్లి వాటికి ఆహారం అందించారు. అనంతరం జూ పార్క్ లో ఉన్న జిరాఫీల ఎంక్లోజర్ వద్దకు వెళ్లారు. వాటికి ఎంతో ఇష్టమైన రావి ఆకులు, అరటి పండ్లు ఆహారంగా అందించారు. జిరాఫీలను ఎక్కడి నుంచి తీసుకువచ్చారు? వాటి వయస్సు ఎంత? తదితర వివరాలు సంరక్షకులను అడిగి తెలుసుకున్నారు.

**కంబాలకొండ ఎకో పార్క్‌లో కెనోపీ వాక్**

జూ పార్క్ సందర్శన అనంతరం కంబాలకొండ ఎకో పార్క్ ని పరిశీలించారు. ఎకో పార్క్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో అభివృద్ధి చేసిన నగరవనాన్ని ప్రారంభించారు. కంబాలకొండ ఎకో పార్క్ లో 50 ఎకరాల విస్తీర్ణంలో ఈ నగరవనాన్ని అభివృద్ధి చేశారు. అనంతరం వుడెన్ బ్రిడ్జిపై వివిధ రకాల వృక్ష జాతుల మధ్య 400 మీటర్లు కెనోపీ వాక్ చేశారు. ఉడెన్ బ్రిడ్జికి ఇరువైపులా దిడిశ, వేప, ఇప్ప, బిలుడు, మహాగని, ఏగిస, వివిధ జాతుల వెదురు, పనస వృక్షాలను పరిశీలించారు. ఆయా వృక్షాల శాస్త్రీయ నామాలు, వాటి వల్ల ఉపయోగాలు అడిగి తెలుసుకున్నారు. ఎకో పార్కులోని శాంతివనంలో మహాగని మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో పీసీసీఎఫ్ పి.వి.చలపతిరావు, ఏపీసీసీఎఫ్ శాంతిప్రియా పాండే, ఫారెస్ట్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ రీజనల్ మేనేజర్ జ్యోతి, విశాఖ డీఎఫ్ఓ రవీంద్ర దామ, విశాఖపట్నం జాయింట్ కలెక్టర్ విద్యాధరి తదితరులు పాల్గొన్నారు.

## మావోయిస్టుల కుట్ర భగ్నం..

ప్రాంతంలో జరిగిన తనిఖీల్లో మావోయిస్టులు అమర్చిన 20, 30 కిలోల బరువున్న రెండు ఐఈడీలను భద్రతా దళాలు స్వాధీనం చేసుకుని, వాటిని అక్కడికక్కడే ధ్వంసం చేశాయి. డీఆర్‌జీ(డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్), ఛత్తీస్‌గఢ్ ఆర్మ్‌డ్ ఫోర్సెస్(సీఏఎఫ్) 9వ బెటాలియన్, బీడీఎస్ బృందం సంయుక్తంగా ఈ తనిఖీలు నిర్వహించాయి. పెద్ద వాహనాలను లక్ష్యంగా చేసుకోవడానికి లంకపల్లి మట్టి రోడ్డుపై ఈ ఐఈడీలను మావోయిస్టులు అమర్చినట్లు అధికారులు తెలిపారు. భద్రతాదళాలు వాటిని జాగ్రత్తగా ధ్వంసం చేయడంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. ఈ ఘటన అనంతరం చుట్టుపక్కల ప్రాంతాల్లో కూంబింగ్ ఆపరేషన్ ముమ్మరం చేశారు. మరోపక్క నారాయణపూర్ జిల్లాలో తక్కువ తీవ్రత ఉన్న తొమ్మిది ఐఈడీలను భద్రత బలగాలు గుర్తించి పేల్చివేశాయి.

## విజయ్ బూస్ట్ అవసరం లేదు

స్పందించలేదు. అయితే హస్తం పార్టీ తమిళనాడు అధ్యక్షుడు కె. సెల్వపెరుంతగై స్పందించారు. ఈ ఆఫర్‌ను తిరస్కరించారు. "మా కార్యకర్తలకు విజయ్ బూస్ట్ అవసరం లేదు. మా కేడర్‌ను చూడండి. వారు ఉత్సాహంగా ఉన్నారు. మా నాయకుడు రాహుల్ గాంధీ మాకు బూస్ట్, హార్లిక్స్, బోర్నవిటా ఇస్తున్నారు" అని కౌంటర్ ఇచ్చారు. లోక్‌సభ ఎన్నికల సమయంలో ఏర్పడిన డీఎంకే నేతృత్వంలోని 'ఇండియా' కూటమి ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లోనూ కొనసాగనుందని కూటమి నాయకత్వం, దాని మిత్రపక్షాలు చెబుతున్నాయి. అయితే పరిస్థితులు మాత్రం భిన్నంగా ఉన్నాయి. అధికారంలో భాగస్వామ్యం కావాలని, రాబోయే శాసనసభ ఎన్నికల్లో అత్యధిక సీట్లు ఇవ్వాలని డీఎంకే కూటమిని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఈ సమయంలోనే కాంగ్రెస్-టీవీకే పొత్తు వార్తలు వస్తున్నాయి. ఈ పార్టీతో పొత్తు పెట్టుకోవడానికి అన్నాడీఎంకే, భాజపా వంటి అగ్రపార్టీలు సైతం బహిరంగంగానే పిలుపునిస్తున్నప్పటికీ కాంగ్రెస్‌తో కూటమి ఏర్పాటుకే విజయ్ మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో టీవీకే జాతీయ ప్రతినిధి ఫెలిక్స్ గెరాల్డ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తో పొత్తుకు సంకేతాలు ఇచ్చారు. సిద్ధాంతాల పరంగా తాము సహజ భాగస్వాములమని.. విజయ్, రాహుల్ గాంధీ కూడా మంచి మిత్రులని పేర్కొన్నారు.

## మేడిగడ్డ బ్యారేజీ : కేంద్రం

ఉన్నాయంది. ప్రమాదకరంగా మేడిగడ్డ, లోయర్ ఖజురి (యూపీ), బొకారో (ఝార్ఖండ్) డ్యామ్‌లు ఉన్నట్లు తెలిపింది. మేడిగడ్డ అంశంలో చర్యలు తీసుకోవాలని ఇప్పటికే రాష్ట్రానికి సూచించామని స్పష్టం చేసింది.

## వెనక్కి తీసుకెళ్తున్నామా?

ఉంటుందని స్పష్టం చేసింది. "స్వాతంత్ర్యం వచ్చిన ఇన్ని దశాబ్దాల తర్వాత.. కులవివక్ష లేని సమాజం కోసం మనం ఏం సాధించాం ? ఈవిషయంలో మనం మళ్లీ సమాజాన్ని వెనక్కి తీసుకెళ్తున్నామా? అనే భావన కలుగుతోంది. దక్షిణాది, ఈశాన్య రాష్ట్రాలు ఇలా దేశంలోని పలు ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు తమ సంప్రదాయాలకు అనుగుణంగానే వ్యవహరిస్తారు. అలాంటివారిని ర్యాగింగ్ పేరుతో కొందరు అవహేళన చేస్తుండటం అత్యంత బాధాకరం. వాటిని అరికట్టేందుకు ప్రత్యేక హాస్టళ్లు ఉండాలని మాట్లాడుతున్నారు. కానీ, ప్రస్తుతం సమాజంలో కులాంతర వివాహాలే జరుగుతున్నాయి. హాస్టళ్లలోనూ అందరూ కలిసే ఉంటున్నారు. అలాగే, ఐక్య భారత విధానం మన విద్యాసంస్థల్లో స్పష్టంగా ప్రతిబింబించాలి. విద్యా సంస్థల్లో స్వేచ్ఛాయుత, సమానత్వ, సమ్మిళిత వాతావరణాన్ని మేం కోరుకుంటున్నాం" అని విచారణ సందర్భంగా సుప్రీం ధర్మాసనం వ్యాఖ్యానించింది. ప్రతి ఉన్నత విద్యాసంస్థలోనూ 'సమానత్వ(ఈక్విటీ) కమిటీ'ల ఏర్పాటును యూజీసీ ఇటీవల తప్పనిసరి చేసింది. ఆయా కమిటీల్లో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళలకు ప్రాతినిధ్యం కల్పించాలని స్పష్టంచేసింది. రోహిత్ వేముల కేసులో సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు యూజీసీ(ఉన్నత విద్యాసంస్థల్లో సమానత్వ ప్రోత్సాహం) నిబంధనలు-2012 స్థానంలో కొత్త నిబంధనలను ఈనెల 13 నుంచి అమలులోకి తెచ్చింది. అయితే, కొత్త నిబంధనలలోని కులవివక్ష నిర్వచనాన్ని ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బందికే పరిమితం చేయడంపై అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. ఈ క్రమంలోనే యూజీసీ నిబంధనలను సవాల్ చేస్తూ ఓ న్యాయవాది సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కుల ఆధారిత వివక్ష కేవలం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ వర్గాలకు వ్యతిరేకంగా మాత్రమే జరుగుతుందన్న భావన ఆధారంగా ఈ ఉత్తర్వులను యూజీసీ రూపొందించిందని అందులో పేర్కొన్నారు. కులం ఆధారంగా జనరల్ లేదా నాన్ రిజర్వుడు కేటగిరీ విద్యార్థులు కూడా వివక్షను ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. కులానికి తావివ్వనిరీతిలో వివక్ష అనే పదాన్ని నిర్వచించేలా యూజీసీకి ఆదేశాలు ఇవ్వాలని పిల్‌లో పిటిషనర్ కోరారు. దీనిపైనే న్యాయస్థానం విచారణ జరిపింది.

## కేసీఆర్‌కు సిట్ నోటీసులు

పీఎస్‌కు రావాల్సిన అవసరం లేదని సిట్ పేర్కొంది. విచారణకు హాజరయ్యేందుకు హైదరాబాద్ నగర పరిధిలోని ఏదైనా ప్రాంతం వివరాలను తెలపాలని సూచించింది. ఈ కేసులో ఇటీవల మాజీ మంత్రులు హరీశ్‌రావు, కేటీఆర్‌తో పాటు మాజీ ఎంపీ సంతోష్‌రావును సిట్ విచారించిన విషయం తెలిసిందే.

## ప్రభుత్వ ధ్యేయం

సమైక్య 13 జిల్లాల మత్స్యకార సంఘాల మద్దతుతో మత్స్య సహకార సంఘాల సమైక్య చైర్మన్‌గా ఏకగ్రీవంగా తనను ఎన్నుకోవడం జరిగిందన్నారు. స్థానిక తుమ్మలపల్లి కళా క్షేత్రంలో గురువారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్య సహకార సంఘాల సమాఖ్య (ఆఫ్ కాఫ్) చైర్మన్, పాలకవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గనులు, భూగర్భ, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ.. ప్రతి మత్స్యకారుడిని ఒక పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రతి మత్స్యకారుడు పారిశ్రామికవేత్త గా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. రాష్ట్రానికి అతిపెద్ద తీర ప్రాంతం ఉందని అత్యంత ఎక్కువ నీటి వనరులు ఉన్నాయని. అటువంటి ఆఫ్ కాఫ్ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నికై, ఈరోజు ప్రమాణ స్వీకారం చేస్తున్నటువంటి చైర్మన్ యాటగిరి రాంప్రసాద్, ఉపాధ్యక్షులు బి. రంగారావు లు అభినందనీయులన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో దాదాపు 972 కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, లక్షలాది కుటుంబాలు మత్స్యకార వృత్తిపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయన్నారు. గత ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నంబర్ 217 మత్స్యకారుల ప్రయోజనాలకు విరుద్ధమని, దానిపై పోరాడి ప్రస్తుత కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అసెంబ్లీలో తీర్మానం ద్వారా దానిని రద్దు చేసామన్నారు. మత్స్యకారుల కోసం ప్రత్యేక రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేసామన్నారు. వేట నిషేధ కాలంలో ఇచ్చే ఆర్థిక సాయాన్ని 2019లోనే ప్రభుత్వం ప్రారంభించిందని పేర్కొన్నారు. ప్రస్తుతం అనేక కార్పొరేషన్లకు కొత్త నాయకత్వం వచ్చిందని, పదవులను కేవలం అలంకారప్రాయంగా చూడకుండా సామాజిక వర్గాల అభివృద్ధి కోసం కృషి చేయాలని మంత్రి కొల్లు రవీంద్ర పిలుపునిచ్చారు. రాష్ట్ర బి.సి. సంక్షేమం, ఆర్థికంగా వెనుకబడిన వర్గాల సంక్షేమం (జుజెూ), చేనేత, జౌళి శాఖల మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ.. తెలివికి, ధైర్యానికి మారుపేరు మత్యకారులని, సముద్రంతో పోరాడి చేపలను వేటాడి సమాజానికి అందించే మత్స్యకారుల ధైర్యాన్ని, కృషిని మంత్రి అభినందించారు. మత్స్యకారులు ఎప్పటి నుంచో తమ ప్రభుత్వానికి అండగా ఉంటున్నారని, కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి వారు చేసిన కృషి అమోఘమని పేర్కొన్నారు. బీసీలంటే తమ ప్రభుత్వమని.. దివంగత స్వర్గీయ మాజీ ముఖ్యమంత్రి ఎన్.టి రామారావు చెప్పిన మాటలను ఈ సందర్భంగా గుర్తు చేస్తూ, బీసీల అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎంతో ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. మత్స్యకారుల భృతిని ?10,000 నుండి ?20,000 కు పెంచామన్నారు. గతంలో 9 మత్స్యకార గురుకుల పాఠశాలలను ఏర్పాటు చేసి, అందులో 47% రిజర్వేషన్లు మత్స్యకార బిడ్డలకే ఇచ్చామని గుర్తు చేశారు. డీజిల్ సబ్సిడీ, వలలు, పడవలు, ఐస్ బాక్స్ లు, మోపెడ్లపై సబ్సిడీలను అందిస్తున్నట్లు తెలిపారు. చేపల పెంపకం, విక్రయాల్లో మహిళలకు 60% సబ్సిడీ అందిస్తూ వారిని ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. చేపలు, రొయ్యలు వంటి ప్రోటీన్ ఆహారం తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలను వివరిస్తూ, ఉత్పత్తితో పాటు వినియోగాన్ని కూడా పెంచాలని పిలుపునిచ్చారు. మత్స్యకారులందరూ ఈ కూటమి ప్రభుత్వానికి ఎల్లవేళలా అండగా ఉండాలని మంత్రి సవిత తెలియజేశారు. రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక, పాడి పరిశ్రమల అభివృద్ధి, వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ.. తమ ప్రభుత్వానికి మత్స్యకార సామాజిక వర్గం అంటే ఎంతో ఇష్టమని, స్వాతంత్ర్యం వచ్చిన 35 ఏళ్ల వరకు మత్స్యకారులను కేవలం ఓటు బ్యాంకుగా మాత్రమే చూశారని, కానీ దివంగత స్వర్గీయ ముఖ్యమంత్రి యన్.టి రామారావు నుండి వారికి రాజకీయ, ఆర్థిక, సామాజిక గుర్తింపు లభించిందని గుర్తుచేశారు. గత 44 ఏళ్లుగా కష్ట సుఖాల్లో మత్స్యకారులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వానికి వెన్నంటి ఉంటున్నారని పేర్కొన్నారు. మత్స్యకార గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన ఘనత తమదేనని, ఈ విషయాలను నేటి యువతకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. రాష్ట్రానికి సుదీర్ఘ తీరప్రాంతం ఉందని, మన రాష్ట్ర ప్రజలు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా తమ కష్టార్జితంతో అభివృద్ధి సాధిస్తూ రాష్ట్రాన్ని గర్వపడేలా చేస్తున్నారని అభినందించారు. మత్స్యకారుల సంక్షేమం, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం మత్స్యకారులకు తీవ్ర అన్యాయం చేసిందని, కేంద్ర నిధులను దారి మళ్లించి, కనీసం డీజిల్ సబ్సిడీ, ప్రమాద బీమా వంటివి కూడా సరిగ్గా అందించలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం మత్స్యకారులకు అండగా ఉంటుందని, ఇప్పటికే పెండింగ్లో ఉన్న నష్ట పరిహారాలను విడుదల చేశామని తెలిపారు. రాబోయే మూడేళ్లలో మత్స్యకారుల ఆదాయం గణనీయంగా పెరగాలని, ఆక్వా రంగంలో రాష్ట్రం ప్రథమ స్థానంలో ఉండేలా అందరం కలిసి పని చేయాలన్నారు. పాత పద్ధతులకు స్వస్తి పలికి, ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకుంటేనే ఆర్థికంగా బలోపేతం కాగలమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలియజేశారు. రాష్ట్ర మత్స్యశాఖ కమిషనర్ రామ్ శంకర్ నాయక్ మాట్లాడుతూ వేట నిషేధ సమయంలో మత్స్యకారులకు రూ. 240 కోట్ల మేర ఆర్థిక సహాయం అందించడం జరిగిందన్నారు. మత్స్యకారులకు, ఆక్వా కల్చర్ రైతులకు వలలు, ఐస్ బాక్సులు, బోట్లను ప్రభుత్వం పంపిణీ చేస్తోందన్నారు. ప్రధాన మంత్రి మత్య సంపద యోజన (పీఎంఎంఎస్‌వై) పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో మత్స్యకారులకు అనేక సంక్షేమ పథకాలతో మేలు చేకూరుస్తున్నామన్నారు.కార్యక్రమంలో ప్రభుత్వ విప్, కడప శాసనసభ్యులు రెడ్డప్పగారి మాధవిరెడ్డి, అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాపారావు, బెస్త కార్పొరేషన్ చైర్మన్ శ్రీధర్, జాతీయ మత్స్యకార సంఘం రాష్ట్ర అధ్యక్షులు అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య లిమిటెడ్ (ఆఫ్ కాఫ్) సభ్యుల వివరాలు..**

చీకటి శ్రీరాములు, ఇఖీజూ ప్రెసిడెంట్, శ్రీకాకుళం.,
సింగిడి పాపారావు ఇఖీజూ ప్రెసిడెంట్, విజయనగరం.,
యం. గురునాథ రావు, ఇఖీజూ ప్రెసిడెంట్, విశాఖపట్నం,
యం. వసంత రావు, ఇఖీజూ ప్రెసిడెంట్, పశ్చిమ గోదావరి., శ్రీ కొక్కిలిగడ్డ నాగ రమేష్, ఇఖీజూ ప్రెసిడెంట్, కృష్ణా.,
కన్నా భూశంకర్, ఇఖీజూ ప్రెసిడెంట్, గుంటూరు.,
జి. పేరయ్య, ఇఖీజూ ప్రెసిడెంట్, ప్రకాశం.,కొండూరు పాలుశెట్టి, ఇఖీజూ ప్రెసిడెంట్, నెల్లూరు.,
జి.వి. రత్నం, ఇఖీజూ ప్రెసిడెంట్, చిత్తూరు.,బి.శివ నవీన్ కుమార్, ఇఖీజూ ప్రెసిడెంట్, కర్నూలు.,
యం. నగేష్, ఇఖీజూ ప్రెసిడెంట్, అనంతపురం.

ముందుగా చైర్మన్, ఉపాధ్యక్షులు, పాలకవర్గ సభ్యులతో మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రమాణ స్వీకారం చేయించారు..

## ఏం చేశారు జగన్

తర్వాత చేసే పాదయాత్ర గురించి ఇప్పుడు ఎందుకు ప్రకటన చేశారని ప్రశ్నించారు. విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో షర్మిల మాట్లాడారు. మహాత్మాగాంధీ ఉపాధి హామీ చట్టం పరిరక్షణ లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా ఫిబ్రవరి 2 నుంచి యాత్ర చేపట్టనున్నట్లు షర్మిల వెల్లడించారు. అప్పట్లో పథకం ప్రారంభమైన శింగనమల నియోజకవర్గం బండ్లపల్లి నుంచి మళ్లీ యాత్రను ప్రారంభిస్తున్నామని చెప్పారు. తానే స్వయంగా అన్ని జిల్లాల్లో పర్యటిస్తానని తెలిపారు. మహాత్మా గాంధీ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర ప్రభుత్వం కొనసాగించాలని, కూలీల రోజువారీ వేతనాన్ని రూ.400కు పెంచాలని డిమాండ్ చేశారు.

**జనాభా లెక్కల సేకరణ-2027పై**

## ప్రజల్లో అవగాహన కల్పించాలి

నిర్మాణానికి భూమి కేటాయింపు, పాజిటివ్ పబ్లిక్ పెరసెప్షన్ అంశాలపై జిల్లా గురువారం ఎపి సచివాలయం నుండి ఆయన జిల్లా కలక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ముందుగా 2027 జనాభా లెక్కల సేకరణ సన్నాహక ఏర్పాట్లపై మాట్లాడుతూ జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ సక్రమంగా సజావుగా నిర్వహించేందుకు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆదిశగా కలక్టర్లు తగిన చర్యలు తీసుకోవాలని చెప్పారు.ఇందుకు సంబంధించి ఇప్పటికే రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ తగిన మార్గదర్శకాలను జారీ చేయడం జరిగిందని వాటిని తుఛ తప్పక పాటించి రానున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కలక్టర్లకు స్పష్టం చేశారు.జనాభా లెక్కల సేకరణ-2027పై ప్రజల్లో అవగాహనకు ప్రత్యేక ఐఇసి మెటీరియల్ ను ప్రచురించి అన్ని జిల్లాలకు పంపాలని రాష్ట్ర సెన్సస్ డెరెక్టర్ జె.నివాస్ ను సిఎస్ విజయానంద్ ఆదేశించారు. అంతకు ముందు రాష్ట్రంలోని 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 175 ఎంఎస్ఎంఇ పార్కులు ఏర్పాటు ప్రక్రియ ప్రగతిని సిఎస్ విజయానంద్ కలక్టర్లతో సమీక్షించారు.తదుపరి డిస్పెన్సరీలు,ఐఎంఎస్ ఆసుపత్రుల నిర్మాణానికి భూమి కేటాయింపు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ జె.నివాస్ మాట్లాడుతూ గత జనాభా లెక్కల సేకరణ 2011లో జరిగిందని తదుపరి జనాభా లెక్కల సేకరణ వచ్చే ఏడాది జరగనుందని తెలిపారు.రానున్న జనాభా లెక్కల సేకరణ ప్రక్రియ రెండు దశల్లో జరుగుతుందని మొదటి దశ హౌస్ లిస్టింగ్ అండ్ హౌసింగ్ సెన్సస్(హెచ్ఎల్ఓ),రెండవ దశ పాపులేషన్ ఎన్యుమరేషన్ (పిఇ)జరుగుతుందని వివరించారు.ఇందుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం గత జూన్ 16 గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయగా మొదటి దశ జనాభా లెక్కల సేకరణకు ఈనెల 7వ తేదీన నోటిఫికేషన్ జారీ చేయడం జరిగిందని వివరించారు.2027 జనాభా లెక్కల సేకరణ ప్రక్రియకు సంబంధించి ఇప్పటికే జిల్లా కలక్టర్లతో సమావేశం నిర్వహించినట్టు వివరించారు.ఇందుకు సంబంధించి మార్గదర్శకాలన్నీ జిల్లా కలక్టర్లకు పంపడం జరిగిందని తెలిపారు.జిల్లా స్థాయిలో జిల్లా కలక్టర్,మున్సిపల్ కార్పొరేషన్ స్థాయిలో మున్సిపల్ కమీషనర్ ప్రిన్సిపల్ సెన్సస్ అధికారిగాను,మండల స్థాయిలో ఆర్డీఓ,తహసిల్దార్,బిడిఓలు చార్జి అధికారులుగా ఉంటారని చెప్పారు.జనాభా లెక్కల సేకరణకు ఎన్యుమరేటర్లు,సూపర్ వైజర్లుగా ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు,స్వర్ణ గ్రామం,వార్డుల ఉద్యోగులు,స్థానిక సంస్థల ఉద్యోగులను వినియోగించు కుని వారికి తగిన పారితోషికం అందించడం జరుగుతుందని డైరెక్టర్ నివాస్ పేర్కొన్నారు.ఈ ఏడాది ఏప్రిల్ 1నుండి సెప్టెంబరు 30 వరకూ హౌస్ లిస్టింగ్ మరియు హౌసింగ్ సెన్సస్ ప్రక్రియ జరుగుతుందని తెలిపారు.ఫిబ్రవరి 3వ వారంలో ప్రిన్సిపల్ సెన్సస్ అధిరారులు,మున్సిపల్ కమీషనర్లకు శిక్షణా కార్యక్రమం ఉంటుందని రాష్ట్ర సెన్సస్ డైరెక్టర్ నివాస్ అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సర్వీసెస్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్.ఎస్.రావత్, ఆర్టీజిఎస్ సిఇఓ ప్రఖర్ జైన్ పాల్గొన్నారు.అలాగే వర్చువల్ గా రాష్ట్ర పరిశ్రమలు,వాణిజ్యశాఖ కార్యదర్శి ఎన్.యువరాజ్,ఐఅండ్పిఆర్ డైరెక్టర్ కెఎస్,విశ్వనాథన్,జిల్లా కలక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

**కల్తీ నెయ్యిపై అసెంబ్లీలో**

## జగన్ చర్చకు రావాలి

నమ్మకం లేకే దోపిడీ కోసం నిబంధనలు సడలించారు. డెయిరీలకు భారీ ఆర్డర్లు ఇచ్చి హవాలా ముడుపులు అందుకున్నారు. లడ్డూకు వాడిన నకిలీ పదార్థాల్లో రసాయనాలు వెలుగు చూశాయి. పూర్తి నివేదిక వచ్చాక మరిన్ని వాస్తవాలు వెలుగులోకి వస్తాయి" అని మంత్రి కొల్లు అన్నారు.

వైకాపా నేతలకు భారీగా ముడుపులు: ప్రభుత్వ విప్ కాలవ

"జగన్ ఐదేళ్ల పాలనలో ఎన్నో పాపాలు జరిగాయి. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది శ్రీవారి భక్తుల విశ్వాసాలకు విఘాతం కలిగింది. ఆధ్యాత్మిక చింతన, దైవభక్తి లేని కరుణాకర్ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి లాంటి వారిని ఛైర్మన్‌లుగా నియమించి భక్తుల మనోభావాలను దెబ్బతీశారు. పవిత్రమైన తిరుమల లడ్డూను కల్తీ నెయ్యితో నాసిరకంగా తయారు చేశారు. వైకాపా నేతలకు పెద్ద ఎత్తున హవాలా సొమ్ము అందింది. తిరుమలలో నెయ్యి కల్తీ బాధ్యులను కఠినంగా దండించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నా" అని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు.

వైకాపా నాయకుల్లో భయం: ఆదిరెడ్డి శ్రీనివాస్

"శ్రీవారి లడ్డూ ప్రసాదంలో జరిగిన తప్పిదాలను మా కూటమి ప్రభుత్వం బయటకు తీసుకొస్తున్న కొద్దీ వైకాపా నేతలకు భయం పట్టుకుంది. లడ్డూ ప్రసాదంలో వైకాపా నేతలు అపచారం చేశారు కాబట్టే గత ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయారు. స్వామివారి లడ్డూ ప్రసాదంలో కల్తీ జరిగిందని దేశ అత్యున్నత న్యాయస్థానం ఏర్పాటు చేసిన సిట్ విచారణలో తేలింది. ఐదేళ్ల వైకాపా పాలనలో లడ్డూ ప్రసాదంలో కల్తీ చేయడం వల్ల అక్రమంగా రూ.250 కోట్ల వరకూ ఆర్జించారు. చిరు ఉద్యోగి అయిన చిన్న అప్పన్న ఖాతాలో రూ. 4.69 లక్షలు ఎందుకు జమ అయ్యాయి? 20 కోట్ల లడ్డూల్లో జరిగిన అవినీతి గురించి మాట్లాడకపోతే దేని గురించి మాట్లాడాలి?" అని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రశ్నించారు.

వారికి బాగా తెలుసు: మాజీ ఎమ్మెల్యే వర్మ

"పాలతో పనిలేకుండా రసాయనాలు ఉపయోగించి నెయ్యి ఎలా తయారు చేయవచ్చో వైకాపా నేతలకు బాగా తెలుసు. తిరుమల పవిత్రతకు భంగం కలిగించేలా, భక్తుల విశ్వాసాలు దెబ్బతీసేలా వ్యవహరించినవారికి శిక్ష పడాలి. తొలి నుంచీ వైకాపా నేతల నేర ప్రవృత్తి భిన్నంగా ఉండేది. కోడికత్తి, గులకరాయి, గుండెపోటు, గొడ్డలివేటు, పరకామణి దొంగతనం సహా వారే చేసి.. తెదేపాపై నెట్టేయాలని ప్రయత్నాలు చేశారు. వైకాపా అక్రమాలను ప్రజల ముందు పెట్టాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేస్తున్నాం" అని మాజీ ఎమ్మెల్యే వర్మ తెలిపారు.

# ఎడిటర్ వాయిస్

## ఏపీ బడ్జెట్ భారీ మార్క్‌ని దాటుతుందా?

ఏపీ బడ్జెట్‌కి రంగం సిద్ధం అయింది. బడ్జెట్ సమావేశాలు ఏపీలో ఫిబ్రవరి నెలలో మొదలు కానున్నాయి. ఫిబ్రవరి 11 నుంచి ఏపీ అసెంబ్లీ సమావేశాలు స్టార్ట్ చేయనున్నారు. బడ్జెట్ సమావేశాల తొలి రోజు రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఆ తరువాత 12న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే కార్యక్రమం ఉంటుంది. ఇక 14న ఏపీ బడ్జెట్ ని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశపెడతారు. అదే రోజున వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు బడ్జెట్‌ని సభలో ప్రవేశపెడతారు.

**గతసారి బడ్జెట్‌లో :**

ఇదిలా ఉంటే 2024 జూన్ 12న ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. 2025లో పూర్తి స్థాయి బడ్జెట్ ని ప్రవేశపెట్టింది. గతసారి ఏకంగా మూడు లక్షల 22 వేల కోట్లకు పైగా భారీ బడ్జెట్ ని ఏపీ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. తొలిసారిగా ఏపీ బడ్జెట్ మూడు లక్షల కోట్లకు పైగా మార్క్ ని ఆ ఏడాది తాకింది. దానికి కారణం ఏపీ ఆదాయం పెరుగుతోందని వివిధ రంగాల నుంచి రావాల్సిన ఆదాయం వస్తుందని అంచనాలతో ఆ బడ్జెట్ ని రూపకల్పన చేశారు. ఇక ఈసారి బడ్జెట్ చూస్తే దానిని మించి ఉండొచ్చు అని అంటున్నారు.

**అభివృద్ధికి సూచికగా :**

ఈసారి బడ్జెట్ అభివృద్ధికి సూచికగా ఉండొచ్చు అని అంటున్నారు. ఈసారి బడ్జెట్ ఏకంగా మూడున్నర లక్షల కోట్ల రూపాయల పై దాటి ఉండొచ్చన్న అంచనాలు ఉన్నాయి. ఏపీలో గత ఏడాది కాలంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు వస్తున్నాయి. అంతే కాదు అభివృద్ధికి సంబంధించి కూడా యాక్షన్ ప్లాన్‌ని రెడీ చేసి మరీ అమలులోకి పెడుతున్నారు. దాంతో బడ్జెట్ సైజు కూడా బాగా పెరుగుతుందని అంటున్నారు. అలాగే అన్ని వర్గాలకు మేలు జరిగేలా ఈసారి బడ్జెట్ కూర్పు ఉండొచ్చు అని అంటున్నారు. అలాగే చూస్తే కనుక అమరావతికి భారీ వాటా ఉండొచ్చు అన్నది కూడా ఉంది. అలాగే పోలవరం కోసం కూడా కేటాయింపులు ఉండొచ్చు అని అంటున్నారు. ఏపీలో సాగునీటి పారుదల రంగానికి సైతం బడ్జెట్ లో అగ్ర తాంబూలం ఉండొచ్చు అని చెబుతున్నారు. అలాగే సంక్షేమం అభివృద్ధి రెండింటికీ సమంగా ఈ బడ్జెట్ ప్రాధాన్యత ఇస్తుందని చెబుతున్నారు.

**వ్యవసాయ బడ్జెట్‌లో :**

ఇక గత ఏడాది అంటే 2025-26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ బడ్జెట్ చూస్తే 48 వేల కోట్లతో ప్రవేశపెట్టారు. ఈసారి దానికి మించి ఉండొచ్చు అన్నది కూడా చెబుతున్నారు. కనీసంగా అరవై వేల కోట్ల



దాకా ఈసారి వ్యవసాయ బడ్జెట్ ని రూపకల్పన చేస్తున్నారు అని చెబుతున్నారు. మొత్తం మీద చూస్తే ఏపీ బడ్జెట్ ఈసారి ఆసక్తిని రేపుతోంది. గతానికి కంటే అధిక మొత్తాలే వివిధ రంగాలకు కేటాయింపులు చేస్తారు అని అంటున్నారు.

ఎడిటర్ : కె.సునీల్‌కుమార్




### డంబెల్‌తో మోది..

## స్వాట్ కమాండో హత్య

### గర్భిణి అని చూడకుండా భర్త ఘాతుకం



**విశ్వం వాయిస్ న్యూస్ :** అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వర్తించే స్వాడ్ కమాండో భర్త చేతిలో ప్రాణాలు కోల్పోయింది. గర్భిణి అన్న కనికరం లేకుండా డంబెల్‌తో కొట్టి చంపేశాడు. దిల్లీలో ఈ దారుణం చోటు చేసుకుంది. జాతీయ మీడియా కథనాల ప్రకారం.. దిల్లీ పోలీసు విభాగంలో కాజల్ చౌధరీ స్వాట్ కమాండోగా, ఆమె భర్త అంకుర్ రక్షణశాఖలో క్లర్క్‌గా పనిచేస్తున్నారు. ఆర్థికపరమైన అంశాల్లో వీరి మధ్య తరచూ గొడవలు జరిగేవి. జనవరి 22న అవి తీవ్రరూపం దాల్చడంతో విచక్షణ కోల్పోయిన అంకుర్ ఆమెపై దాడిచేసి, తలపై డంబెల్‌తో కొట్టాడు. తర్వాత అతడే ఆసుపత్రిలో చేర్పించాడని పోలీసులు వెల్లడించారు. తీవ్రంగా గాయపడిన ఆమె చికిత్స పొందుతూ మంగళవారం ప్రాణాలు కోల్పోగా.. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అదనపు కట్నం కోసం భర్త, అతడి కుటుంబం వేధించేదని ఆమె సోదరుడు నిఖిల్ ఆరోపించారు. "నా కుమార్తె నాలుగు నెలల గర్భిణి. అంకుర్ రెండు హత్యలకు పాల్పడ్డాడు" అని మృతురాలి తండ్రి వెల్లడించారు. వారిద్దరిది ప్రేమ వివాహమని, పెళ్లైన 15 రోజుల తర్వాత నుంచే వేధింపులు మొదలయ్యాయని వాపోయారు. అంకుర్‌పై హత్యకేసు నమోదైంది.

### బంగారు ఆభరణాలు తీసుకొని

## ప్రియుడితో ఉడాయించిన యువతి

**పట్టాభిపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** బంగారు ఆభరణాలు తీసుకొని తన కుమార్తె ప్రియుడితో ఉడాయించినట్లు ఓ తల్లి అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కథనం ప్రకారం.. మల్లికార్జునపేట 5వ లైనుకు చెందిన ఓ యువతి కొన్ని నెలల క్రితం ఎవరికీ చెప్పకుండా ఇంట్లో ఉన్న 32 గ్రాముల గొలుసు, ఉంగరం, చెవి దుద్దులు తీసుకొని ప్రేమించిన వ్యక్తితో వెళ్లిపోయింది. తిరిగి బుధవారం ఇంటికి వచ్చి మళ్లీ తన మెడలోని 28 గ్రాముల నానుతాడు లాక్కొని వెళ్లిపోయినట్లు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

## బాలల పొట్టకొడుతున్న బాలముకుందం

### వార్డెన్ల నుంచి రూ.1.84 లక్షల మామూళ్ల వసూలు
### ఏసీబీ దాడుల్లో పట్టుబడిన ఏబీసీడబ్ల్యూవో
### నగదుతో పట్టుబడిన ఏబీసీడబ్ల్యూవో బాలముకుందరావు



**సోంపేట, కంచిలి, విశ్వం వాయిస్ న్యూస్ :** ఆర్థికంగా వెనుకబడిన చిన్నారులు ఆసరా కోసం వసతి గృహాల పంచన చేరి చదువుకుంటున్నారు. వారికి మెస్ ఛార్జీల కింద ప్రభుత్వం నెలనెలా కొంతమొత్తం చెల్లిస్తుంటుంది. ప్రభుత్వం ఇచ్చేదే అరకొర అయితే, అందులోనూ 'గడ్డి' కరవడానికి అలవాటు పడిపోయారు కొంతమంది అధికారులు. ఏసీబీ డీఎస్పీ రమణమూర్తి, సీఐ భాస్కరరావు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాకుళం జిల్లా సోంపేట డివిజన్ సహాయక బీసీ సంక్షేమాధికారిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న 'గడ్డి బాలముకుందరావు' వసతి గృహాల వార్డెన్ల నుంచి మామూళ్ల కోసం బుధవారం కంచిలిలో ఏకంగా సమావేశం ఏర్పాటు చేశారు. ఇటీవల నాలుగు నెలల మెస్ ఛార్జీలు వార్డెన్ల ఖాతాల్లో జమ కావడంతో ఒక్కో విద్యార్థి నుంచి రూ.50 చొప్పున చెల్లించాలని ఆయన వార్డెన్లకు నిర్దేశించారు. ఈ సమావేశానికి హాజరైన కొందరు వార్డెన్లు తాము తీసుకొచ్చిన మొత్తాలను బాలముకుందరావు సూచన మేరకు అటెండర్ గుడ్ల రామకృష్ణకు అప్పగించారు. ఈ విషయం తెలిసిన ఏసీబీ అధికారులు ఆకస్మికంగా దాడిచేసి.. రూ.1,84,070 స్వాధీనం చేసుకున్నారు. ఈ వసూళ్లపై పూర్తిస్థాయిలో దర్యాప్తు నిర్వహిస్తున్నామని చెప్పారు.

### హైకోర్టులో బెయిల్ పిటిషన్


## దాఖలు చేసిన ఐబొమ్మ రవి



**హైదరాబాద్, విశ్వం వాయిస్ న్యూస్ :** సినిమా పైరసీ వ్యవహారంలో ఐబొమ్మ రవి హైకోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. ఇప్పటికే నాంపల్లి కోర్టులో పలుమార్లు బెయిల్ పిటిషన్లు దాఖలు చేయగా న్యాయస్థానం వాటిని కొట్టివేసింది. దీంతో ఐబొమ్మ రవి హైకోర్టును ఆశ్రయించాడు. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన ఉన్నత న్యాయస్థానం.. కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం కౌంటరు దాఖలు చేయనున్నారు. ఐబొమ్మ రవిపై సైబర్ క్రైమ్ పోలీసులు నాలుగు కేసులు నమోదు చేశారు. ప్రస్తుతం అతడు చంచల్‌గూడ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నాడు.

### పట్టపగలే ఇంట్లో చోరీ..

## 14 తులాల బంగారం మాయం



**కర్నూలు టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో పట్టపగలే చోరీ జరిగింది. ఈ ఘటన గురువారం కర్నూలు జిల్లా సంతోష్ నగర్ లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంతోష్‌నగర్‌కు చెందిన లక్ష్మీదేవి ఇంటికి తాళం వేసి తన కుమార్తెతో పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. పనులు ముగించుకొని ఇంటికి తిరిగి రాగా తాళం పగులగొట్టి ఉంది. గమనించిన తల్లీకుమార్తె ఇంట్లోకి వెళ్లగా గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు వారిని తోసేసి పరారయ్యారు. ఈ క్రమంలో లక్ష్మీదేవికి గాయాలయ్యాయి. 14 తులాల బంగారం చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## ప్రైవేట్ పాఠశాల బస్సులో మంటలు

### డ్రైవర్ అప్రమత్తతతో సురక్షితంగా విద్యార్థులు



**పుట్లూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పాఠశాల నుంచి 30 మంది విద్యార్థులతో బయలుదేరిన బస్సు అగ్నికి ఆహుతైన ఘటన అనంతపురం జిల్లాలో జరిగింది. డ్రైవర్ అప్రమత్తతతో ఎవరికీ ఏమీ కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. బుధవారం సాయంత్రం పుట్లూరులోని శ్రీరామ్ గ్లోబల్ పాఠశాల బస్సు డ్రైవర్ 30 మంది విద్యార్థులను ఎక్కించుకుని వారిని దించడానికి కడవకల్లు గ్రామానికి బయలుదేరాడు. మార్గమధ్యలో చింతకుంట గ్రామ శివారులో గేర్‌బాక్సులో సమస్యలు తలెత్తడంతో డ్రైవర్ బస్సును ఆపేశాడు. విద్యార్థులను కిందకు దించి మరమ్మతులు చేస్తుండగా ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో బస్సు అంతా వ్యాపించడంతో పూర్తిగా కాలిపోయింది. ప్రమాదానికి ముందే బస్సులోని విద్యార్థులను డ్రైవర్ కిందకు దింపేయడంతో పెనుప్రమాదం తప్పింది. ప్రైవేటు పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ సరిగా లేకున్నా అనుమతులు ఇవ్వడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.




## విద్యార్థులకు బిగ్ అలర్ట్..

### ఆ ప్రవేశ పరీక్షల తేదీలు వచ్చేశాయ్..



తెలంగాణలో 2026 విద్యా సంవత్సరానికి TG Ed.CET, TG ICET ప్రవేశ పరీక్షల షెడ్యూల్ విడుదలైంది. బీఈడీ, ఎంబీఏ, ఎంసీఏ కోర్సులలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్, దరఖాస్తు ప్రారంభ, చివరి తేదీలు, అలాగే పరీక్ష తేదీలను అధికారులు ప్రకటించారు. అభ్యర్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఇది తెలంగాణ ఉన్నత విద్య అభ్యసించాలనుకునే వారికి ముఖ్యమైన అప్‌డేట్. తెలంగాణలో ఉన్నత విద్య అభ్యసించాలనుకునే విద్యార్థులకు కీలక అప్‌డేట్ వచ్చేసింది. 2026 విద్యా సంవత్సరానికి సంబంధించి TG Ed.CET, TG ICET ప్రవేశ పరీక్షల షెడ్యూల్‌ను అధికారులు బుధవారం విడుదల చేశారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఈ కీలక నిర్ణయాలు తీసుకున్నారు. రాష్ట్రంలోని రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించే TG Ed.CET పరీక్షను ఈసారి కాకతీయ విశ్వవిద్యాలయం నిర్వహించనుంది. ఫిబ్రవరి 20న ఈ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.

**TG Ed.CET పరీక్ష షెడ్యూల్**

అలాగే ఈ నోటిఫికేషన్ కు సంబంధించి ఆన్‌లైన్ దరఖాస్తులు ఫిబ్రవరి 23, 2026 (సోమవారం) నుంచి ప్రారంభంకానున్నాయి. ఏప్రిల్ 18, 2026 (శనివారం)తో ధరఖాస్తుల స్వీకరణ గడువు ముగియనుంది. ఇక మే 12, 2026 (మంగళవారం) రోజున ఈ పరీక్షలు జరగనున్నాయి. మొదటి సెషన్ ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు, రెండవ సెషన్ మధ్యాహ్నం 2:00 నుండి సాయంత్రం 4:00 వరకు జరగనుంది.

**TG ICET పరీక్ష షెడ్యూల్**

ఇదిలా ఉండగా ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే TG ICET ప్రవేశ పరీక్షల నిర్వహణ బాధ్యతను నల్గొండలోని మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయానికి అప్పగించింది తెలంగాణ విద్యాశాఖ. ఈ ప్రవేశ పరీక్షలకు సంబంధించిన నోటిఫికేషన్ ఫిబ్రవరి 6, 2026న విడుదల కానుంది. అలాగే ఫిబ్రవరి 12, 2026 నుంచి ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం కానుంది. మార్చి 16, 2026 సోమవారంతో రిజిస్ట్రేషన్ గడువు ముగియనుంది. ఈ పరీక్షలు మే 13, 14 తేదీల్లో నిర్వహించనున్నారు. మొదటి సెషన్ ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 వరకు జరగనుండగా, సెకెండ్ సెషన్ మధ్యాహ్నం 2:30 నుండి సాయంత్రం 5:00 వరకు ఉంటుంది. ఈ పరీక్షలన్నీ కంప్యూటర్ ఆధారిత పద్ధతిలో నిర్వహించబడతాయి. అర్హత గల అభ్యర్థులు నిర్ణీత గడువు లోగా అధికారిక వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కన్వీనర్లు సూచించారు.

### యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్

## 2026 నోటిఫికేషన్ వచ్చేస్తుంది..

యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2026 నోటిఫికేషన్ విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ వారంలోనే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. నిజానికి జనవరి 14వ తేదీనే సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా.. దేశవ్యాప్తంగా లక్షలాది మంది అభ్యర్థులు ఎదురుచూస్తున్న యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ 2026 నోటిఫికేషన్ విడుదలకు ముహూర్తం ఖరారైంది. ఈ వారంలోనే నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. నిజానికి జనవరి 14వ తేదీనే సివిల్ సర్వీసెస్ నోటిఫికేషన్ విడుదల కావాల్సి ఉంది. అయితే కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా వేస్తున్నట్లు యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఓ ప్రకటనలో తెలిపింది. అందిన సమాచారం మేరకు ఈ వారం చివరిలోపు సివిల్స్ అధికారిక నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఇక నోటిఫికేషన్ విడుదలైన తేదీ నుంచే ఆన్‌లైన్ దరఖాస్తులు కూడా ప్రారంభం అవుతాయి. మే 24వ తేదీన దేశ వ్యాప్తంగా పలు పరీక్ష కేంద్రాల్లో ఆఫ్‌లైన్ విధానంలో ప్రిలిమ్స్ పరీక్ష జరగనుంది. ఏదైనా విభాగంలో డిగ్రీలో ఉత్తీర్ణత పొందిన అభ్యర్థులు ఎవరైనా దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే అభ్యర్థుల వయసు తప్పనిసరిగా 21నుంచి 32 ఏళ్ల మధ్య ఉండాలి. ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల తుది ఎంపిక ఉంటుంది. ఇతర వివరాలు నోటిఫికేషన్ విడుదలైన తర్వాత తెలుసుకోవచ్చు.





**సీయూఈటీ పీజీ 2026 కరెక్షన్ విండో ఓపెన్.. ప్రవేశ పరీక్ష ఎప్పుడంటే?**

కామన్ యూనివర్సిటీ ఎంట్రన్స్ టెస్టు (సీయూఈటీ) పీజీ 2026 ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ముగిసిన సంగతి తెలిసిందే. అయితే దరఖాస్తు సమయంలో ఏవైనా పొరబాట్లు చేస్తే.. వాటిని సరి చేసుకోవడానికి కరెక్షన్ విండోను జనవరి 30 వరకు అందుబాటులో ఉంచింది. ఈ మేరకు ఎన్‌టీఏ ప్రకటన విడుదల చేసింది. కాగా జనవరి 23వ తేదీతో ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ముగిసింది. ముగింపు సమయంలోగా దరఖాస్తుల్లో తప్పులు సవరణ చేసుకోవచ్చు. ఆన్‌లైన్ పరీక్షలు దేశ వ్యాప్తంగా 276 నగరాల్లో 2026 మార్చిలో జరగనున్నాయి. మొత్తం 157 సబ్జెక్టుల్లో ఈ పరీక్ష ఉంటుంది.

# విశ్వం వాయిస్

అవినీతిపై- అక్షరసమరం...



కాకినాడ తూర్పు గోదావరి

డా బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ

శుక్రవారం, 30 జనవరి 2026




www.viswamvoice.com



# వివాహమా..! వివాదమా..!

**వివాహ వ్యవస్థ క్షీణిస్తుంది.. విడాకుల సంఖ్య చిగురిస్తుంది..**

పెళ్ళి అనేది రెండక్షారాల పదం కాదు.. రెండు జీవితాలతో ముడిపడిన నూరేళ పంట అనే భావం.. ఈ సమాజంలో నానాటికి నశించిపోతుంది. పెళ్ళి అని అనుకునేకన్నా.. విలువలు తెలియని వ్యక్తికి.. లేదా పెళ్ళి పట్ల.. వివాహ వ్యవస్థ పట్ల.. భార్యగా వచ్చే వ్యక్తి పట్ల సరైన అవగాహన కల్పించలేని సమాజంలో జరుగుతున్న కార్యక్రమం అనాలో తెలియటం లేదని.. కొందరు భాదిత మహిళల మనోవేదన పై ప్రత్యేక కధనం. ప్రపంచంలోనే ఎంతో ఆదర్శవంతంగా భావించే భారతదేశపు వివాహ వ్యవస్థ నేడు అవస్థపడుతుంది. నూరేళ్ళ జీవితాన్ని రెండక్షరాల పెళ్ళి పిడిస్తుంది. మాయని గాయంగా మారి వేధిస్తుంది. రెండు జీవితాలను ముడి వేసే పెళ్ళి నేడు సమాధానం లేని ప్రశ్నగా మిగిలిపోతుంది. ఎన్నో ఆశలు, మరెన్నో కోరికలు, అందమైన ఊహలను రేకేతిస్తుంది పెళ్ళి అనే రెండక్షరాల పదం ఆడపిల్లల జీవితాలలో. అప్పటివరకు కన్నవారి కంటిపాపల అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేసిన తల్లితండ్రులకు ఆడబిడ్డలకు పెళ్ళి చేయడం ఒక పెద్ద పరీక్ష లాంటిది. పెళ్ళి సాధరణంగా ఆడపిల్లలకు మానసికంగా, శారీరకంగా ఒత్తిడికి గురి చేస్తుంది. కానీ జీవిత భాగస్వామి అర్థం చేసుకునేవాడైతే ఆ జంట సుఖసంతోషాలతో తమ జీవిత ప్రయాణం సాగిస్తారు. ఈరోజులలో వివాహ వ్యవస్థకు అర్థం, పరమార్ధం మారిపోయిందా! లేక అవగాహన లోపించిందా! అనే సందేహాలు చాలా తలెతతున్నాయి. నేటి సమాజంలో నవ జంటలు కాళ్ళ పారాని ఆరాక ముందే పోలీస్ స్టేషన్ గుమ్మాలు తొక్కుతున్నారు, కోర్టుల చుట్టూ తిరుగుతున్నారు. ఇందుకు కారణం ఈ సమాజమా! లేక వ్యవస్థ. ఏది ఏమైనప్పటికి నాటి సమాజంలో కుటుంభ వ్యవస్థ భలోపేతంగా ఉండేది. నేడు కుటుంభ వ్యవస్తే దిక్కుతోచని స్థితిలో వుంది. పెళ్ళి అనే పేరుతో ఏర్పడే బంధంతో.. ఆ క్షణమే జీవితం మొత్తం అయితే పూల భాట్టగాను, లేక ముళ్ల భాట్టగాను ఎర్పాడేది ఆడబిడ్డలకే. ఎందుకనో ఈ సమాజం ఆడబిడ్డల పట్ల సరైన అవగాహన కలిపించడంలో వెనుకబడుతుంది. ఆడబిడ్డలను అంగడిలో బొమ్మలలాగా.. వాడుకొని వదిలేసే వస్తువులగా, కట్టు బానిసలలాగా భావించేటట్టు నేటి యువతను తప్పు దారి పాటిస్తుందా! అనే ఆవేదన ఆడబిడ్డల తల్లితండ్రులకు వుంది. చూపించే విధానంబట్టి, కల్పించే అవగాహనను అనుసరించి, ఏ వ్యక్తికైనా, వస్తువుకైనా విలువ ఏర్పడుతుంది. అటువంటిది నేటి సమాజంలో స్త్రీలపైన భావితరాలకు ఏ విధమైన అవగాహన కల్పిస్తున్నాము, రూపకల్పన చేస్తున్నాము అనే అంశాలు కూడా నేటి స్త్రీ సమాజం ఎదురుకుంటున్న సమస్యలకు ప్రధాన కారణం కావచ్చు. ప్రభుత్వాలు, అధికారులు ఎన్ని చట్టాలు చేసినా, సమాజంలో స్త్రీల పట్ల గౌరవం, మర్యాద ఏర్పడే విధానాన్ని తీసుకు రావడానికి ఈ సమాజమే నడుం బిగించాలి. వివాహ వ్యవస్థ అస్తవ్యస్తంగా కావడానికి ఇంస్టాగ్రామ్ ,ఫేస్ బుక్ మరియు వాట్సాప్ కొన్ని కారణాలుగా చెప్పవచ్చు. అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీని ఉపయోగించుకుంటే అన్ని రకాలుగా అభివృద్ధి చెందవచ్చు కానీ.. ఈ టెక్నాలజీని అనవసరంగా కొన్ని వ్యవహారాల్లో కలుగజేసుకొని.. కుటుంబాలు చిన్నభినం కావడానికి కారణామవుతుంది. పెళ్లి అయిన వారు కొందరు విడాకులు తీసుకుంటుంటే, మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. పిల్లలు అనాధలుగా ఉండిపోతున్నారు. సమాజం ఏమవుతుందో అనేది ప్రశ్నార్థకంగా మారడానికి సామాజిక మధ్యమాలు కూడా కారణం అవుతున్నాయి. కారణాలు ఎన్నైనా కావచ్చు పరిష్కారం మాత్రమే ప్రధానం. కనీసం రేపటి తరం తల్లితండ్రులకైనా తమ ఆడబిడ్డల భవిష్యత్తుకు భరోసా కల్పించాలి. వివాహ వ్యవస్థ బలోపేతం కావాలి అని పత్రిక ముఖంగా బాధిత మహిళలు కోరుకొంటున్నారు.

**లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవానికి**

# హాజరైన ఎంపీ హరీష్ బాలయోగి





**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అంతిర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి కళ్యాణ మహోత్సవం భక్తజన సంద్రంగా వైభవోపేతంగా జరిగింది. ఈ మహోత్సవానికి అమలాపురం పార్లమెంట్ సభ్యుడు గంటి హరీష్ బాలయోగి ప్రత్యేక అతిథిగా హాజరై స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి కల్యాణ కార్యక్రమాన్ని ప్రత్యక్షంగా వీక్షించిన ఎంపీ, వేద మంత్రోచ్చారణల మధ్య జరిగిన కళ్యాణ వేడుకల్లో పాల్గొని భక్తులతో కలిసి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ అర్చకులు ఎంపీకి తీర్థ ప్రసాదాలు అందించి స్వామివారి శేష వస్త్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీ హరీష్ బాలయోగి మాట్లాడుతూ అంతర్వేది శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కళ్యాణ మహోత్సవం భక్తుల మనోభావాలకు ప్రతీక. ఈ పవిత్ర వేడుకల్లో పాల్గొనడం ఎంతో ఆనందాన్ని కలిగించింది. స్వామివారి కృపతో రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆలయం పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాల అలంకరణతో శోభాయమానంగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామివారి కల్యాణాన్ని తిలకించి భక్తి పారవశ్యంలో మునిగిపోయారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో, అర్చకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

# కాశీ మాస్టారి జయంతి సందర్భంగా పేద వృద్ధురాలికి మానవతా చేయూత

**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** ఉప్పలగుప్తం మండలం, పెదగాడవిల్లి గ్రామానికి చెందిన పేద వృద్ధురాలు చింతలపూడి సత్యవతి ఎదుర్కొంటున్న కష్టాలను గ్రామానికి చెందిన పెనుమల్లె వెంకన్న ద్వారా తెలుసుకున్న సూరపురెడ్డి సురేష్ మానవతా హృదయంతో స్పందించారు. ఈ సందర్భంగా జిల్లాపరిషత్ హైస్కూల్, గొల్లవిల్లి (1997-98) పూర్వ విద్యార్థినీ విద్యార్థుల సహకారంతో, విశ్రాంతి వ్యాయామ ఉపాధ్యాయులు రంకిరెడ్డి కాశీ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని ఆయన సేవలను



స్మరించుకుంటూ, సుమారు రూ.2000 విలువైన నిత్యావసర వస్తువులను గురువారం గ్రామ పెద్దల చేతుల మీదుగా సత్యవతికి అందజేశారు. వృద్ధాప్యంలో ఆధారంలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తనకు ఈ సహాయం ఎంతో ఊరటనిచ్చిందని తెలిపిన చింతలపూడి సత్యవతి, తనను ఆదుకున్న పూర్వ విద్యార్థులు, సూరపురెడ్డి సురేష్‌తో పాటు కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. కాశీ మాస్టారి జయంతి రోజున మానవతా విలువలకు అద్దం పట్టేలా జరిగిన ఈ సేవా కార్యక్రమం గ్రామస్తుల నుంచి ప్రశంసలు అందుకుంది.

# తిరుమల లడ్డు కల్తీ మహాపాపం

**అపచారానికి ప్రాయశ్చిత్తంగా అమలాపురంలో వెంకటేశ్వర స్వామి ఆలయ శుద్ధి**

**లడ్డు కల్తీ దోషులకు కఠిన శిక్ష తప్పదని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు హెచ్చరిక**



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం లడ్డు ప్రసాదం తయారీలో గత ప్రభుత్వ హయాంలో చోటు చేసుకున్న కల్తీ వ్యవహారం కోట్లాది మంది హిందువుల మనోభావాలను తీవ్రంగా దెబ్బ తీసిందని అమలాపురం ఎమ్మెల్యే అయితా బత్తుల ఆనందరావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ మహాపాపానికి ప్రాయశ్చిత్తంగా అమలాపురం పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ఆలయ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వయంగా ఆలయ ప్రాంగణాన్ని శుద్ధి చేసి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమల లడ్డు పవిత్రతకు జరిగిన అపచారాన్ని ఖండిస్తూ, ధర్మ పరిరక్షణ లక్ష్యంగా ఈ కార్యక్రమం చేపట్టినట్లు ఆయన తెలిపారు. ఆలయ శుద్ధి అనంతరం నిర్వహించిన భారీ మహిళా ర్యాలీ పట్టణాన్ని కదిలించింది. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని, తిరుమల పవిత్రతను కాపాడాలి లడ్డు కల్తీకి పాల్పడిన వారిని శిక్షించాలి అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ "ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది భక్తుల విశ్వాసానికి ప్రతీక అయిన తిరుమల లడ్డునే కల్తీకి గురిచేయడం అత్యంత హేయమైన చర్య. భక్తుల నమ్మకాన్ని ద్రోహించిన వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టం. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ధర్మ పరిరక్షణ కోసం కఠిన నిర్ణయాలు తీసుకుంటున్నారు. లడ్డు కల్తీకి బాధ్యులైన వారిపై సమగ్ర విచారణ జరిపి, కఠిన శిక్షలు విధించాల్సిందే" అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కందుకూరి ఆశయాలకు తూట్లు పొడిస్తే ఊరుకోము : ఎస్ఎఫ్ఐ హెచ్చరిక

**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గురువారం శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాలను ఎస్.ఎఫ్ ఐ రాష్ట్ర అధ్యక్షులు పి. రామ్మోహన్ సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామ్మోహన్ మాట్లాడుతూ కందుకూరి ఆశయాలకు తట్లు పొడిచేలా ఉన్న హితకారిణి సమాజం వైఖరిని కండిస్తున్నామని, గత కొన్ని రోజులుగా శ్రీమతి కందుకూరి రాజ్యలక్ష్మి మహిళా కళాశాల విద్యార్థులు తమ హాస్టల్ సమస్య పైన పోరాటం చేస్తున్నారని అన్నారు. స్థానికంగా ఉన్న హితకారిణి సమాజం పాలక మండలి చైర్మన్ కళాశాల లోపల ఉన్న హాస్టల్ ను స్వాదీనం చేసుకొని వారు నడుపుతున్నారు అని, ఎండోమెంట్ కమిషనర్ నుంచి హాస్టల్ ను కళాశాలకు అప్ప చెప్పమని ఉత్తర్వులు పంపిన అప్ప చెప్పకుండా వాల్లే నడుపుతున్నారు. దీనిని ఎస్ఎఫ్ఐ గా పూర్తిగా వ్యతిరికిస్తునాం అని తెలిపారు. జీవో నెంబర్ 42 ప్రకారం రాజమంద్రిలో ఉన్న కందుకూరి విద్యాసంస్థలని దాని ఆస్తులని ప్రభుత్వనికి అప్పచెప్పారు. కానీ రాజమంద్రిలో ఉన్న



హితకారిణి సమాజం, ఎండోమెంట్ స్థానికంగా ఉన్న ప్రముఖుల సహాయం తో ఈ ఆస్తులను కాజేయాలి అని చుస్తునారు. దీనికి రాజమంద్రి లో ఉన్న పోలీస్ శాఖ మద్దతుగా తెలియజేస్తుంటే కూటమి ప్రభుత్వం ఎం చేస్తుంది అని ప్రశ్నించారు. విద్యార్థులు కనీసం నిరసన తెలియజేయడానికి కూడా లేని విధంగా పోలీసులు నిర్బంధం విదిస్తున్న పరిస్థితి ఉంది అని అన్నారు. జిల్లాలో పోలీసులు కి వేరే ఏ సమస్యలు కనిపించట్లేదా అని అడిగారు. నేడు జిల్లాలో అస్లీల నృత్య ప్రదర్శనలు జరుజగుతున్నాయి, నగరం లో గంజాయి పేరుకుపోతుంది వీటిమీద పోలీసులు ఏమి స్పందిస్తున్నారు అని ప్రశ్నించారు. ఇలాంటి సమస్యల పయిన పోలీసులు స్పందించకుండా విద్యార్థులు న్యాయమైనా కోరికలు అడుగుతూ శాంతియుతం గా నిరసన తెలియజేస్తుంటే వారిని అడ్డుకోవడమేనా పోలీసులు పని అని ప్రశ్నించారు. పోలిసుల ఈ అనైతిక వైఖరిని ఎస్ఎఫ్ఐ తీవ్రంగా కండిస్తుందని అన్నారు. ఈ కళాశాల ఆస్తులు అన్ని విద్య శాఖకే చెందుతాయి అని వాటిని అన్యాక్రాంతం కాకుండా ఎస్ఎఫ్ఐ కాపాడుతుంది అని అన్నారు. రేపు జరగబోయే రౌండ్ టేబుల్ సమావేశానికి విద్యార్థి, యువజన, ప్రజా, దళిత సంఘాల్ని, పొలిటికల్ పార్టీలని కలుపుకొని ఐక్య కార్యాచరణ రూపొందిస్తామని, భవిష్యత్తులో ఈ ఆస్తులు అన్యాక్రాంతం కాకుండా పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తామని ప్రభుత్వాని హెచ్చరించారు. కందుకూరి వారసులగా కందుకూరి ఆశయాలు కాపాడుతామని అన్నారు. ఈ ప్రెస్ మీట్ లో ఎస్.ఎఫ్.ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శిలు వై. భాస్కర్, ఎన్. రాజా, జిల్లా కమిటీ సభ్యులు కె. జ్యోతిర్మయి, ఎస్. కనక, శివ బాలాజీ పాల్గొన్నారు.

# కలెక్టర్ చొరవతో గల్ఫ్ గడప దాటిన కన్నీళ్లు

**సౌదీలో చిక్కుకున్న హైదరాబాద్ మహిళకు స్వదేశం దారి**



అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ : స్థానికంగా సరైన ఉపాధి అవకాశాలు లేక గల్ఫ్ దేశాలకు వెళ్లి అనుకోని పరిస్థితుల్లో సౌదీ అరేబియాలో తీవ్ర ఇబ్బందుల్లో చిక్కుకున్న హైదరాబాద్‌కు చెందిన జాల లక్ష్మిని, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ ప్రత్యేక చొరవతో క్షేమంగా స్వదేశానికి రప్పించినట్లు జిల్లా నోడల్ అధికారి, డీఆర్ఓ కె. మాధవి, సమన్వయకర్త జి. రమేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జాల లక్ష్మి భర్త జాల సురేష్ తెలిపిన వివరాల ప్రకారం పశ్చిమ గోదావరి జిల్లా ఏలూరులో 108 అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఆయన, తన ఇద్దరు పిల్లలు మంచి క్రీడాకారులుగా ఎదగాలన్న ఆశతో కుటుంబంతో కలిసి హైదరాబాద్‌కు వలస వచ్చారు. అయితే ఆర్థిక ఇబ్బందులు వెంటాడటంతో, ఏఎన్ఎం ట్రైనింగ్ పూర్తి చేసిన తన భార్య జాల లక్ష్మిని గల్ఫ్ దేశాలకు పంపించి పిల్లల భవిష్యత్తుకు బాటలు వేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో పరిచయస్తురాలు పాముల విజయ్ కుమారి ద్వారా 2024 జూన్ నెలలో జాల లక్ష్మిని కువైట్‌కు పంపించారు. అక్కడ మొదట ఒక ఇంట్లో పనిచేయించగా, అనంతరం ఆరోగ్య సమస్యలతో ఉన్న ఓ చిన్నారి సంరక్షణ బాధ్యతను అప్పగించారు. ఆ చిన్నారి చికిత్స నిమిత్తం సౌదీ అరేబియాకు తీసుకెళ్లగా, చికిత్స అనంతరం పాపను కువైట్‌కు పంపించి, జాల లక్ష్మిని మాత్రం సౌదీలోనే వదిలివేశారు. సౌదీలో సరైన వసతి, భోజనం లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న జాల లక్ష్మి... అటు కువైట్‌కు వెళ్లలేని పరిస్థితి, ఇటు స్వదేశానికి రావడానికి మార్గం లేక తీవ్ర మానసిక సంక్షోభంలో చిక్కుకున్నారు. ఈ నేపథ్యంలో కువైట్‌లోని భారత దౌత్య కార్యాలయంలోని ఒక వ్యక్తి సూచన మేరకు, డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్ నేతృత్వంలో పనిచేస్తున్న కోనసీమ వలసదారుల కేంద్రాన్ని సంప్రదించారు. వెంటనే స్పందించిన వలసదారుల కేంద్రం కేసు నమోదు చేసి, భారత రాయబార కార్యాలయం, సంబంధిత ఏజెంట్లతో సమన్వయం చేసి జాల లక్ష్మిని సురక్షితంగా స్వదేశానికి తీసుకువచ్చింది. చివరకు ఆమెను హైదరాబాద్‌లో ఉన్న తన భర్త వద్దకు క్షేమంగా చేర్చినట్లు అధికారులు తెలిపారు. ఈ రక్షణ చర్యల్లో వలసదారుల కేంద్ర సిబ్బంది కే. సత్తిబాబు, సఫియా దుర్గ కీలక పాత్ర పోషించారని అధికారులు వెల్లడించారు. గల్ఫ్ దేశాల్లో ఇబ్బందుల్లో చిక్కుకున్న వలస కార్మికులకు కోనసీమ వలసదారుల కేంద్రం ఒక ఆశాకిరణంగా నిలుస్తోందని ఈ సంఘటన మరోసారి నిరూపించింది.

**ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ స్థలం కొనుగోలుకు**

# ఆదిరెడ్డి ఐదు లక్షల రూపాయలు

**తాహతకు మించి పరుగులెట్టి బోర్ల పడొద్దు - ఆదిరెడ్డికి జిల్లా ఫోటోగ్రాఫర్స్ కృతజ్ఞతలు**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం ది గోదావరి ఫోటో గ్రాఫర్స్, రిలేటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన స్థల కొనుగోలుకు రాజమహేంద్రవరం రూరల్ శాసనసభ్యులు ఆదిరెడ్డి వాసు ఐదు లక్షల రూపాయలు అందజేసినట్లు రాజమహేంద్రవరం ఫోటోగ్రాఫర్స్ యూనియన్ సభ్యులు తెలిపారు. గురువారం కోలమూరు పరిధిలో రాజమహేంద్రవరం ఫోటోగ్రాఫర్ అసోసియేషన్ కొనుగోలు చేసిన స్థలంలో జిల్లా గార్డెన్ పార్టీ ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాజమహేంద్రవరం అర్బన్ శాసనసభ్యులు ఆది రెడ్డి వాసు ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫోటోగ్రఫీ గౌరవప్రదమైన వృత్తిని, ప్రతి ఒక్కరి గత తీపి స్మృతులను ఎప్పుడైనా కళ్ళకు కట్టినట్లుగా చూపించడం ఒక ఫోటోగ్రాఫర్ కి మాత్రమే సాధ్యమన్నారు. ఆధునిక పోటీ ప్రపంచంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ వృత్తిని కొనసాగించాలని, తాహతకు మించిన కెమెరాలు కొన్ని వాయిదాలు కట్టలేని పరిస్థితి తెచ్చుకోవద్దని హితవు పలికారు. చాలామంది ఎన్నికలలో ఇచ్చిన హామీ విజయం సాధిస్తేనే నెరవేరుస్తారని, తాను మాత్రం విజయానికి ముందే సోదరులకు ఐదు లక్షల రూపాయలు అందించానన్నారు. గత వైసిపి పుణ్యమా? అని వ్యాపారాలకు స్వస్థపలికానని, ప్రజలు ఆదరిస్తే పూర్తి సమయం రాజకీయాలకే వెచ్చిస్తానన్నారు. భవన నిర్మాణానికి కూడా తప్పనిసరిగా సహకారం అందిస్తానన్నారు. యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన బ్లడ్ క్యాంప్ లో, దాతలకు ఆదిరెడ్డి చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందజేశారు. ఫోటోగ్రాఫర్స్ ఆధ్వర్యంలో శాసనసభ్యులు ఆదిరెడ్డిని ఘనంగా సత్కరించి, మెమెంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆదిరెడ్డికి తూర్పుగోదావరి జిల్లా ఫోటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు, సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్ గౌరవ అధ్యక్షులు అల్లు బాబి, సీనియర్ ఫోటోగ్రాఫర్స్, రాజమహేంద్రవరం, పలు మండల ఫోటోగ్రాఫర్స్ తదితరులు పాల్గొన్నారు.

**పిడింగోయ్యి పంచాయతీలో**

# అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికే అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలిపారు. గురువారం ఉదయం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పిడింగోయ్యి గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిడింగోయ్యి పంచాయితీ ఎస్విజి మార్కెట్ వద్ద రూ.75 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన సిసి రోడ్లను శాసనసభ్యులు ప్రారంభించారు. అలాగే పిడింగోయ్యి పంచాయితీ పరిధిలోని కవలగొయ్యి గ్రామంలో రూ.7 లక్షలతో నిర్మించిన సిసి రోడ్డును కూడా ఆయన ప్రారంభించారు. అనంతరం పిడింగోయ్యి గ్రామంలో సంబంధిత శాఖ నిధులతో చేపట్టనున్న సిసి రోడ్ నిర్మాణ పనులకు శాసనసభ్యులు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని సిసి రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నామని తెలిపారు. ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. రాజమహేంద్రవరం రూరల్ మండలంలో అభివృద్ధి పనులు ప్రాధాన్యత క్రమంలో చేపడుతున్నామని, అందులో భాగంగానే పిడింగోయ్యి పంచాయతీ నుండి మోరంపూడి వరకు సిసి రోడ్ నిర్మాణ పనులు చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా అవసరాన్ని బట్టి ఇతర అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. గతంలో కూడా పిడింగోయ్యి పంచాయతీలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేశామని ఈ సందర్భంగా గుర్తు చేశారు. అదేవిధంగా పిడింగోయ్యి గ్రామంలోని మెయిన్ రోడ్డు వద్ద సంబంధిత శాఖ నిధులతో చేపట్టనున్న మరో సిసి రోడ్ నిర్మాణ పనులకు కూడా శాసనసభ్యులు శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గం పరిధిలో మొత్తం రూ.1 కోటి 60 లక్షల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి పనులు పురోగతిలో ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో రూరల్ మండల నాయకులు మత్సేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, వాసిరెడ్డి బాబి, డి.ఈ సత్యనారాయణ, పిడింగొయ్యి సెక్రెటరీ సత్యవాడ నాగవేణి తదితరులు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ఇప్పటికన్నా పశ్చాత్తాపం పొంది

# ప్రాయశ్చిత్తం చేసుకోవాలి

## కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు




**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** నెయ్యి కాని నెయ్యితో తిరుమల లడ్డూల తయారీతో వైసిపి పతనం ఖాయం సిట్ నివేదికలో అంశాలపై ప్రజలను ఏమార్చేలా వైసిపి తప్పుడు ప్రచారం దేవదేవుడు ఆగ్రహానికి వైసిపి గురికావడం తథ్యం ఇప్పటికన్నా పశ్చాత్తాపం పొంది ప్రాయశ్చిత్తం చేసుకోవాలి కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వైసీపీ ప్రభుత్వంలో తిరుపతి లడ్డూల్లో ఉపయోగించే నెయ్యి విషయంలో కల్తీ నెయ్యిని వాడి భక్తుల మనోభావాలు, తిరుమల పవిత్రత దెబ్బతీశారని కొత్తపేట ఎమ్మెఏ వ్యాఖ్యానించారు. సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన సిట్ రిపోర్టు బయటకు వచ్చిన నేపథ్యంలో వైసీపీ ప్రభుత్వంలో జరిగిన దుశ్చర్యలకు నిరసనగా గురువారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో కొత్తపేట బస్టాండ్ సెంటర్ నుంచి శ్రీ హరిహర దేవాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆలయాన్ని శుద్ధి చేశారు. వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సిట్ నిజానిజాలు నిగ్గు తేల్చి పాలు, పాలు పదార్థాలే లేని కల్తీ పదార్థాలతో లడ్డూలను తయారు చేసినట్లు బయట పెట్టిందన్నారు. నాడు తెలుగుదేశం పార్టీ ప్రతిపక్షంలో ఉండగా ఈ అంశాన్ని లేవనెత్తడం జరిగిందన్నారు. లడ్డూల నాణ్యతను దెబ్బతీసి దేవదేవుడు అయినటు వంటి తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి భక్తుల మనోభావాలు వైసీపీ నాయకులు దెబ్బతీశారని ఆయన విమర్శించారు. తప్పు జరిగిందని సిట్ తేల్చినా పశ్చాత్తాపం లేకుండా వైసిపి నాయకులు ఎదురు దాడి చేస్తున్నారన్నారు. తమ పేరు బయటికి రాకుండా తిరుమల తిరుపతి దేవస్థానం మాజీ చైర్మన్ చైర్మన్ వై.వి సుబ్బారెడ్డి కోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకున్న సంగతి గుర్తు చేశారు. ఇప్పుడు తప్పు జరిగిందని తేలడంతో దీనికి పూర్తి సమాధానం వైసిపి పార్టీ చెప్పాలన్నారు. జగన్మోహన్ రెడ్డి శ్రీవారి భక్తులకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. ఎందుకంటే 60 లక్షల టన్నుల నెయ్యి కానీ కల్తీ పదార్థం వాడటం జరిగిందని, సుమారు 250కోట్ల అవినీతి జరిగిందని సిట్ చెప్పిందన్నారు. పాలవదార్థం లేకుండా చేసిన నెయ్యి కాని నెయ్యిని రసాయనాలతో తయారు చేశారని, భక్తులకి ఈ కల్తీ పదార్థాలతో తయారుచేసిన 20 కోట్ల లడ్డూలు అందించారు అంటే ఎంత అపవిత్రం జరిగిందో దీని బట్టి అర్థం అవుతుందన్నారు. వైసీపీ హయాంలో దేవాలయాలపై నిరంతరం దాడులు కొనసాగాయని,బెజవాడ దుర్గమ్మ తల్లి వెండి సింహాలు చోరీ గాని, అంతర్వేది లక్ష్మీ నరసింహ స్వామి వారి రథం దగ్ధం చేయటం గాని, సింహాచలంలో అపవిత్రమైన కార్యక్రమాలు కానీ, రామఘట్టం సంఘటన కానీ ఎన్నో అపవిత్రమైన కార్యక్రమాలు చేస్తూ ఆఖరికి దేవదేవుడైనటువంటి తిరుపతి వెంకటేశ్వర స్వామితో కూడా పరాచకాలన్నట్లుగా, నాటి ప్రభుత్వం, వారి తాబేదార్లు వ్యవహరించడం జరిగిందన్నారు. తిరుమల తిరుపతి వ్యవహారంలో నాటి వైసిపి ప్రభుత్వం చాలా దారుణంగా వ్యవహరించిందన్నారు. వారు ఇప్పటికైనా పశ్చాత్తాపం చెందాలని, జరిగిన తప్పును తప్పుగా ఒప్పుకుని ప్రాయశ్చిత్తం చేసుకోవాలన్నారు. కోర్టులకు వెళ్లి మరలా ఇంకో రకంగా విచారణ అగేవిధంగా ప్రయత్నం చేయడం కాకుండా కనీసం చేసిన అపచారానికి ప్రాయశ్చిత్తం చేసుకుంటే దేవదేవుడు క్షమించడానికి అవకాశం ఉంటుందన్నారు. లేకపోతే చేసిన పాపాలకు ఏ రకంగా వారు శిక్షింపబడతారనేది ఆ దేవదేవుడైన వెంకటేశ్వర స్వామి చూసుకుంటారని హెచ్చరించారు. అలాగే ప్రభుత్వం కూడా ఈ అంశంపై కఠినంగా వ్యవహరిస్తుందన్నారు.



వైసీపీ బలోపేతమే లక్ష్యంగా

# కమిటీల నిర్మాణం సంస్థాగత నిర్మాణ సమావేశం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేట నియోజకవర్గ వైసీపీ సంస్థాగత నిర్మాణ సమావేశం నిర్వహించిన జిల్లా అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా కొత్తపేట నియోజకవర్గంలో మాజీ శాసనసభ్యులు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సంస్థాగత నిర్మాణ సమావేశంలో ముఖ్య అతిధులుగా ఏలూరు జిల్లా పార్లమెంట్ కోఆర్డినేటర్, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కారుమూరి సునీల్, రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగర్జున యాదవ్, అమలాపురం పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, మాజీ ఎంపీ చింతా అనురాధ, రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్ పాల్గొన్నారు, అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ సంస్థాగత నిర్మాణం మనకు చాలా ముఖ్యమైన ఘట్టమని , పార్టీకి కష్టపడే ప్రతి ఒక్క కార్యకర్తకు భవిష్యత్ లో తోడుగా ఉంటామని తెలియచేశారు. అలాగే కమిటీ నిర్మాణం పూర్తి అయిన తర్వాత అందరికి ఇన్సూరెన్స్ మరియు ఐడీ కార్డ్స్ అందించే కార్యక్రమం చేస్తామని భరోసా అందించారు. అలాగే ఈ కార్యక్రమంలో ముఖ్య నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# మందపల్లిలో భారీ అగ్నిప్రమాదం

## దుర్గా గణేష్ స్వీట్ హోమ్ పూర్తిగా దగ్ధం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మందపల్లి కొత్తపేట మందపల్లిలోని ప్రముఖ బొబ్బట్లు స్వీట్స్ దుకాణం 'దుర్గా గణేష్ స్వీట్ హోమ్' బ్రాంచ్‌లో అర్ధరాత్రి భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో షాపులోని వస్తువులన్నీ అగ్నికి ఆహుతై దుకాణం పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు గమనించి సమాచారం అందించడంతో అగ్నిమాపక సిబ్బంది తక్షణమే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు.

**రూ.6 లక్షలకు పైగా నష్టం, షార్ట్ సర్క్యూట్ అని అనుమానం**

బుధవారం తెల్లవారుజామున సుమారు రాత్రి 2 గంటల సమయంలో ఒక్కసారిగా మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. ఫైర్ ఇంజన్ సహాయంతో మంటలను అదుపు చేసినప్పటికీ, అప్పటికే షాపులోని ఫర్నిచర్, యంత్రాలు, స్వీట్స్ తయారీ సామగ్రి, ఇతర విలువైన వస్తువులు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. దుకాణ యజమానుల తెలిపిన వివరాల ప్రకారం ఈ ప్రమాదంలో సుమారు రూ.6 లక్షలకు పైగా ఆస్తి నష్టం వాటిల్లింది. ప్రాథమికంగా షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని అనుమానిస్తున్నప్పటికీ, ఇతర కారణాలపై కూడా విచారణ జరపాల్సి ఉంది.సమయానికి అగ్నిమాపక సిబ్బంది స్పందించడంతో మంటలు పక్కన ఉన్న దుకాణాలకు వ్యాపించకుండా నివారించగలిగారు. కొత్తపేటలో ప్రధాన దుకాణం కలిగిన ఈ స్వీట్ షాప్, మందపల్లిలో బ్రాంచ్‌గా నిర్వహించబడుతోంది.

హైవే విస్తరణతో కోనసీమ జిల్లాలో

# రవాణా మరింత సాఫీగా



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** రావులపాలెం–అమలాపురం హైవే విస్తరణకు ముహూర్తం ఖరారు భూసేకరణ నోటిఫికేషన్ జారీ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వాసులకు రవాణా సౌకర్యాలు మరింత మెరుగుపడే దిశగా కేంద్ర ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. జిల్లాలో ప్రధాన రహదారిగా ఉన్న అమలాపురం- రావులపాలెం (యన్ హెచ్ 216ఈ) విస్తరణ పనుల కోసం తాజాగా భూసేకరణ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఈ ప్రాజెక్టులో భాగంగా అమలాపురం నుంచి రావులపాలెం వరకు కి.మీ 0.000 నుండి కి.మీ 31.600 వరకు రహదారిని అభివృద్ధి చేయనున్నారు. పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీని దృష్టిలో ఉంచుకుని, ఈ రహదారిని 2 లేన్ల పేవ్డ్ షోల్డర్స్‌తో లేదా 4 లేన్లుగా విస్తరించడంతో పాటు, భవిష్యత్ నిర్వహణకు అవసరమైన భూమిని సేకరించనున్నారు.

**అభ్యంతరాలకు గడువు**

ఈ భూసేకరణ నోటిఫికేషన్‌పై అభ్యంతరాలు ఉన్న భూయజమానులు లేదా ఇతర ఆసక్తి గల వ్యక్తులు, గెజిట్ నోటిఫికేషన్ వెలువడిన తేదీ (డిసెంబర్ 31, 2025) నుండి 21 రోజులలోపు తమ అభ్యంతరాలను తెలియజేయాల్సి ఉంటుంది.ఎవరిని సంప్రదించాలి? అభ్యంతరాలు ఉన్నవారు తమ అభ్యర్థనలను లిఖితపూర్వకంగా, తగిన ఆధారాలతో సహా డా. బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా జాయింట్ కలెక్టర్ (కాంపిటెంట్ అథారిటీ) వారికి సమర్పించాలని అధికారిక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ హైవే విస్తరణతో కోనసీమ జిల్లాలో రవాణా మరింత సాఫీగా మారి, వాణిజ్య, వ్యవసాయ కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

హిందూ భక్తుల విశ్వాసాలతో

# రాజకీయాలు చేస్తున్న కూటమి ప్రభుత్వం



**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** తిరుమల లడ్డు పవిత్రతపై విషప్రచారానికి సీబీఐ చెక్ స్వామివారి లడ్డులో జంతు కొవ్వు లేదని స్పష్టం చేసిన సీబీఐ కోర్టు రావులపాలెంలో వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన చిర్ల జగ్గిరెడ్డి తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి వారి లడ్డు ప్రసాదంలో జంతు కళేబరాలు, జంతు కొవ్వు కలిసిందని కావాలనే తప్పుడు ప్రచారం చేసిన కూటమి ప్రభుత్వానికి గట్టి ఎదురు దెబ్బ తగిలింది. ఈ ఆరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని స్పష్టం చేస్తూ, స్వామివారి లడ్డు ప్రసాదంలో ఎటువంటి జంతు కొవ్వు లేదా జంతు సంబంధిత పదార్థాలు లేవని సీబీఐ స్పష్టంగా తేల్చి చెప్పింది.కోట్లాది మంది హిందూ భక్తుల ఆరాధ్య దేవాలయమైన తిరుమల తిరుపతి దేవస్థానంపై కావాలనే అపవాదులు మోపి, భక్తుల మనోభావాలను దెబ్బతీయాలనే దురుద్దేశంతో కూటమి ప్రభుత్వం వ్యవహరించిందని ఈ తీర్పుతో మరోసారి రుజువైందని జగ్గిరెడ్డి పేర్కొన్నారు.ఈ నేపథ్యంలో ఈరోజు రావులపాలెం పార్కు సమీపంలో గల శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయం బయట 50 కొబ్బరికాయలు కొట్టారు. స్వామివారి ఆశీస్సులతో సత్యం గెలిచిందని, అసత్య ప్రచారాలు చేసిన వారికి ఇది తగిన గుణపాఠమని ఆయన అన్నారు.ఈ సందర్భంగా చిర్ల జగ్గిరెడ్డి మాట్లాడుతూ"హిందూ ధర్మాన్ని, తిరుమల లడ్డు పవిత్రతను రాజకీయ ప్రయోజనాల కోసం అపవిత్రం చేయాలని ప్రయత్నించిన కూటమి ప్రభుత్వానికి సిబిఐ బలమైన గుణపాఠం చెప్పిందన్నారు. ఆధారాలు లేకుండా చేసిన ఆరోపణలు, మీడియా ద్వారా సాగించిన దుష్ప్రచారం పూర్తిగా బయటపడింది. దేవాలయాల విశ్వాసాలను రాజకీయ అస్త్రాలుగా మార్చే వారికి ప్రజలు ఎప్పటికీ మన్నించరు" అని తీవ్రంగా విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా పార్లమెంట్ కోఆర్డినేటర్, రాష్ట్ర యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ కారుమూరి సునీల్, రాష్ట్ర అధికార ప్రతినిధి యనమల నాగర్జున యాదవ్, అమలాపురం పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి, విజయనగరం మాజీ ఎంపీ బెల్లాన చంద్రశేఖర్, అమలాపురం మాజీ ఎంపీ చింతా అనురాధ, రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి కొత్తపేట నియోజకవర్గ పరిశీలకులు పాటి శివకుమార్ పాల్గొన్నారు.

ఘనంగా ప్రార్థన శక్తి ఫౌండర్

# డాక్టర్ చిక్కం ఇసాక్ పుట్టినరోజు వేడుకలు



**ఉప్పలగుప్తం/అమలాపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ఉప్పలగుప్తంలో ఘనంగా బుధవారం ప్రార్థన శక్తి డైరెక్టర్ ప్రవక్త డాక్టర్ చిక్కం ఇసాక్ పుట్టినరోజును పురస్కరించుకుని ప్రార్థన శక్తి యూనిట్ ఆధ్వర్యంలో చిక్కం దానియల్ ఆధ్వర్యంలో అత్యంత ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 1500 మంది దైవ సేవకులు పాల్గొని ప్రత్యేక ప్రార్థనలతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కోనసీమ జిల్లాతో పాటు ఉభయ గోదావరి జిల్లాల నుంచి వచ్చిన దైవ సేవకులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. డాక్టర్ చిక్కం ఇసాక్‌ను పుష్పగుచ్ఛాలు, శాలువాలతో సత్కరించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుపిఎఫ్ జిల్లా అధ్యక్షులు రేవ కార్ల్ డేవిడ్ కోమానపల్లి, బెంజిమెన్ కోమానపల్లి, దహించు అగ్ని వ్యవస్థాపకులు డాక్టర్ థామస్, నున్న ప్రభు కుమార్, చంద్రశేఖర్, రేవ డా వి రాజ్ కుమార్, ఎస్ ఇమ్మానియేల్, యూపీఎఫ్ జిల్లా కార్యదర్శి యం, యెహోషువ, సిపిహెచ్ మినిస్ట్రీస్ డైరెక్టర్ బిషప్ జె జార్జి పాఫప్, యోసేపు, ఆర్ జోసెఫ్, విక్టర్ నంద, యేసు రత్నం, భయగోదావరి జిల్లాలలో ఉన్న దైవ సేవకులు, క్రైస్తవ నాయకులు, హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ చిక్కం ఇసాక్ మాట్లాడుతూ ప్రజల మధ్య ప్రేమ, ఐక్యత, సోదరభావం పెంపొందించడమే తన సేవా లక్ష్యమని తెలిపారు. దేవుని సేవలో భాగంగా సమాజానికి అంకితభావంతో పనిచేస్తున్నామని చెప్పారు. వందలాది మంది దైవ సేవకుల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అత్యంత ఘనంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# డా.పెద్దింటి రామం సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే బండారు

**కొత్తపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** కొత్తపేటకు చెందిన డాక్టర్ పెద్దింటి రామం శ్రీ లలిత దుర్గా జ్యోతిషాలయం పేరుతో గత 15 సంవత్సరాల నుంచి ఉచితంగా జ్యోతీష్యం చెబుతూ ఎన్నో సేవలు చేస్తున్న శ్రీ లలిత దుర్గా జ్యోతిషాలయంని లండన్ క్యూ వీసి సంస్థ గుర్తించి ఇంటర్నేషనల్ స్టాండరైజేషన్ ఆర్గనైజేషన్ ఐఎస్ఓ గుర్తింపు ఇవ్వడం చాలా సంతోషం అని కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు అభినందించారు ఈ కార్యక్రమంలో గుబ్బల మూర్తి, చిలకమర్తి శ్రీనివాస్ తదితరులు రామంను అభినందించారు.



# నాన్న కష్టం అమ్మ ప్రోత్సాహం

## తొలి ప్రయత్నంలోనే గ్రూప్-2 విజయం సాధించిన సత్యశ్రీ



**రావులపాలెం, విశ్వం వాయిస్ న్యూస్ :** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం గ్రామానికి చెందిన కాదు లూరి సత్య శ్రీ ఏపీపీఎస్సీ ఇటీవల విడుదల చేసిన గ్రూప్-2 ఫలితాల్లో తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. బీటెక్ పూర్తి చేసి సాఫ్ట్వేర్ ఉద్యోగ అవకాశం వచ్చినప్పటికీ, తన జీవిత లక్ష్యాన్ని సాధించాలనే పట్టుదలతో గ్రూప్స్ వైపు అడుగులు వేశారు. సత్య శ్రీ తండ్రి పూర్ణ వృత్తిరీత్యా సాధారణ టీవీ మెకానిక్‌గా పనిచేస్తుండగా, తల్లి అన్నపూర్ణ గృహిణి. పరిమిత ఆదాయం ఉన్నప్పటికీ కుమార్తె ఆశయాన్ని గుర్తించి తల్లిదండ్రులు సంపూర్ణ ప్రోత్సాహం అందించారు. ముఖ్యంగా తల్లి అన్నపూర్ణ ఇచ్చిన ధైర్యం, ప్రోత్సాహమే తన విజయానికి ప్రధాన కారణమని సత్య శ్రీ తెలిపారు. ఎంతో పట్టుదలతో, క్రమశిక్షణతో పరీక్షలకు సిద్ధమైన సత్య శ్రీ ఈ విజయం తన అమ్మానాన్నల కష్టానికి ఫలితమని ఆనందంగా పేర్కొన్నారు. ఆమె సాధించిన విజయం గ్రామంలో పలువురికి ప్రేరణగా నిలిచింది. కుటుంబ సభ్యులు, బంధువులు, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

అయితాబత్తుల ఆనందరావు నేతృత్వంలో

# తుమ్మలపల్లి అభివృద్ధి దూకుడు

## రహదారులు, విద్య, మంచినీటితో గ్రామంలో కొత్త వెలుగు



**అమలాపురం టౌన్, విశ్వం వాయిస్ న్యూస్ :** తుమ్మలపల్లి గ్రామం అభివృద్ధి బాటలో వేగంగా ముందుకు సాగుతోంది. మౌలిక సదుపాయాల కల్పనే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా, నూతన సీసీ రోడ్లు, ఆధునిక పాఠశాల భవనాలు, శుద్ధి చేసిన మంచినీటి ట్యాంకును అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఒకే రోజులో ప్రారంభించి గ్రామ ప్రజల మనసులు గెలుచుకున్నారు. అల్లవరం మండలం తుమ్మలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన పలు సీసీ రోడ్లను ఎమ్మెల్యే ప్రారంభించారు. ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదుర్కొంటున్న ప్రయాణ కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రాధాన్యత క్రమంలో ఈ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు తెలిపారు. నాణ్యతకు రాజీ పడకుండా రహదారుల నిర్మాణం చేపట్టిన అధికారులను, కాంట్రాక్టర్లను ఆయన అభినందించారు. రోడ్ల ప్రారంభంతో గ్రామస్తుల రోజువారీ జీవితం సులభతరం అయ్యిందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అదే విధంగా తుమ్మలపల్లి, గోడి గ్రామాలలో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ పాఠశాల భవనాలను ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ నాయకత్వంలో రాష్ట్ర విద్యావ్యవస్థలో తీసుకొస్తున్న విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ఈ భవనాలు నిర్మించబడినట్లు తెలిపారు. పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన వాతావరణంలో చదివి ఉన్నత శిఖరాలను చేరుకోవాలని ఉపాధ్యాయులకు పిలుపునిచ్చారు. గ్రామ ప్రజల దాహార్తిని తీర్చే దిశగా మరో కీలక అడుగు పడింది. తుమ్మలపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన మంచినీటి ట్యాంకును ఎమ్మెల్యే ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ట్యాప్ తిప్పి స్వయంగా నీటి సరఫరాను పరిశీలించారు. ఈ ట్యాంకు ద్వారా గ్రామవ్యాప్తంగా పైపులైన్ల ద్వారా శుద్ధి చేసిన నీటిని ప్రతి ఇంటికీ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కలుషిత నీటి వల్ల వచ్చే వ్యాధులను నివారించడంలో ఈ పథకం కీలక పాత్ర పోషిస్తుందని, ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని కోరారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ప్రత్యేక చొరవతో గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి వేగవంతమైందని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు, మండల స్థాయి అధికారులు, విద్యాశాఖ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. తమ గ్రామంలో ఒకే రోజులో ఇంతటి అభివృద్ధి పనులు జరగడం పట్ల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.







### కత్తిపూడి జాతీయ రహదారిపై

# ఘోర రోడ్డు ప్రమాదం

**రెండు లారీలు ఢీకొని పూర్తిగా దగ్ధమైన వాహనాలు - క్యాబిన్ సీటులోనే ఓ లారీ డ్రైవర్ సజీవ దహనం**
**ప్రమాదం నుంచి తప్పించుకున్న మరో లారీ డ్రైవర్**

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రయాణీకుల సుఖ ప్రయాణం, రహదారి భద్రత, గమ్యస్థానాలకు సురక్షితంగా చేరుకోవాలనే లక్ష్యంతో జాతీయ రహదారులను నాలుగు రోడ్లుగా కాస్త విశాలంగా నిర్మించిన తర్వాత వాహనాల ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రాణాలను బలి గొంటున్నాయి. దీంతో జాతీయ రహదారులు మరణానికి దగ్గర దారులు అనే నానుడి స్థిరపడి పోయింది. జాతీయ రహదారిలో ప్రమాదాల పరంపరలో తాజా సజీవ దహనం ఘటన ఇది. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం కత్తిపూడి జాతీయ రహదారిపై రావికంపాడు కూడలిలో బుధవారం రాత్రి రెండు లారీలు ప్రమాదవశాత్తూ ఢీకొన్నాయి. దీంతో నిప్పు రాజుకుంది. భారీ అగ్నికీలలు వ్యాపించాయి. ఈ అగ్నికీలలకు కంటైనర్ డ్రైవర్ తన సీట్లోనే సజీవ దహనం అయ్యాడు. హైవే రెస్క్యూ వాహనం, అంబులెన్సు వాహనం, అగ్ని మాపక శకటం సిబ్బంది సంఘటనా ప్రాంతానికి చేరుకుని మంటలను ఆర్పారు. సహాయక చర్యలను



చేపట్టారు. ప్రత్తిపాడు సిఐ. బి.సూర్య అప్పారావు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. కలకత్తా నుండి చెన్నై వెళుతున్న నార్తరన్ మెరైన్ కార్గో సర్వీసు కంటైనర్ లారీ అర్ధరాత్రి 1.58 గంటలకు మార్గం మధ్యలో రావికంపాడు కూడలి రోడ్డు వద్దకు రాగానే అదే సమయంలో అక్కడకు చేరుకున్న సంధ్యా ఆక్వా ప్రైవేటు లిమిటెడ్ కు చెందిన రొయ్యల మేతను భీమవరం నుంచి మూలపేటకు రవాణా చేస్తున్న లారీ రావికంపాడు వైపు మలుపు తిరుగుతూ ప్రమాదవశాత్తూ కంటైనరు లారీని బలంగా ఢీకొట్టింది. దీంతో వాహనాల ఇంజన్ నుంచి మంటలు చెలరేగాయి. ప్రమాదాన్ని గుర్తించిన సంధ్యా ఆక్వా ప్రైవేటు లిమిటెడ్ లారీ డ్రైవర్ తన క్యాబిన్ నుంచి బయటకు సురక్షితంగా దూకి ప్రాణాలు కాపాడు కున్నాడు. కాగా నార్తరన్ మెరైన్ కార్గో సర్వీసు కంటైనర్ లారీ డ్రైవర్ ప్రమాదాన్ని పసిగట్టే లోపే కూర్చున్న సీటులోనే సజీవ దహనం అయ్యాడు. రెండు లారీలు కూడా అగ్నికి ఆహుతి అయ్యాయి. ప్రతిపాడు సిఐ.సూర్య అప్పారావు పర్యవేక్షణలో అన్నవరం పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### నూతనంగా ఎన్నికైన సభ్యులు

# మార్కెట్ కమిటీకి, రైతులకు అండగా నిలబడాలి

**రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ**



**కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలంలోని కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ రైతులకు అండగాను వారి కష్టాల్లో తోడుగా ఉండాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) కోరారు. కరప మండలం నడకుదురు గ్రామంలో ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయంలో కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, పాలక కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకరణ కార్యక్రమం గురువారం జరిగింది. మార్కెట్ కమిటీ చైర్మన్గా ముద్రగడ వెంకటరమణ (రమేష్), పాలకమండ సభ్యులుగా గుల్లిపల్లి శ్రీనివాసరావు, గొల్లపల్లి నాగభూషణం, గోపి రాంబాబు, పాటి సునీత, టేకు వీర దుర్గా విష్ణు, ఆచంట అంజి నాగదుర్గ ప్రవీణ్ , పోలనాటి మధు సునీల్, కుర్కురి సిరి లక్ష్మి, మాత అబ్బాయి, గండి వరలక్ష్మి, భారతి అప్పారావు, సవరపు కాంతి సుజాత, దాసరి అనూష, మేడిశెట్టి వీర వెంకట సత్యనారాయణ, వేములవాడ సొసైటీ అధ్యక్షుడు, మార్కెట్ కమిటీ అసిస్టెంట్ డైరెక్టర్, నడకుదురు సర్పంచ్, జిల్లా మార్కెటింగ్ ఆఫీసర్ తదితర సభ్యులతో కమిటీ గౌరవ అధ్యక్షుడు రూరల్ ఎమ్మెల్యే పంతం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలోనూ దళారీ వ్యవస్థను వేరు చేయడంలోనే సభ్యులు ప్రధాన పాత్ర పోషించాలన్నారు వ్యవసాయం కమిటీలో యువతకు ప్రాధాన్యమిచ్చి వ్యవసాయాన్ని దగ్గర చేసేందుకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. కమిటీలో 21 కోట్ల రూపాయలు నిధులు ఉన్నాయని వాటిని పంట పొలాలకు అనుసంధానంగా రోడ్లు, అభివృద్ధి కార్యక్రమాలు చేసుకోవాలని పంతం సూచించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్ మాట్లాడుతూ ఈ అవకాశాన్ని వినియోగించుకుంటానని రైతులకు వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సామాన్య కార్యకర్తగా జనసేనలో తాను జీవనం ప్రారంభించానని తనకి పదవి ఇచ్చి ఉన్నత స్థానానికి చేర్చిన ఎమ్మెల్యే పంతం, పార్టీ కార్యకర్తలను మర్చిపో లేనని చెప్పారు. డిప్యూటీ సీఎం పవన్ ఆశయాలకు అనుగుణంగా పనిచేసి కార్యకర్తల మన్ననలను పొందుతానని ముద్రగడ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిక్కాల రామచంద్రరావు, కడలి ఈశ్వరి, వేటుకూరి నాగమణి, చప్పిడి వెంకటేశ్వరరావు, నురుకుర్తి వెంకటేశ్వరరావు, చిక్కాల దొరబాబు, కటకంశెట్టి బాబి, రామదేవు సీతయ్య దొర, డాక్టర్ బొండా సూర్యరావు, దేవు వెంకన్న, మట్టా ప్రకాష్ గౌడ్, రంబాల వెంకటేశ్వరరావు, ఆత్మ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, జనసేన పార్టీ కరప ఎస్సీ సెల్ అధ్యక్షులు మెండు గోవిందు, కొల్లాబత్తుల అప్పారావు, పెంకే లక్ష్మి, డిడిఎం సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ టి శ్రీనివాసరావు, డి స్వాతి, రెడ్డిపల్లి భాస్కర్, టీడీపీ సీనియర్ నాయకులు జయంద్రబాబు, సొసైటీ డైరెక్టర్ సింగంపల్లి నాగేశ్వరావు, భాస్కర్ తమ్మయ్య, ముమ్మిడి పుష్పలత,తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కరప నుండి భారీ ర్యాలీగా నడకుదురులో ఉన్న మార్కెట్ కమిటీ కార్యాలయానికి వచ్చి రమేష్ బాధ్యతలు తీసుకున్నారు.

# పవర్ ఫుల్ డిప్యూటీ సీఎంలు.. వారి సెక్యూరిటీ పటిష్ఠంగా ఉందా?

రాజకీయ సమీకరణాల నేపథ్యంలో దేశంలో ప్రస్తుతం చాలా రాష్ట్రాల ప్రభుత్వాల్లో ఉప ముఖ్యమంత్రి పదవి తప్పనిసరి అయింది. మరీ ముఖ్యంగా దక్షిణాదిలో డిప్యూటీ సీఎంలు కేరళ తప్ప ప్రతి రాష్ట్రంలోనూ ఉన్నారు. తమిళనాడులో సీఎం స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్, ఏపీలో సినిమా హీరోగా సుప్రసిద్ధుడైన, జనసేన పార్టీ అధినేత పవన్ కళ్యాణ్, తెలంగాణలో సుదీర్ఘ రాజకీయ అనుభవం ఉన్న కుటుంబానికి చెందిన మల్లు భట్టి విక్రమార్క, కర్ణాటకలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా బలమైన వర్గానికి చెందిన డీకే శివకుమార్ లు డిప్యూటీ సీఎంలుగా ఉన్నారు. మహారాష్ట్ర, యూపీ, రాజస్థాన్ వంటి పెద్ద రాష్ట్రాలతో పాటు ఛత్తీస్ గఢ్ వంటి చోట్ల కీలకమైన నేతలను డిప్యూటీ సీఎంలుగా చేసింది బీజేపీ. దీన్నిబట్టే ఈ పదవి ప్రస్తుతం ఎంతగా ముఖ్యమైనదో తెలుస్తోంది. తాజాగా విమాన ప్రమాదంలో దుర్మరణం పాలైన అజిత్ పవార్ మహారాష్ట్ర డిప్యూటీ సీఎంగా ఏకంగా ఆరుసార్లు పనిచేసిన నాయకుడు కావడం గమనార్హం. స్థానిక ఎన్నికలకు వెళ్తూ ఆయన ఈ విధంగా ప్రాణాలు కోల్పోవడం యావత్ దేశాన్ని కలచివేసింది. ఈ నేపథ్యంలో.. పవర్ ఫుల్ డిప్యూటీ సీఎంలకు అదే విధమైన భద్రత ఉందా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

**సీఎం స్థాయిలో..?**

చీఫ్ మినిస్టర్ అంటే రాష్ట్రానికి సర్వాధికారి. వివిధ కారణాలతో వారికి ఉన్న ముప్పును బట్టి సెక్యూరిటీ కూడా అంతే స్థాయిలో ఉంటుంది. యూపీ సీఎం యోగి, ఏపీ సీఎం చంద్రబాబు తదితరులు హై సెక్యూరిటీ కేటగిరీలో ఉన్నారు. ఇక సహజంగా సీఎం స్థాయి నాయకులకు భద్రతా పరంగా అనేక అంచెలు ఉంటాయి. అదే.. డిప్యూటీ సీఎంలకు మాత్రం వర్తించదు. రాజ్యాంగంలో డిప్యూటీ సీఎం అనే పదమే లేదు. కేవలం సీఎం, మంత్రివర్గం ప్రస్తావనే ఉంది.డిప్యూటీ సీఎం అనేది హోదా మాత్రమే. ఈ పదవిలోని వారు మిగతా మంత్రులలాగే సమానం. కాకపోతే వారి స్థాయికి ఇచ్చిన గౌరవం.

అంతా హెలికాప్టర్ ప్రయాణాలే.. ఈ రోజుల్లో ప్రజలకు చెప్పిన సమయానికి చేరేందుకు



రాజకీయ నేతలు పెద్ద ఎత్తున విమాన, హెలికాప్టర్ సర్వీస్ లను వినియోగిస్తున్నారు. తద్వారా మారుమూల ప్రాంతాలకూ సులువుగా చేరగలిగి.. ప్రజల్లో పేరు తెచ్చుకుంటున్నారు. అయితే, ఈ క్రమంలోనే ప్రయాణ భద్రత అనే అంశం ప్రధానంగా చర్చకు వస్తోంది. ఇటీవలి కాలంలో తెలుగు రాష్ట్రాలకు చెందిన కీలక నేతలు వినియోగించే హెలికాప్టర్ లలో సాంకేతిక సమస్యలు తలెత్తాయి. దీంతో వారు ప్రయాణ విధానాన్ని మార్చుకోవాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలోనే ప్రయాణానికి ముందే అన్ని జాగ్రత్తలు తీసుకోవడం మంచిదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

### 31న పెదమల్లాపురంలో

# న్యాయ విజ్ఞాన అవగాహన సదస్సు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం పెదమల్లాపురం గ్రామంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో 31 శనివారం ఉదయం 10 గంటలకు గిరిజన హక్కులపై అవగాహన కల్పించేందుకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన అవగాహనా సదస్సును నిర్వహించ నున్నారు. ఈ మేరకు ప్రత్తిపాడు బార్ అసోసియేషన్ గురువారం మీడియా ప్రకటనను విడుదల చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా న్యాయస్థానం ధర్మమూర్తి గంధం సునీత, ప్రత్తిపాడు న్యాయస్థానం న్యాయమూర్తి ఎల్.గోపినాథ్, ప్రత్తిపాడు న్యాయస్థానం ప్రభుత్వ సహాయక వకీలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, మిగతా న్యాయవాదులు, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి ప్రభుత్వ వివిధ శాఖల అధికారులు పాల్గొంటారు.

### పాడి రైతుల ఆర్థిక అభివృద్ధికే

# ఉచిత పశు వైద్య శిబిరాలు

**జనవరి 19 నుండి 31 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత పశు వైద్య శిబిరాలు**
**రాయవరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న రాజమండ్రి డి.డి వెంకటేశ్వర్లు**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు సకాలంలో వైద్య సేవలు అందకపోవడం వలన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆ సమస్యను నివారించడానికి జనవరి 19 నుండి 31 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి డివిజన్ ఉప సంచాలకులు మక్కిన వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. తూర్పుగోదావరి జిల్లా, మండల కేంద్రమైన రాయవరంలో సహాయ సంచాలకులు డాక్టర్ బి.అనిత కుమారి ఆద్వర్వంలో గురువారం స్థానిక పశువుల ఆసుపత్రి ప్రాంగణంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ చంద్రమళ్ళ రామకృష్ణ, మండల పరిషత్ అధ్యక్షులు నౌడు వెంకటరమణ, రాజమండ్రి డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ మక్కిన వెంకటేశ్వర్లు లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో తొలుత రైతులకు పాడి సమస్యలపై అవగాహన కల్పిస్తూ వివరించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన తూర్పుగోదావరి జిల్లా, రాజమండ్రి డి.డి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ శాస్త్రీయ పశు యాజమాన్య పద్ధతుల ద్వారా రైతులకు లాభం చేకూరుతుందని, రైతులు సరైన సమయంలో వ్యాక్సినేషన్ చేయించడం ద్వారా పాడి పశువుల ద్వారా ఏడాదికో దూడ పొందగలరని, ఆర్థిక అభివృద్ధి చెందడానికి తోడ్పడుతుందని తెలియజేశారు. గ్రామీణ ప్రాంతాల్లో పశువులకు సకాలంలో వైద్య సేవలు అందకపోవడం వలన రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారని ఆ సమస్యను నివారించడానికి జనవరి 19 నుండి 31 వరకు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉచిత పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం రైతులకు అతిథుల ద్వారా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో రాయవరం గ్రామ జనసేన నాయకులు దేవిశెట్టి కోటేశ్వరరావు, ఐటిడిపి నాయకులు దొంతంశెట్టి బాలకేదారీశ్వరుడు, కే.సురేష్ కుమార్ తదితర కూటమి నాయకులు, పాడి రైతులు, పశువుల ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ బడ్జెట్‌కు ముహూర్తం పెట్టేశారు

ఆంధ్రప్రదేశ్ బడ్జెట్ సమావేశాలకు షెడ్యూల్ సిద్ధం చేశారు. 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ పద్దును సమావేశాల్లో ప్రవేశ పెడతారు. దీనికి సంబంధించి ఫిబ్రవరి 11 నుంచి అసెంబ్లీ సమావేశాలు మొదలు కానున్నాయి. ఈ షెడ్యూల్ కు సంబంధించిన అధికారిక సమాచారాన్ని అసెంబ్లీ వర్గాలకు అందాయి. షెడ్యూల్ లోకి వెళితే.. ఫిబ్రవరి 11 ఉదయం పది గంటలకు శాసన సభ, శాసన మండలిని ఉద్దేశించి గవర్నర్ ప్రసంగిస్తారు. ఆనవాయితీగా గవర్నర్ ప్రసంగంతోనే బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కావటం తెలిసిందే. ఫిబ్రవరి పన్నెండున గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సభలో ప్రవేశ పెట్టనున్నారు. అదే రోజు ఈ తీర్మానంపై సభ్యులు చర్చ జరుపుతారు. ఫిబ్రవరి 13న గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై ముఖ్యమంత్రి చంద్రబాబు అసెంబ్లీలో ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా ప్రభుత్వ



విధానాలు.. భవిష్యత్ ప్రణాళికలపై ముఖ్యమంత్రి కీలక వ్యాఖ్యలు చేస్తారన్న అంచనా వ్యక్తమవుతోంది. ఇక.. ఫిబ్రవరి 14న రానున్న ఆర్థిక సంవత్సరానికి (2026 ఏప్రిల్ 1 - 2027 మార్చి31) సంబంధించిన రాష్ట్ర బడ్జెట్ ను ఏపీ రాష్ట్రఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రవేశ పెడతారు. రాష్ట్ర బడ్జెట్‌ను పయ్యావుల కేశవ్ ప్రవేశ పెడితే.. అనంతరం రాష్ట్ర వ్యవసాయ బడ్జెట్ ను రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు ప్రవేశ పెట్టనున్నారు. విశ్వసనీయ వర్గాల నుంచి అందుతున్న సమాచారం ప్రకారం ఈసారి బడ్జెట్ సమావేశాలు కనీసం నాలుగు వారాల పాటు సాగుతాయని చెబుతున్నారు కీలక బిల్లులతో పాటు, వివిధ అంశాల మీద చర్చ జరగనుంది. మరి.. ఈ సమావేశాలకు విపక్ష నేత జగన్మోహన్ రెడ్డి హాజరవుతారా? లేదా? అన్నది తేలాల్సి ఉంది. ఈసారి బడ్జెట్ లో అమరావతి రాజధాని నిర్మాణం.. పోలవరం ప్రాజెక్టు పనులు, నదుల అనుసంధానం లాంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులకు పెద్ద పీట వేస్తారని భావిస్తున్నారు. ఇప్పటివరకు బడ్జెట్, వ్యవసాయ బడ్జెట్ ప్రవేశ పెడుతున్న సంగతి తెలిసిందే. ఇందుకు అదనంగా వాటర్ బడ్జెట్ పేరుతో సరికొత్తగా ప్రవేశ పెట్టే అవకాశం ఉందన్న మాట వినిపిస్తోంది. దీనిపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆసక్తిని చూపుతున్నట్లుగా చెబుతున్నారు. గత బడ్జెట్ వ్యయం రూ.3.22లక్షల కోట్లు కాగా.. ఈసారి బడ్జెట్ అంచనాలు రూ.3.5 నుంచి రూ.3.75 లక్షల కోట్ల వరకు ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈసారి బడ్జెట్ లో ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల అమలుకు పెద్ద ఎత్తున ప్రాధాన్యత ఇస్తారని చెబుతున్నారు.



ఘనంగా శ్రీకన్నమాంబ, పేరంటాలమ్మ ఆలయ

# నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవం

**- పుష్కరాల నాటికి ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతాం : రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి**





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** స్థానిక ఆల్కాట్ తోటలో వేంచేసియున్న శ్రీశ్రీశ్రీ కన్నమాంబ, పేరంటాలమ్మ అమ్మవారి ఆలయ నూతన కమిటీ చైర్మన్‌గా దల్లి అప్పలరెడ్డి,డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవం గురువారం ఆలయం ఆవరణలో ఘనంగా జరిగింది.రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాల నాటికి అన్ని ఆలయాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని వెల్లడించారు.భక్తుల పట్ల నిబద్ధత, ఆలయాల పరిరక్షణపై ప్రత్యేక శ్రద్ధ ఉన్నవారిని మాత్రమే ఆలయ కమిటీ పాలక వర్గంలోకి ఎన్నిక చేస్తున్నామన్నారు.ఈ ప్రాంతంలో విశేష సేవలందిస్తున్న దల్లి అప్పలరెడ్డితో పాటు ఆలయ డైరెక్టర్లు మాచనవజ్జల కుసుమ కళ్యాణి,రీసు సత్యవతి, ఆకుల దుర్గ నాగమల్లేశ్వరి, నాగళ్ల రుద్ర శివ శంకర రాజు,పిలకా వెంకట రమణారెడ్డి, చిట్టాబత్తుల మోహన్ బాబు, చెక్క మంగ,శీరపు సాయిలక్ష్మి, కేతా విజయకుమార్, మదనపల్లి గణేష్ లకు కమిటీలో స్థానం కల్పించామన్నారు. టీడీపీ యువనాయకులు డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి మజ్జి పద్మావతి, రూరల్ అధ్యక్షుడు మత్సేటి ప్రసాద్, మాజీ కార్పొరేటర్ గొందేశి మాధవీలత,గొందేశి హరినాధ్ రెడ్డి, టీడీపీ నాయకులు కాశి నవీన్, పందూరి అప్పారావు, నిమ్మలపూడి గోవింద్,శీలం గోవింద్, వాసిరెడ్డి బాబీ, పల్లి సాయి, యానాపు యేసు, కందికొండ అనంత్, రొంపిచర్ల ఆంటోని, ఏ.లక్ష్మణరావు, ఈ.ఓ ఎం.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంత రోడ్ల అభివృద్ధి

# కూటమి ప్రభుత్వ ధ్యేయం


**పాలతోడులో సి.సి రోడ్లు, డ్రైన్ల శంఖుస్థాపనలో ఎమ్మెల్యే వేగుళ్ళ**



**మండపేట, విశ్వంవాయిస్ న్యూస్ :** గ్రామీణ ప్రాంత రోడ్లను, రహదారులను అభివృద్ధి పథంలో పెట్టడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని,ఇవి గ్రామీణాభివృద్ధికి, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు, సామాజిక-ఆర్థిక పురోగతికి కీలకమైనవి అని రాష్ట్ర అంచనాల కమిటీ చైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు అన్నారు. మండపేట మండలం పాలతోడు గ్రామంలో ఎంజిఎన్ఆర్ఇజియస్ నిధులు రూ.34.50 లక్షలతో నిర్మించనున్న సి.సి రోడ్లు, డ్రైన్లు కు ఆయన గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ళ మాట్లాడుతూ గత ప్రభుత్వం ముఖ్యంగా గ్రామీణ ప్రాంత రోడ్లను విస్మరించిందని, ఫలితంగా గ్రామీణ ప్రాంత ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత రోడ్లకు మహర్దశ కల్పించాలని ధృఢ నిశ్చయంతో ఉందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుడాల జయబాబు, మండపేట మండల టీడీపీ అధ్యక్షులు కర్రి తాతారావు, పిల్లా తాతాలు, గుణ్ణం సత్య సాయిబాబ, మండపేట సొసైటి అధ్యక్షులు కుక్కల రామారావు, మండపేట మార్కెట్ కమిటి చైర్మన్ చింతపల్లి రామకృష్ణ, తాపేశ్వరం సర్పంచ్ వాసంశెట్టి రాజేశ్వరి శ్రీనివాస్, వెలగతోడు సొసైటీ చైర్మన్ వల్లూరి అబ్బు, నీటి సంఘం అధ్యక్షుడు బొబ్బిలి నాగేశ్వరరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యలపై గళం విప్పండి

**వైసీపీ ఆర్టీఐ వింగ్ రాష్ట్ర అధ్యక్షులను కలిసిన మందపల్లి రవి**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** ప్రజా సమస్యలపై తమదైన సరళిలో గళం విప్పాలని కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని రాష్ట్ర వైయస్సార్ పార్టీ ఆర్టిఐ యాక్ట్ విభాగ అధ్యక్షులు, ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి సూచించినట్లు కన్వీనర్ రవి తెలిపారు. తాడేపల్లి వైయస్సార్ సిపి కార్యాలయంలో గురువారం రాష్ట్ర వైసిపి ఆర్టిఐ యాక్ట్ విభాగ అధ్యక్షులు ఎమ్మెల్సీ కల్పలతా రెడ్డి నీ మండపేట నియోజకవర్గం వైసిపి ఆర్టిఐ యాక్ట్ విభాగ అధ్యక్షులు 8వ వార్డు కౌన్సిలర్ మందపల్లి రవికుమార్, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి యర్రగుంట అయ్యప్ప లు మర్యాదపూర్వకంగా కలిశారు. మండపేట నియోజకవర్గంలో పలు సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ కార్యకర్తలకు అండగా నిలవాలని కోరారు. కూటమి ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పేర్కొన్నారు.

లడ్డులో కల్తీ అయిందని సిట్ నివేదికతో

# వైకాపా కుంభకోణం బట్టబయలు

**పాలు లేకుండా నెయ్యి తయారీ ఆ మహాపాపం వైకాపాదే : ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**
**ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయం శుద్ధి కార్యక్రమం**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గోవిందా...పాలు లేకుండానే వైకాపా హయాంలో నెయ్యి ఎలా తయారైందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వ హయాంలో తిరుమల లడ్డు తయారీలో కల్తీ జరిగినట్లు సిట్ నివేదికతో వైకాపా నాయకులు చేసిన కుంభకోణం బట్టబయలైన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ కూటమి నాయకులతో కలిసి ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయానికి ర్యాలీగా చేరుకుని ఆలయాన్ని శుద్ధి చేసి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ తాము ప్రతిపక్షంలో ఉన్నప్పుడే తిరుమల లడ్డు కల్తీపై గట్టిగా అనుమానం వ్యక్తం చేశామన్నారు. నాడు తాము ఏవైతే ఆరోపణలు చేశామో, నేడు సుప్రీం కోర్టు ఆధ్వర్యంలోని సిట్ దర్యాప్తులో అవే నిజాలని నిగ్గు తేలాయన్నారు. ఇది తెలుగుదేశం పార్టీ నైతిక విజయమని అన్నారు. నెయ్యిలో భారీగా కల్తీ జరిగిందని, ఆ కల్తీ నెయ్యితోనే స్వామివారికి అభిషేకాలు నిర్వహించి, కోట్లాది భక్తులు పవిత్రంగా భావించే లడ్డూలను తయారు చేశారని సిట్ ఛార్జ్ షీట్ ద్వారా బట్టబయలైందని పేర్కొన్నారు. వైకాపా నేతలు దీనికి ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. తాము ఏ తప్పూ చేయలేదు, ప్రమాణం చేస్తాం" అని ప్రగల్భాలు పలికిన వైకాపా నాయకుల ముఠా ఇప్పుడేమంటారని నిలదీశారు. తప్పు చేయలేదని చెప్పేవారు ఎందుకు ముందస్తు బెయిల్ కోసం కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని ప్రశ్నించారు. కల్తీ నెయ్యి గురించి ఎవరూ మాట్లాడకూడదని కోర్టు నుంచి స్టే ఎందుకు తెచ్చుకున్నారని, వారి బ్యాంక్ ఖాతాల వివరాలు ఇవ్వడానికి ఎందుకు భయపడుతున్నారని మండిపడ్డారు. వైకాపా ఐదేళ్ల పాలనలో మొత్తం 1.61 కోట్ల కిలోల నెయ్యి కొనుగోలు చేయగా, అందులో ఏకంగా 60 లక్షల కిలోలు కల్తీ నెయ్యేనని, ఈ కల్తీ నెయ్యితో 20.01 కోట్ల శ్రీవారి లడ్డూలు, ఇతర ప్రసాదాలు తయారు చేసి భక్తుల మనోభావాలను దెబ్బతీశారని దుమ్మెత్తిపోశారు. ఇది క్షమించరాని కాని మహాపాపమన్నారు. చిన్న అప్పన్న అనే ఒక సామాన్య ఉద్యోగి బ్యాంక్ ఖాతాలో 2019 నుంచి 2024 మధ్య కాలంలో రూ.4.69 కోట్లు ఎలా జమ అయ్యాయని, అందులో రూ.4.64 కోట్లను వివిధ ఖాతాలకు ఎందుకు మళ్లించాడని, ఆ డబ్బు ఏ వైకాపా నేతల ఖాతాల్లోకి వెళ్లిందని ప్రశ్నించారు. ఒక సామాన్య వ్యక్తి ఇంత పెద్ద కుంభకోణం చేయలేడని, దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులను బయటపెట్టాలన్నారు. నిబంధనలను ఇష్టానుసారంగా మార్చేసి, అనుభవం లేని కంపెనీలకు టెండర్లు కట్టబెట్టి అక్షరాలా రూ.235 కోట్ల స్వామివారి నిదులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. తిరుమలను అక్రమార్జనకు ఒక ఆదాయ వనరుగా మార్చుకుని, వైకాపా నేతలు తమ జేబులు నింపుకున్నారని ఆరోపించారు. రాజకీయ దుర్బుద్ధితో హిందూ మత విశ్వాసాలను రెచ్చగొట్టి, తిరుమల పవిత్రతను మంటగలిపారని మండిపడ్డారు. ఐదేళ్లు హిందూ దేవాలయాలపై, పూజారులపై దాడులు ప్రోత్సహించారని, ఇప్పటికైనా ఈ కల్తీగాళ్లు తప్పు తెలుసుకుని స్వామివారిని క్షమాపణ అడగాలని డిమాండ్ చేశారు. లేకపోతే వారి పాపానికి ప్రాయశ్చిత్తం ఉండదన్నారు. పాదయాత్రలు చేస్తే అధికారం వస్తుందని జగన్ రెడ్డి పగటి కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. కానీ, భక్తుల విశ్వాసాలతో చెలగాటమాడి, స్వామివారి ప్రసాదాన్ని అపవిత్రం చేసిన వైకాపా వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో మహిళలు, యువకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# నేత్రపర్వంగా శ్రీ జనార్ధన స్వామి రథోత్సవం

**పోటెత్తిన జనసంద్రం - కేపీ రోడ్ గోవింద నామస్మరణంతో మార్మోగింది**



**మండపేట టౌన్, విశ్వంవాయిస్ న్యూస్ :** మండపేటలో గురువారం స్వామి వారి రథోత్సవం అంగరంగా వైభవంగా నేత్రపర్వంగా ముందుకు సాగింది. భక్త జనం భక్తి పరవశ్యంతో రథాన్ని లాగారు. రథం సెంటర్ నుండి కలువపువ్వు సెంటర్ వరకు గోవింద నామ స్మరణ తో మరుమోగింది. మండపేట శ్రీ దేవి భూదేవి సమేత శ్రీ జనార్ధన స్వామి రథోత్సవం గురువారం చైర్ పర్సన్ పతివాడ నూక దుర్గా రాణి, టిడిపి నాయకులు వి సాయి కుమార్ బాబు లు ఆరంభించారు. రథం సెంటర్లో జాకీల సహాయంతో పడమట వైపుకు రథాన్ని తిప్పారు. పండితులు రథాన్ని సంప్రోక్షణ చేశారు. జనార్ధన స్వామి అంతరాలయం నుండి శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి వారి రథోత్సవ విగ్రహాలను భక్తులకు దర్శనం కల్పించి స్వామివారి విగ్రహాలను రథంపై ఉంచారు. రథం ముందు భాగంలో మహాకుంభాన్ని సమర్పించి వసంతంతో నిండి ఉన్న మహాకూష్మాండాన్ని (భారీగుమ్మడికాయ) రథం పైనుంచి కిందకి జార విడిచారు.మహాకూష్మాండం పగిలి వసంతం చిమ్మిన తర్వాత భక్తులు కొబ్బరికాయలు సమర్పిస్తుండగా ఒక్కసారిగా రథం కదిలింది. భక్తుల జయ జయ నాదాలు గోవింద నామస్మరణ మధ్య కలువపువ్వు సెంటర్ ఆంజనేయ స్వామి ఆలయం వద్దకు చేరింది.జాకీలపై రథాన్ని తూర్పు దిశగా తిప్పిన తర్వాత స్వామి వారి రథంపై దర్శనం నిమిత్తం నిచ్చెనలు ఏర్పాటు చేశారు.నేడు రేపు కలువపువ్వు సెంటర్లో ఉండి స్వామివారు భక్తులకు దర్శనం ఇస్తారు.శనివారం తిరిగి రథం ను రథం ఆలయానికి చేరుకుంటుందని ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి తెలిపారు.

# రాజకీయ,ఆర్థిక, సామాజిక రంగాల్లో బ్రాహ్మణులకు సముచిత స్థానం

**బ్రాహ్మణుల ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** బ్రాహ్మణుల అండగా ఉంటామని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. స్థానిక శ్రీరామ నగర్ లో దువ్వూరి ట్రస్ట్‌లో జరిగిన బ్రాహ్మణ ఆత్మీయ సమావేశానికి ఆయన ముఖ్య అతిధిగా హాజరయ్యారు. 2024 అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో బ్రాహ్మణ సమాజానికి చేసిన వాగ్దానాలను గుర్తుచేస్తూ, వాటిని త్వరగా అమలు చేస్తామని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పేర్కొన్నారు. రాజకీయ, ఆర్థిక, సామాజిక రంగాల్లో బ్రాహ్మణులకు సముచిత స్థానం కల్పిస్తామని పునరుద్ఘాటించారు. ఎమ్మెల్యే వాసు గారు తన ప్రచారంలో ఇచ్చిన మాట ప్రకారం, నగరంలోని ప్రధాన దేవాలయాలలో 15 చోట్ల కమిటీలు ఏర్పాటు చేసి, ఎక్స్-అధికారుల స్థానాలతో పాటు ఒక్కొక్క బ్రాహ్మణుడికి కూడా స్థానం కల్పించిన ఘనత తనదేనని గుర్తు చేశారు. అంతేకాకుండా, బ్రాహ్మణులు శుభకార్యాలు జరుపుకునేలా ఒక ప్రత్యేక ప్రాంతంలో కమ్యూనిటీ హాల్‌కు స్థలం కేటాయించి, నిర్మాణానికి ఖర్చు కూడా అందిస్తామని వాగ్దానం చేశారు. తొందరలోనే స్థలం కేటాయించాలని మనవి చేశామని ఆయన తెలిపారు. అదేవిధంగా, పేద బ్రాహ్మణులకు టిడ్కో ఇల్లులు కేటాయిస్తామని, రానున్న పుష్కరాల్లో బ్రాహ్మణ పురోహితులకు సముచిత స్థానాలు కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, జనసేన సిటీ ఇంచార్జ్ అత్తి సత్యనారాయణ, జనసేన కార్పొరేషన్ ప్రెసిడెంట్ వై.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. రాజమహేంద్రవరం బ్రాహ్మణ ఆహ్వాన కమిటీ నుంచి భమిడిపల్లి వెంకటరమణమూర్తి, బోడెం రవికుమార్, దువ్వూరి గోపి, కల్లూరు వెంకటేష్, నిమిష కవి వెంకటేష్, కాళీపట్నం మణికంఠలు కార్యక్రమాన్ని నిర్వహించారు.

బాధ్యతాయుత జర్నలిజంతో

# సమాజంలో అవగాహన

**అక్రిడేషన్ కమిటీ సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ వై.మేఘస్వరూప్**




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సమాజంలో ప్రజాభిప్రాయ నిర్మాణం, ప్రజాస్వామ్య విలువల పరిరక్షణ, ప్రభుత్వ- ప్రజల మధ్య అనుసంధానంగా మీడియా కీలక పాత్ర పోషిస్తోందని జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ వై. మేఘస్వరూప్ పేర్కొన్నారు. బాధ్యతాయుతమైన జర్నలిజం ద్వారా సమాజంలో అవగాహన పెంపొందడంతో పాటు ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు ప్రజల వరకు వేగంగా చేరుతున్నాయని ఆయన తెలిపారు. జర్నలిస్టుల సంక్షేమం, భద్రత, వృత్తిపరమైన గౌరవాన్ని కాపాడేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని స్పష్టం చేశారు. గురువారం తూర్పుగోదావరి జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశం బొమ్మూరు కలెక్టరేట్‌లో జిల్లా ఇన్‌ఛార్జ్ కలెక్టర్ వై. మేఘస్వరూప్ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో కమిటీ అజెండా అంశాలు, మీడియా అక్రిడేషన్ రూల్స్-2025కు సంబంధించిన ముఖ్యాంశాలను జిల్లా సమాచార అండ్ పౌర సంబంధాల అధికారి కె. లక్ష్మీనారాయణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా కమిటీ సభ్యులకు వివరించారు. ఈ సందర్భంగా ఇంచార్జి కలెక్టర్ వై మేఘా స్వరూప్ మాట్లాడుతూ, ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువచ్చే మీడియా సమాజాన్ని సరైన దిశలో నడిపించే శక్తిగా పనిచేస్తుందని, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో విశ్వాసం పెంచడంలో మీడియా పాత్ర అమూల్యమని అన్నారు. తప్పుడు సమాచారానికి తావు లేకుండా వాస్తవాధారిత, బాధ్యతాయుత వార్తలతో సమాజానికి దోహదపడాలని జర్నలిస్టులకు సూచించారు. అనంతరం జిల్లాలో అర్హత కలిగిన జర్నలిస్టులకు ప్రింట్ మీడియా, మాస పత్రికలు, మేగజైన్లు, ఎలక్ట్రానిక్ మీడియా, కేబుల్ టీవీ, ఏపీ ఫైబర్ నెట్ ద్వారా ప్రసారమయ్యే చానల్స్‌లో పనిచేస్తున్న జర్నలిస్టులకు అక్రిడేషన్లు మంజూరు చేయాలని ప్రతిపాదించగా, మొత్తం 273 అక్రిడేషన్లకు తొలి కమిటీ సమావేశం లో ఆమోదం తెలిపింది.

**వాటి వివరాలు:** పెద్ద పత్రికలు - 126, చిన్న పత్రికలు మరియు పిరియాడికల్స్ - 19, సాటిలైట్ ఎలక్ట్రానిక్ మీడియా - 106, కేబుల్ టీవీ - 11, ఏపీ ఫైబర్ నెట్ చానల్స్ -1, ఫ్రీలాన్స్ కేటగిరీ - 1, అధికారిక మీడియా - 9. మొదటి జాబితాలో లేని జర్నలిస్టుల దరఖాస్తులను కూడా సమగ్రంగా పరిశీలించి, అర్హత కలిగిన వారికి తదుపరి జిల్లా మీడియా అక్రిడేషన్ కమిటీ సమావేశాల్లో అక్రిడేషన్లు మంజూరు చేసే విధంగా అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. అక్రిడేషన్ ప్రక్రియ మొత్తం నిబంధనల ప్రకారం, పారదర్శకంగా కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్. చెంచి రెడ్డి, కన్వీనర్ కె. లక్ష్మీ నారాయణ, జిల్లా ప్రజా రవాణా అధికారి వై.వి. మూర్తి, సహాయ కమిషనర్ బి.ఎస్.ఎం. వలి, డివిజనల్ పీఆర్వో ఎమ్. లక్ష్మణా చార్యులు, హౌసింగ్ అధికారులు, జిల్లా వైద్య శాఖ అధికారులు, డి ఎం ఎ సి మీడియా కమిటీ సభ్యులు గంద్రోతు వేణు గోపాలస్వామి,బి. శ్రీనివాస్,టి. పురుషోత్తం రాజు, కె. మోహన్ దుర్గ ప్రసాద్, కనుమూరి కిరణ్ కుమార్ రాజు, యు. సతీష్ కుమార్,టి. అప్పల నాయుడు,బి.వి.వి. అయ్యప్ప స్వామి, కె. రాజా బాబు, కె.వి.ఎన్. వర ప్రసాద్, పడాల చిరంజీవి రెడ్డి, ఏ. మణికంఠకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బాక్స్ కల్వర్టు డ్రైనేజీ

# నిర్మాణ పనులు వేగవంతం

**పనులను పరిశీలించిన ఎమ్మెల్యే గోరంట్ల**



**రాజమహేంద్రవరం రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరిచేందుకు నూతన ప్రణాళికతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళుతుందని రూరల్ శాసనసభ్యులు గోరంట్ల బుచ్చయ్యచౌదరి పేర్కొన్నారు.13 కోట్ల రూపాయలతో ఐ.ఎల్.టి.డి వద్ద శంభునగర్, స్టేడియం వద్ద రాతి ఛానల్ ప్రాంతాల్లో రైల్వే శాఖ మరియు మున్సిపల్ శాఖ వారి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మిస్తున్న భారీ బాక్స్ కల్వర్టు పనులను ఎమ్మెల్యే గోరంట్ల పరిశీలించారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే గోరంట్ల మాట్లాడుతూ రాజమండ్రి సిటీ, రూరల్ ప్రాంతాల్లో మురుగునీరు బయటకు వెళ్లేందుకు ఆనాడు 2014-19 మధ్య బాక్స్ కల్వర్టులు నిర్మించేందుకు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందని, నిధులు మంజూరు అయ్యే సమయానికి ప్రభుత్వం మారడంతో గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోలేదని, మరల కూటమి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే మున్సిపల్ కార్పొరేషన్, రైల్వే శాఖ అధికారులతో పలుమార్లు స్వయంగా పర్యవేక్షణ చేస్తూ నిధులు మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. కార్పొరేషన్ నుండి రైల్వే శాఖకు నిధులు చెల్లించినప్పటికీ కూడా రైల్వే శాఖ నుండి అనుమతులు రావడం కొంత సమయం పట్టిందని, భారీ యంత్రాలు మోడరన్ టెక్నాలజీ తో ఒకటి లేదా రెండు రోజుల్లో బాక్స్ కల్వర్టు పనులు పూర్తి చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో రూరల్ మండల తెదేపా అధ్యక్షులు మత్సేటి ప్రసాద్, రాష్ట్ర కుమ్మరి శాలివాహన కార్పొరేషన్ డైరెక్టర్ పందురి అప్పారావు, వాసిరెడ్డి బాబి, డి.ఈ సత్యనారాయణ, కార్పొరేషన్ మరియు రైల్వే శాఖ అధికారులు తదితరులు ఉన్నారు.

# ఎంపీపీ చొరవతో పుంత రోడ్డుకు పరిష్కారం

**నదురుబాద సుదీర్ఘ నిరీక్షణకు ఎంపీపీ చొరవతో పరిష్కారం - గ్రామ సర్పంచ్ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రారంభించిన రహదారి**



**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** ఎన్నాళ్ళనుండో పుంత రోడ్డు నిర్మాణం కోసం ఎదురుచూస్తున్న ప్రజల ఆకాంక్ష ఎంపీపీ చొరవతో నెరవేరింది. తూర్పుగోదావరి జిల్లా, రాయవరం మండలం, నదురుబాద గ్రామపంచాయతీలో ఎప్పటినుంచో పరిష్కారం కాక, ప్రజలు ఎదురుచూసిన పుంత రోడ్డు సమస్యను రాయవరం మండల పరిషత్ అధ్యక్షులు నౌడు వెంకటరమణ చొరవ చూపి, సుమారు రూ.5 లక్షల నిధులతో రోడ్డు పనులు త్వరితముగా పూర్తి చేయించి గురువారం ఆయనే ప్రారంభించినట్లు నదురుబాద గ్రామ సర్పంచ్ చింతపల్లి శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు తమ యాతన తీర్చిన నాయకులకు దుశ్శాలువ కప్పి సన్మానించి, వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మంగతాయారు వెంకటరెడ్డి, మాజీ మండపేట మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, పంచాయితీ వార్డ్ సభ్యులు , సచివాలయ సిబ్బంది, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని రహదారి ప్రారంభ కార్యక్రమంతో సంతోషం వ్యక్తం చేశారు.

### అజిత్ పవార్ మరణాన్ని

# రెండు నెలల ముందే ఊహించిన జ్యోతిష్యుడు..?




ముంబాయి నుంచి బారామతి వెళ్తున్న ప్రైవేట్ జెట్ మిమానం ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు యత్నించిన క్రమంలో అదుపుతప్పి విమానం కుప్పకూలిన సంగతి తెలిసిందే. ఈ ఘటనలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ సహా ఐదుగురు దుర్మరణం చెందారు. అయితే అజిత్ పవార్ మరణంపై రెండు నెలల ముందే ఓ జ్యోతిష్కుడు సోషల్ మీడియాలో బహిరంగంగా పోస్టు పెట్టాడు.. మహారాష్ట్రలో జరిగిన ఘోర విమాన ప్రమాదంలో ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ (66) దుర్మరణం చెందిన సంగతి తెలిసిందే. బుధవారం ఉదయం 8.45 గంటల సమయంలో ముంబాయి నుంచి బారామతి వెళ్తున్న ప్రైవేట్ జెట్ మిమానం ఎయిర్‌పోర్టు రన్‌వేపై దిగేందుకు యత్నించిన క్రమంలో అదుపుతప్పి విమానం కుప్పకూలింది. ఈ ఘటనలో అజిత్ పవార్‌తో సహా మొత్తం ఐదుగురు మృత్యువాత పడ్డారు. డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ ఈ ప్రమాదాన్ని ధృవీకరించింది. బారామతి ఎయిర్‌పోర్టులోని 'టేబుల్ టాప్ రన్‌వే'పై ల్యాండింగ్ ప్రయత్నంలో రన్‌వే అంచున విమానం కూలిపోయిందని స్పష్టం చేసింది. విషాదకరంగా విమానంలో ఉన్న ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారని పేర్కొంది. అజిత్ పవార్‌తో పాటు, ఆయనతో పాటు ఉన్న ఇద్దరు సిబ్బంది, విమానం ఇద్దరు పైలట్లు దుర్మరణం చెందినట్లు వెల్లడించింది. ఈ క్రమంలో ఓ జ్యోతిష్కుడి పోస్ట్ సోషల్ మీడియాలో తెగ వైరల్‌గా మారింది. గతేడాది నవంబర్ 8న జ్యోతిష్కుడు ప్రశాంత్ పెట్టిన ఓ పోస్ట్‌లో డిసెంబర్ 2025 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య ముఖ్యమంత్రి లేదా కేంద్ర మంత్రి మృతి చెందే అవకాశం ఉందని చెప్పాడు. ఒకప్పుడు ముఖ్యమంత్రి లేదా కేంద్ర మంత్రిగా పనిచేసిన అనుభవజ్ఞుడైన కొందరు రాజకీయ నేతలు డిసెంబర్ 2025 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య చనిపోయే అవకాశం ఉందని.. ఆ పోస్టులో పేర్కొన్నాడు. అయితే అజిత్ పవార్ మరణం సరిగ్గా ఇదే సమయంలో చోటు చేసుకోవడంతో ఆయన మరణాన్ని తాను ముందే ఊహించానని చెప్పడం నెట్టింట చర్చకు దారి తీసింది. ఈ మేరకు సదరు జ్యోతిష్కుడు తాజాగా మరో పోస్టు పెట్టాడు. 'డిసెంబర్ 2025 నుంచి ఫిబ్రవరి 2026 మధ్య ఒక అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు చనిపోతారని నేను అంచనా వేసాను....!! మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంలో మరణించారు...!!' అని కీలక వ్యాఖ్యలు చేశాడు. అయితే జ్యోతిష్కుడు ప్రశాంత్ పోస్టుపై నెటిజన్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చనిపోయిన నేత ముఖ్యమంత్రి కాదు లేదా కేంద్ర ముఖ్యమంత్రి కూడా కాదు!!! తమరి అంచనా ఎక్కడ నిజమైందని ఓ యూజర్ వెటకారం చేశాడు. రెండో యూజర్ 'కొన్ని' అని చెప్పడం సులభం. మీరు నిపుణుడైన జ్యోతిష్కుడు కదా.. మరైతే రాజకీయ నాయకుడు ఏ రాష్ట్రానికి చెందినవాడో కూడా చెప్పాలి కదా అని ప్రశ్నించాడు. 'బ్రో.. నీ అంచనాకు నోస్ట్రాడమస్ కూడా కదిలిపోతాడు' అని మరో యూజర్ ఎద్దేవా చేశాడు. 'నువ్వు ఎందుకు మరీ అంత ఉత్సాహంగా ఉన్నావు? ఇది సెలబ్రేట్ చేసుకునే విషయం ఏమీ కాదు. ఇప్పుడు మేమంతా నిన్ను ఓ ప్రవక్తగా గుర్తించాలా?' అని మరో యూజర్ గడ్డి పెట్టాడు. ప్రస్తుతం సదరు జ్యోతిష్కుడి ప్రేలాపనలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

# అలా ఎలా నమ్ముతార్రా..

### తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలన్నారు..



ఎలాంటి కష్టం లేకుండా డబ్బులు సంపాధించొచ్చని.. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వస్తాయని ఓ కేటుగాడు చెప్పిన మాటలను నమ్మి.. ఓ యువకుడిని సర్వం కోల్పోయాడు. అతడు చెప్పినట్టు ఫలు దఫాలుగా ఇన్వెస్ట్ చేసి ఏకంగా రూ.55 లక్షల వరకు లాస్ అయ్యాడు. చివరకు పోలీసులను ఆశ్రయించడంతో ఘటనపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు మాయమాటలు చెప్పి మోసానికి పాల్పడిన సదురు వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్ వ్యవహారంలో అక్రమ ఆన్‌లైన్ గేమింగ్, క్రికెట్ బెట్టింగ్ ద్వారా ప్రజలను మోసం చేసిన కేసులో పుణే (మహారాష్ట్ర)కు చెందిన విషాల్ అనిల్ నిర్మల్‌ను సైబర్ పోలీసులు అరెస్టు చేశారు. సులభంగా డబ్బులు సంపాదించవచ్చని నమ్మించి, నకిలీ లాభాలు చూపిస్తూ బాధితుల నుంచి భారీగా డబ్బులు వసూలు చేసినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో బాధితుడు సికింద్రాబాద్‌కు చెందిన 32 ఏళ్ల వ్యక్తి. 2021లో అతడికి వాట్సాప్ ద్వారా ీూచీ+జుూదీజు777 అనే ఆన్‌లైన్ బెట్టింగ్ వెబ్‌సైట్ ద్వారా సులభంగా డబ్బులు వస్తాయని సందేశాలు వచ్చాయి. మొదట రూ.10 వేలు పెట్టుబడి పెట్టగా స్వల్ప లాభం రావడంతో నమ్మకం ఏర్పడింది. ఆ తర్వాత అదే ఏడాది మొత్తం రూ.10 లక్షలు వివిధ బ్యాంక్ ఖాతాల్లో జమ చేశాడు. చివరకు మొత్తం డబ్బు కోల్పోయాడు. 2022లో మరోసారి విషాల్ బాధితుడిని సంప్రదించి GOEXCH777 అనే మరో బెట్టింగ్ ప్లాట్‌ఫామ్‌లో పెట్టుబడి పెడితే భారీ లాభాలు వస్తాయని నమ్మించాడు. ఈ మాటలు నమ్మిన బాధితుడు 2021 నుంచి 2025 మధ్య కాలంలో బ్యాంక్ ట్రాన్స్‌ఫర్లు, యూపీఐ, క్యాష్ డిపాజిట్ మెషీన్లు, క్యూఆర్ కోడ్‌ల ద్వారా మొత్తం రూ.55 లక్షలు పెట్టుబడి పెట్టి పూర్తిగా నష్టపోయాడు. దీంతో ఈ సారి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి ఫిర్యాదు ఆధారంగా పోలీసులు ఐటీ యాక్ట్ 66C, 66D సెక్షన్లు, బీఎన్ఎస్, తెలంగాణ గేమింగ్ యాక్ట్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో విషాల్ అనిల్ నిర్మల్ తన సహచరులు గుడ్డు, డ్వీడే, సూరజ్ భూషాల్ అలియాస్ బోక్షితో కలిసి వ్యవస్థబద్ధంగా ఆన్‌లైన్ బెట్టింగ్ రాకెట్ నడిపినట్లు గుర్తించారు. విషాల్ గతంలో పుణేలో ఫైనాన్స్ కంపెనీలో పనిచేసి, 2021లో దుబాయ్ వెళ్లి అక్కడ అక్రమ బెట్టింగ్ నెట్‌వర్క్‌తో సంబంధాలు పెంచుకున్నాడు. అక్కడే సూరజ్ భూషాల్ పరిచయంతో బెట్టింగ్ ఏజెంట్ ఐడీలు తీసుకుని భారత్‌లో అక్రమ కార్యకలాపాలు కొనసాగించాడు. GOEXCH777 ప్లాట్‌ఫామ్‌లో ఏజెంట్ ఐడీ తీసుకుని WORLD777 అనే సబ్ వెబ్‌సైట్‌ను ప్రారంభించాడు. ఈ రాకెట్‌ను నడిపేందుకు నకిలీ షెల్ కంపెనీల పేర్లపై 57 బ్యాంక్ ఖాతాలు తెరిచి, వాటిని మ్యూల్ అకౌంట్లుగా ఉపయోగించాడు. కస్టమర్లు డబ్బులు జమ చేసిన తర్వాతే బెట్టింగ్ ఐడీలు ఇచ్చేవారు. అలాగే 79 సిమ్ కార్డులు, విదేశీ సిమ్‌లను ఉపయోగించి బాధితులను సంప్రదించేవాడు. సిమ్ బ్లాక్ అయితే వెంటనే కొత్త సిమ్ ఉపయోగించేవారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు ల్యాప్‌టాప్, 15 మొబైల్ ఫోన్లు, 57 చెక్‌బుక్స్, 79 సిమ్ కార్డులు, 62 డెబిట్ కార్డులు, 15 రబ్బర్ స్టాంపులు, 8 క్యూఆర్ కోడ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఎన్సీఆర్పీ డేటా ప్రకారం దేశవ్యాప్తంగా కనీసం 22 సైబర్ మోసాల కేసులు ఈ షెల్ కంపెనీ ఖాతాలతో సంబంధం ఉన్నట్లు తేలింది. పరారీలో ఉన్న నిందితుల కోసం గాలింపు కొనసాగుతోందన్నారు పోలీసులు.

# వావ్ అమేజింగ్.. 50 ఏళ్ల తర్వాత కెమెరాకు చిక్కిన అరుదైన బ్లాక్ టైగర్..

ఒరిస్సాలోని సిమిలిపాల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో అరుదైన బ్లాక్ టైగర్ ట్రాప్ కెమారాలకు చిక్కింది. సాల్, టేకు, వెదురు చెట్లు ఎక్కువగా వుండే ఈ అటవీ ప్రాంతంలో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్. బ్లాక్ టైగర్స్ ఎక్కువగా ఈ అటవీ ప్రాంతంలోని కనిపిస్తుంటాయి. పులుల శరీరంలో మెలనిజం అధికం కారణంగా పులులు నల్లని చారలతో ఉంటాయి. తెలుగు రాష్ట్రాలను పులులు వణికిస్తున్నాయి. ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం, కొయ్యలగూడెం ప్రాంతాల్లో సంచరించిన మగ పులి పోలవరం అభయారణ్యం ప్రాంతం నుంచి తెలంగాణకు వెళ్లి తిరిగి ఏపీలోకి ప్రవేశించింది. ప్రస్తుతం తన ప్రయాణం పోలవరం అభయారణ్యం వైపుసాగుతుందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు. మరో రెండు రోజులపాటు దాని కదలికలను గుర్తించి ఆ తరువాత ఇప్పటివరకు తీసుకున్న చర్యలను ఏలూరు జిల్లా ఫారెస్ట్ అధికారులు ఉపసంహరించుకుంటారు. మరోవైపు ఒరిస్సాలోని సిమిలిపాల్ రిజర్వ్ ఫారెస్ట్‌లో అరుదైన బ్లాక్ టైగర్ ట్రాప్ కెమారాలకు చిక్కింది. సాల్, టేకు, వెదురు చెట్లు ఎక్కువగా వుండే ఈ అటవీ ప్రాంతంలో టైగర్ రిజర్వ్ ఫారెస్ట్. బ్లాక్ టైగర్స్ ఎక్కువగా ఈ అటవీ ప్రాంతంలోని కనిపిస్తుంటాయి. పులుల శరీరంలో మెలనిజం అధికం కారణంగా పులులు నల్లని చారలతో ఉంటాయి. సిమిలిపాల్ నేషనల్ పార్క్‌లో అటవీ సిబ్బంది, నిపుణులు ఏర్పాటు చేసిన ట్రాప్ కెమెరాలకు తాజాగా బ్లాక్ టైగర్ కనిపించటం పర్యావరణ సమతుల్యతకు దోహద పడుతుందని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.

**పులుల సంఖ్య పెరగడానికి ఇదే కారణం..**

ఇక సిమిలిపాల్‌లో పులుల సంఖ్య పెరగటానికి అక్కడ సాల్ చెట్లు ప్రధాన పాత్ర వహిస్తున్నాయి. ఈ చెట్లు ఒడిస్సా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, పశ్చిమబెంగాల్‌తో పాటు తెలంగాణ , ఆంధ్రప్రదేశ్‌లోని కొన్ని చోట్ల పెరుగుతున్నాయి. ఇవి ఎండా, వానలను తట్టుకోవటంతో పాటు చాలాకాలం జీవిస్తాయి. సాల్ చెట్లతో ఉన్న అడవులు పులుల నివాసానికి అనుకూలంగా ఉంటాయి. అందుకే సిమిలిపాల్‌లో పులుల సంఖ్యలో పెరుగుదల కనిపిస్తుంది. 1975 - 76 ప్రాంతంలో అటవీ అధికారులు , విదేశీ పర్యాటకులు తొలిసారిగా నల్ల పులులను చూసారు. ఇవి ప్రత్యేకంగా ఈ ప్రాంతంలోనే జీవిస్తున్నాయి. ఇవి అరుదైన జాతిగా గుర్తించబడటంతో సిమిలిపాల్‌లో వీటిని పరిరక్షిస్తున్నారు. 1994లో జీవవైవిధ్య పరిరక్షణకు సంబంధించి యునెస్కో బాయిస్పియర్ రిజర్వ్ ప్రాంతంగా సిమిలిపాల్ గుర్తింపు పొందింది. ఇక్కడ పులులు మాత్రమే కాకుండా చిరుతలు, ఏనుగులు, ఎలుగుబంట్లు, జింకలతో పాటు పలు అరుదైన పక్షిజాతులకు ఈ సిమిలిపాల్ వన్యప్రాణి సంరక్షణ కేంద్రం నిలయంగా ఉంది. తాజాగా ఈ నెల జనవరి 20న హరివిజయ్ సింగ్ బహియా తన కెమెరాలో బ్లాక్ టైగర్‌ను తన కెమెరాలో బంధించారు. అంతకు ముందు నాగపూర్‌కు చెందిన ప్రసేన్ జీత్ యాదవ్ తీసిన నల్ల పులి ఫోటోలు నేషనల్ జియోగ్రాఫిక్ 2025 అక్టోబర్ ఎడిషన్ కవర్ ఫోటోగా వచ్చాయి. మరోవైపు ఫిబ్రవరి 4 నుంచి 6 వరకు భారత రాష్ట్రపతి ముర్ము ఒడిస్సాలో పర్యటించబోతున్నారు. ఈ సందర్భంగా ఆమె సిమిలిపాల్‌లో నేషనల్ పార్క్‌ను సందర్శిస్తారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు పర్యాటకులను పార్క్ సందర్శనకు అనుమతించరు.



# యూజీసీ నిబంధనలలో స్పష్టత లేదు..

సుప్రీంకోర్టు కొత్త UGC నిబంధనలను నిలిపివేసింది. ప్రాథమికంగా చూస్తే, నిబంధనల భాషలో స్పష్టత లేదని అనిపిస్తోందని భారత అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. దుర్వినియోగాన్ని నిరోధించడానికి భాషను మెరుగుపరచడానికి దర్యాప్తు అవసరమని తెలిపింది. యూజీసీ నిబంధనలను తిరిగి రూపొందించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. సుప్రీంకోర్టు కొత్త UGC నిబంధనలను నిలిపివేసింది. ప్రాథమికంగా చూస్తే, నిబంధనల భాషలో స్పష్టత లేదని అనిపిస్తోందని భారత అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. దుర్వినియోగాన్ని నిరోధించడానికి భాషను మెరుగుపరచడానికి దర్యాప్తు అవసరమని తెలిపింది. యూజీసీ నిబంధనలను తిరిగి రూపొందించాలని సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అప్పటి వరకు, పాత 2012 నిబంధనలు అమలులో ఉంటాయని తెలిపింది. ఈ కేసులో తదుపరి విచారణ మార్చి 19న జరుగుతుంది. UGC కొత్త నియమాలకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలోనే గురువారం (జనవరి 29), భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం విద్యార్థుల మధ్య వివక్షతను ఆరోపిస్తూ ఖ+జ కొత్త ఈక్విటీ నియమాలను సవాలు చేస్తూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని విచారించింది. ఇరు వాదనలు విన్న తర్వాత, ఖ+జ ప్రమోషన్ ఆఫ్ ఈక్విటీ రెగ్యులేషన్స్ 2026పై సుప్రీంకోర్టు స్టే విధించింది. సుప్రీంకోర్టులో చర్చ సందర్భంగా ఏమి జరిగిందో పరిశీలిద్దాం.. కొత్త UGC నిబంధనలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్లను విచారణ జరిగింది. పిటిషనర్ల తరపు న్యాయవాది, కొత్త నియమం సమాజంలో వివక్షను సృష్టిస్తుందని వాదించారు. "రాజ్యాంగం అందరికీ రక్షణ కల్పిస్తుంది. పౌరులందరికీ రక్షణ కల్పించాలి. అయితే, కొత్త నిబంధనలు గందరగోళంగా ఉన్నాయి. సమాజంలో వివక్షను సృష్టిస్తున్నాయి. అవి OBC, SC, ST వర్గాలకు మాత్రమే అనుకూలమని సూచిస్తున్నాయి" అని పేర్కొన్నారు. వివక్షను నిబంధన 3(వ) ఇప్పటికే నిర్వచిస్తుందని పిటిషనర్ల తరపు న్యాయవాది వాదించారు. అలా నిర్వచిస్తున్నప్పుడు 3(ఛ) అవసరం ఏమిటి? ఇది సమాజంలో విభజనలను సృష్టిస్తుంది. "ఇతర సామాజికవర్గాలపై వివక్షకు ఉదాహరణలు ఉన్నాయి, కానీ నేను అలా చేయడం లేదు" అని న్యాయవాది అన్నారు. దీనికి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు చేశారు. "అంత అవసరం లేదు. కొత్త నియమాలు ఆర్టికల్ 14 (సమానత్వ హక్కు)కి అనుగుణంగా ఉన్నాయా లేదా అని మాత్రమే మేము పరిశీలిస్తున్నాము" అని అన్నారు. ప్రాథమికంగా ఈ నియంత్రణ భాష అస్పష్టంగా ఉందని, నిపుణులు దానిని పరిశీలించి, దుర్వినియోగం కాకుండా దానిని సవరించాలని CJI అన్నారు. సెక్షన్ 3(సి)పై స్టే కోరుతున్నట్లు న్యాయవాది చీఫ్ జస్టిస్ సూర్యకాంత్‌తో అన్నారు. ఇది కొన్ని వర్గాలపై మాత్రమే వివక్షను కలిగిస్తుందన్నారు. దీంతో CJI సూర్యకాంత్, "ఒక దక్షిణ భారత విద్యార్థి ఉత్తర భారతదేశంలోని కళాశాలకు వచ్చి అనుచిత వ్యాఖ్యలు పడాల్సి వచ్చిందనుకుందాం. సెక్షన్ 3(ఇ) దానిని ప్రస్తావిస్తుందా?" అని సీజేఐ ప్రశ్నించారు. దానికి న్యాయవాది బదులిచ్చారు, "అవును. మేము చెప్పేది అదే, కొన్ని కులాల కోసం ప్రత్యేక విభాగాన్ని సృష్టించాల్సిన అవసరం లేదు." అన్నారు. కొత్త UGC నిబంధనలపై సుప్రీంకోర్టు స్టే విధించింది. 2012 నాటి నిబంధనలు అమలులో ఉండాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. మార్చి 19, 2026 నాటికి స్పందనలు తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వానికి, UGCకి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ మార్చి 19న జరుగుతుందని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ పేర్కొన్నారు. "మనం కుల రహిత సమాజం వైపు పయనిస్తున్నామా లేదా వెనుకకు వెళ్తున్నామా? విద్యార్థులు హాస్టళ్లలో కలిసి జీవించడం మనం చూశాం. కొత్త నియమాలు ప్రత్యేక హాస్టళ్లను సృష్టిస్తాయి. ఇది జరగకూడదు" అని సీజేఐ సూర్యకాంత్ నిబంధనలపై స్టే విధిస్తూ ప్రశ్నించారు. ప్రస్తుత సమాజంలో.. దేశంలో ఐక్యత కోసం మనం కృషి చేయాలని జస్టిస్ బాగ్చి కూడా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. "మేము ప్రభుత్వం నుండి ప్రతిస్పందనను కోరుతాము. కొంతమంది ఈ పరిస్థితిని సద్వినియోగం చేసుకోవచ్చు. నిపుణుల కమిటీ కూడా ఏర్పాటు కావచ్చు" అని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ అన్నారు.

**స్టే విధించిన సుప్రీంకోర్టు.. కేంద్రానికి కీలక ఆదేశాలు..!**



**UGC కొత్త నియమాలు ఏమిటి?**

ప్రతి కళాశాలలో సమాన అవకాశాల కేంద్రం అంటే జుూజ ఏర్పాటు చేశాలని నిర్ణయం.

చదువులు, ఫీజులు, వివక్షతకు సంబంధించిన వెనుకబడిన విద్యార్థులకు జుూజ సహాయం అందిస్తుంది.

ప్రతి కళాశాలలో సమానత్వ కమిటీని ఏర్పాటు చేయాలి, దానికి ఛైర్మన్‌గా కళాశాల అధిపతి ఉంటారు.

ఈ కమిటీలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మహిళలు, వికలాంగులు ఉంటారు. దీని పదవీకాలం రెండేళ్లు ఉంటుంది.

కళాశాలలో ఒక సమానత్వ బృందాన్ని కూడా ఏర్పాటు చేస్తారు, ఇది వివక్షపై నిఘా ఉంచుతుంది.

వివక్షకు సంబంధించిన ఏదైనా ఫిర్యాదుకు 24 గంటల్లోపు సమావేశం అవసరం.

ఫిర్యాదులపై 15 రోజుల్లోపు కళాశాల అధిపతికి నివేదిక సమర్పించాలి.

కళాశాల అధిపతి 7 రోజుల్లోపు తదుపరి చర్య తీసుకోవాలి.

EOC ప్రతి 6 నెలలకు కళాశాలకు తన నివేదకను అందజేస్తుంది.

కళాశాల ప్రతి సంవత్సరం కుల వివక్షపై UGCకి నివేదికను పంపాలి.

UGC జాతీయ పర్యవేక్షణ కమిటీని ఏర్పాటు చేస్తుంది.

నిబంధనలను ఉల్లంఘించే కళాశాలలు గ్రాంట్లను నిలిపివేస్తాయి.


కళాశాల డిగ్రీలు, ఆన్‌లైన్, దూర కోర్సులు నిషేధించవచ్చు.

తీవ్రమైన సందర్భాల్లో, UGC గుర్తింపును కూడా రద్దు చేయవచ్చు.

బిజినెస్ వాయిస్

# భారత్ యాత్ర కార్డు వచ్చేసింది..

## ఒకే కార్డుతో అన్నింటిల్లోనూ ప్రయాణం.. ఎలా వాడాలంటే..?




ప్రయాణికులకు గుడ్‌న్యూస్. ఇక నుంచి మెట్రో, ఆర్టీసీ, రైలు సేవలకు ప్రత్యేకంగా టికెట్లు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. ఒకే కార్డుతో అన్నింటిల్లోనూ ప్రయాణించవచ్చు. ఈ మేరకు భారత్ యాత్ర పేరుతో కార్డు అందుబాటులోకి వచ్చింది. ఈ కార్డు ఎలా వాడాలంటే.. దేశవ్యాప్తంగా మెట్రోలలో లేదా ఇతర రాష్ట్రాల్లోని ప్రజా రవాణా వ్యవస్థల్లో ఒకే కార్డుతో పేమెంట్ చేయవచ్చు. మెట్రోలు, ఆర్టీసీ, రైల్వే స్టేషన్లలో పేమెంట్స్ చేయవచ్చు. ప్రతీచోట డబ్బులు చెల్లించి ప్రత్యేకంగా టికెట్ కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. దీని వల్ల ప్రయాణికులు సమయం తగ్గడం వల్ల వేగవంతంగా ప్రయాణం చేయవచ్చు. ఈ మేరకు రూపే చెల్లింపు వ్యవస్థ ఆధారంగా పైన్ ల్యాబ్స్ అనే సంస్థ కామన్ మొబిలిటీ కార్డును అందుబాటులోకి తీసుకొచ్చింది. పర్యాటకులకు ఈ కార్డు ఎంతో ఉపయోగపడనుంది. ఈ కార్డులో అనేక ప్రత్యేకతలు ఉన్నాయి. వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

**ఫీచర్లు ఇవే..**

ఒకే కార్డుతో మెట్రో, ఆర్టీసీ, రైల్వే స్టేషన్లలో చెల్లింపులు -కాంట్రాక్ట్ లెస్ పేమెంట్స్ -జస్ట్ స్కాన్ చేస్తే ప్రయాణ ఛార్జీలు ఆటోమేటిక్‌గా అవుతాయి -సులువుగా ఈ కార్డ్‌కు రీఛార్జ్ చేసుకునే సౌకర్యం -గరిష్ట బ్యాలెన్స్ రూ.2 వేల వరకు రీచార్జ్ చేసుకోవచ్చు -ఈ కార్డు వాడుకోవడానికి ఎలాంటి కేవైసీ అవసరం లేదు -మొబైల్ నెంబర్, క్యూఆర్ కోడ్ ఆధారంగా కార్డ్ యాక్టివేషన్ చేసుకోవచ్చు

**కార్డ్ ఎలా పొందాలి**

బ్లింకిట్, జెప్టో, ఫ్లిప్కార్ట్ ద్వారా ఆర్డర్ చేసుకోవాలి. రూ.50 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. దీంతో మీ ఇంటికే కార్డు డెలివరీ అవుతుంది. కేవలం 10 నిమిషాల్లోనే ఇంటికి కార్డు వచ్చేస్తుంది. ప్రస్తుతం ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై, అహ్మదాబాద్‌లో ఈ కార్డ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. త్వరలో అన్ని నగరాలకు విస్తరించనున్నారు. కార్డు వచ్చాక భారత్ యాత్ర యాప్ డౌన్‌లోడ్ చేసుకుని కార్డును యాక్టివేట్ చేసుకోవాలి. ఇందుకోసం కార్డు వెనుక ఉండే క్యూఆర్ కోడ్ యాప్ ద్వారా స్కాన్ చేయాలి.

# మ్యూచువల్ ఫండ్.. బడ్జెట్ సిఫార్సులు ఇవే!

## ఇక అంతా నిర్మలమ్మ చేతుల్లోనే!




మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ రూ.80 లక్షల కోట్లకు పైగా ఎయుఎంతో బలమైన వృద్ధిని సాధించింది. బడ్జెట్ 2026లో పరిశ్రమ పన్ను సంస్కరణలు, ముఖ్యంగా డెట్ ఫండ్‌లకు ఇండెక్సేషన్ ప్రయోజనాలను పునరుద్ధరించాలని, మూలధన లాభాల పన్నును సరళీకరించాలని కోరుతోంది. మరిన్ని వివరాలు ఇలా ఉన్నాయి..గత కొన్ని సంవత్సరాలుగా మ్యూచువల్ ఫండ్ పరిశ్రమ బలమైన వృద్ధిని సాధించింది. డిసెంబర్ 2025లో పరిశ్రమ నిర్వహణలో ఉన్న ఆస్తులు (ఏయూఎం) రూ.80 లక్షల కోట్లు దాటాయి. ప్రభుత్వం ఆదాయపు పన్ను సంస్కరణలను కొనసాగిస్తే, దీర్ఘకాలిక పెట్టుబడులను ప్రోత్సహిస్తే, అది రిటైల్ పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పెంచుతుందని పరిశ్రమ విశ్వసిస్తుంది. డెట్ ఫండ్లలో పెట్టుబడిదారుల భాగస్వామ్యాన్ని పెంచడానికి కూడా చర్యలు అవసరం. బడ్జెట్ పై తమ అంచనాలను ఎఎంఎఫ్ఐ ప్రభుత్వానికి తెలియజేసిందని విఎస్‌ఆర్‌కె క్యాపిటల్ డైరెక్టర్ స్వప్నిల్ అగర్వాల్ అన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా పన్ను నిబంధనలలో వచ్చిన మార్పులు ముఖ్యంగా డెట్ మ్యూచువల్ ఫండ్లలో పెట్టుబడులను ప్రభావితం చేశాయి. డెట్ ఫండ్ల కోసం ఇండెక్సేషన్ ప్రయోజనాలను తిరిగి ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. మూలధన లాభాల పన్ను నియమాలను కూడా సరళీకరించాలి. ఇది పన్ను తర్వాత రాబడిని పెంచుతుంది, దీర్ఘకాలిక పెట్టుబడికి మ్యూచువల్ ఫండ్లను ఆకర్షణీయంగా చేస్తుంది. 2023 కేంద్ర బడ్జెట్‌లో ప్రభుత్వం ఇండెక్సేషన్ ప్రయోజనాలను తొలగించింది, ఇది డెట్ ఫండ్లలో దీర్ఘకాలిక పెట్టుబడులపై ప్రభావం చూపింది. ఆర్థిక వ్యవస్థకు స్థిరమైన దేశీయ మూలధనం అవసరమైన సమయంలో పాలసీ మార్పు డెట్ మ్యూచువల్ ఫండ్ల ఆకర్షణను తగ్గించిందని వాల్‌ట్రస్ట్ డైరెక్టర్, సహ వ్యవస్థాపకుడు రాహుల్ భూటోరియా అన్నారు. డెట్ మ్యూచువల్ ఫండ్లకు పాత పన్ను నియమాలు పునరుద్ధరిస్తే, గృహాల నుండి హెచ్‌ఎన్‌ఐ మూలధనం నుండి వడ్డీ స్థిర ఆదాయ ఉత్పత్తులపై పెరుగుతుంది. ఇది బాండ్ మార్కెట్లో ద్రవ్యతను కూడా పెంచుతుంది, కంపెనీలు, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు నిధులను సేకరించడం సులభం చేస్తుంది. మూలధన లాభాల పన్నును తక్కువగా ఉంచాలి, తరచుగా మార్చకూడదు. ఇది ముఖ్యంగా ఎస్ఐపిల ద్వారా పెట్టుబడిని పెంచుతుంది. ఇది పదవీ విరమణ-కేంద్రీకృత ఉత్పత్తులపై పెట్టుబడిదారుల ఆసక్తిని కూడా పెంచుతుందని ఆయన అన్నారు. ప్రభుత్వం ఈ చర్యలపై దృష్టి సారించడం కొనసాగిస్తే, క్రమబద్ధమైన పెట్టుబడి ప్రోత్సహించబడుతుంది. పెన్షన్ తరహా మ్యూచువల్ ఫండ్ పథకాలు, పదవీ విరమణ-సంబంధిత ఖాతాలు, రుణ ఆధారిత పొదుపు ఉత్పత్తులను ప్రవేశపెట్టాలని ఆయన సిఫార్సు చేశారు. ఇది కుటుంబాలు తమ దీర్ఘకాలిక పొదుపులను ఆర్థిక ఉత్పత్తులుగా మార్చడానికి సహాయపడుతుంది. ఇది భౌతిక ఆస్తులపై ప్రజల ఆధారపడటాన్ని పెంచుతుంది. వారి పదవీ విరమణ సంసిద్ధతను మెరుగుపరుస్తుంది. మార్కెట్ దృక్కోణం నుండి, మూలధన లాభాల నియమాలను, సెక్యూరిటీ లావాదేవీల పన్నును సరళీకృతం చేయడానికి చర్యలు తీసుకోవాలి.

# భారీగా కుదేలవ్వనున్న బంగారం ధరలు..

## గోల్డ్ ప్రియులకు ఇదొక డేంజర్ బెల్!



ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్.. బంగారం కొనుగోళ్లతో మార్కెట్‌లు సందడిగా ఉండాల్సిన సమయం. కానీ గోల్డ్ షాపుల్లో ఆ సందడి లేదు. బంగారం కొనాలన్న ఆలోచనే పక్కన పెట్టేశారు జనం. కానీ గోల్డ్ రేట్ మాత్రం పగ్గాలు లేకుండా దూసుకుపోతోంది. మార్కెట్ సూత్రం ప్రకారం..డిమాండ్ తగ్గితే ధర తగ్గాలి. మరి గోల్డ్ విషయంలో అలా ఎందుకు జరగడం లేదు..? పట్టపగ్గాలు లేకుండా పెరిగిపోతోంది బంగారం రేటు. ఏ రోజుకారోజు..సరికొత్త రికార్డులను క్రియేట్ చేస్తోంది. బంగారం ధర పెరుగుతోందంటే.. అదికొన్నవాళ్లలో ఆనందం ఉండాలి. కానీ ప్రస్తుతం బంగారం కొంటున్న వాళ్లలో ఒకరకమైన భయం మొదలయింది. ఎందుకంటే.. బంగారం ధర నిజంగా పెరుగుతోందా..? లేక ఎవరైనా కావాలని పెంచుతున్నారా..? అనే సందేహం వారిని వెంటాడుతోంది. గతంలో జరిగిన పరిణామాలు కూడా అందుకు కారణం. 2025లోనే బంగారం ధర 60 శాతం పెరిగింది. ఇది మామూలు పెరుగుదల కాదు.. అసాధారణమైన పెరుగుదల. ఇది ఒకరకంగా 'బబుల్' అంటున్నారు ఎక్స్‌పర్ట్స్. ఈ బబుల్ ఎప్పుడైనా పగిలిపోవచ్చని.. సామాన్యులు ఆ ట్రాప్‌లో పడవద్దని హెచ్చరిస్తున్నారు. బంగారం ధర ఈ స్థాయిలో పెరుగుదలకు విదేశీ సంస్థల 'రిపోర్ట్' మాయాజాలం కూడా కారణం కావచ్చన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. మార్కెట్ గరిష్ట స్థాయిలో ఉన్నప్పుడు.. గోల్డ్‌మ్యాన్ సాక్స్, జేపీ మోర్గాన్ వంటి పెద్ద పెద్ద విదేశీ రీసెర్చ్ సంస్థలు "బంగారం ఇంకా పెరుగుతుంది" అంటూ పాజిటివ్ రిపోర్ట్స్ ఇస్తాయి. సామాన్యులు ఆ రిపోర్ట్స్ నమ్మి ఎగబడి కొంటారు. అదే సమయంలో.. ఆ సంస్థలు, పెద్ద ఇన్వెస్టర్లు తమ దగ్గర ఉన్న బంగారాన్ని మెల్లగా అమ్ముకుని లాభాలు తీసుకుంటారు. చివరికి రేట్లు పడిపోయాక..వాళ్లు లాభాల్లో ఉంటారు. గరిష్ట రేటుకు కొన్న సామాన్యులు మాత్రం నష్టాల్లో చిక్కుకుంటారు. ఏదైనా వస్తువు ధర సప్లై-డిమాండ్ మీద ఆధారపడి ఉంటుంది. కానీ బంగారం ధర మాత్రం లండన్, న్యూయార్క్‌లో ఉండే కొన్ని పెద్ద బ్యాంకులు కూడబలుక్కొని ధరను ఫిక్స్ చేస్తాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఎందుకంటే గతంలో జే.పీ మోర్గాన్ బ్యాంక్ "స్పూఫింగ్" అనే టెక్నిక్ వాడి గోల్డ్ రేట్‌ను అమాంతం పెంచేసింది. కొనాలని లేకపోయినా లక్షల కొద్దీ "ఫేక్ ఆర్డర్స్" పెట్టి, రేటు పెరిగాక ఆ ఆర్డర్స్ క్యాన్సిల్ చేయడమే "స్పూఫింగ్" టెక్నిక్. ఈ నేరం బయటపడ్డంతో ఆ బ్యాంకు ఏకంగా 920 మిలియన్ డాలర్లు అంటే మన కరెన్సీలో సుమారు 7 వేల 600 కోట్ల రూపాయల జరిమానా కట్టింది. దీన్ని బట్టి మార్కెట్ మ్యానిపులేషన్ నిజమేనని తెలుస్తోంది. ఈ బంగారం ధర 'బుడగలా' పేలిపోయే అవకాశం ఉందన్న వాదనకు గతంలో జరిగిన ఘటనలు కూడా ఆధారంగా నిలుస్తున్నాయి. 1980లో బంగారం రేటు పీక్స్‌కి వెళ్లింది. దీంతో అందరూ ఎగబడి కొన్నారు. తర్వాత 57% పడిపోయింది. మళ్ళీ ఆ రేటు రావడానికి 25 ఏళ్లు పట్టింది. లేటెస్ట్‌గా 2011లో కూడా మళ్ళీ అలాగే పెరిగింది. తర్వాత 45% క్రాష్ అయ్యింది. అది కోలుకోవడానికి 4 ఏళ్లు పట్టింది. ఇప్పుడు 2026లో కూడా సేమ్ సీన్ రిపీట్ అయ్యే ఛాన్స్ ఉందని హెచ్చరిస్తున్నారు అనలిస్ట్‌లు. స్టాక్ మార్కెట్ కుప్పకూలితే ఇన్వెస్టర్లు నగదు కోసం బంగారం, వెండి ఈటీఎఫ్‌లను విక్రయించడం ప్రారంభిస్తారు. తక్కువ ధరలో దొరుకుతున్న షేర్లను కొనడానికి వీటిలో లాభాలను స్వీకరించడం సహజం. దీనివల్ల బంగారం, వెండి ధరల్లో పెద్ద ఎత్తున దిద్దుబాటు వచ్చే అవకాశం ఉంటుంది. సామాన్యుల్లో కొనాలనే ఆసక్తి ఉంటేనే ఏ వస్తువుకైనా డిమాండ్ ఉంటుంది. ఒక్కసారి వారికి ఆ సెంటిమెంట్ పోతే.. దాని ధర ఎంత పెరిగినా, తగ్గినా పట్టించుకునే వాళ్లు ఉండరు. ఇప్పటికే పేదలకు దూరమైన బంగారం..మధ్య తరగతి ప్రజలకు కూడా త్వరలోనే అందని సరుకుగా మారిపోనుంది. ప్రస్తుతం మన దగ్గర పెళ్లిళ్ల సీజన్ ఉన్నా కూడా..జనం బంగారం కొనడం తగ్గించేశారు. రిటైల్ మార్కెట్లో కొనుగోళ్లు భారీగా పడిపోయాయి. ఇది ఒక డేంజర్ సిగ్నల్. ఎప్పుడైతే సామాన్యులు కొనలేరో.. అప్పుడు రేట్లు పడటం ఖాయం. మార్కెట్ విశ్లేషకులు కూడా అదే చెబుతున్నారు. సో..బంగారం కొనాలనుకునే వాళ్లు..బీ కేర్ ఫుల్..

# అనిల్ అంబానీకి బిగ్ షాక్..! కోట్ల విలువైన ఆస్తులన్నీ..





అనిల్ అంబానీ గ్రూప్‌కు చెందిన రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, కమర్షియల్ ఫైనాన్స్, కమ్యూనికేషన్స్, ఎస్ బ్యాంక్ సంబంధిత బ్యాంకు మోసం కేసుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) సంచలన చర్యలు తీసుకుంది. సుమారు రూ.1,885 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసింది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్, రిలయన్స్ కమ్యూనికేషన్స్, ఎస్ బ్యాంక్‌లకు సంబంధించిన బ్యాంకు మోసం కేసులకు సంబంధించి అనిల్ అంబానీ గ్రూప్‌తో సంబంధం ఉన్న కంపెనీలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (జుణ) ప్రధాన చర్యలు తీసుకుంది. సుమారు రూ.1,885 కోట్ల విలువైన ఆస్తులను తాత్కాలికంగా జప్తు చేసింది. నాలుగు వేర్వేరు ఆదేశాల ద్వారా జుణ అటాచ్ చేసిన ఆస్తులలో బ్యాంక్ బ్యాలెన్స్‌లు, రాబడులు, అన్‌లిస్టెడ్ కంపెనీలలో వాటాలు, స్థిరాస్తులు ఉన్నాయి. అటాచ్ చేసిన ఆస్తులలో రిలయన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ దీూజుూ యమునా పవర్, దీూజుూ రాజధాని పవర్, ముంబై మెట్రో వన్ షేర్లు కూడా ఉన్నాయి. అదనంగా వాల్యూ కార్ప్ ఫైనాన్స్ అండ్ సెక్యూరిటీస్ లిమిటెడ్ వద్ద ఉన్న రూ.148 కోట్ల బ్యాంకు బ్యాలెన్స్, రూ.143 కోట్ల బకాయిలను జప్తు చేశారు. రిలయన్స్ గ్రూప్‌లోని ఇద్దరు సీనియర్ ఉద్యోగులు అంగరై సేతురామన్ పేరు మీద ఉన్న ఒక నివాస గృహాన్ని, పునీత్ గార్గ్ పేరు మీద ఉన్న షేర్లు, మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులను కూడా ఈడి అటాచ్ చేసింది. ఈడి ప్రకారం.. రిలయన్స్ కమ్యూనికేషన్స్, రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్‌లకు సంబంధించిన కేసులలో ఇప్పటికే రూ.10,117 కోట్లకు పైగా ఆస్తులను అటాచ్ చేశారు. మొత్తం అటాచ్‌మెంట్లు ఇప్పుడు సుమారు రూ.12,000 కోట్లకు చేరుకున్నాయి. అనిల్ అంబానీ గ్రూప్ కంపెనీలు ప్రజా నిధులను దుర్వినియోగం చేశాయని, నిధులను దారి మళ్లించాయని దర్యాప్తు సంస్థ ఆరోపించింది. 2017, 2019 మధ్య ఎస్ బ్యాంక్ రిలయన్స్ హోమ్ ఫైనాన్స్, రిలయన్స్ కమర్షియల్ ఫైనాన్స్‌లలో వేల కోట్ల రూపాయలను పెట్టుబడి పెట్టింది, తరువాత ఇవి ఎన్‌పిఎలుగా మారాయి. నిబంధనలను దాటవేయడానికి మ్యూచువల్ ఫండ్ డబ్బును మొదట ఎస్ బ్యాంక్ ద్వారా, తరువాత రిలయన్స్ గ్రూప్ కంపెనీలకు మళ్లించారని జుణ దర్యాప్తులో తేలింది. =జూవీ మొత్తం రూ.40,000 కోట్లకు పైగా రుణ మోసం ఆరోపణలు ఎదుర్కొంటోంది, అనేక బ్యాంకులు ఖాతాలను మోసపూరితంగా ప్రకటించాయి. దర్యాప్తు కొనసాగుతోందని, నేరస్థుల నుండి నేరం ద్వారా వచ్చిన ఆదాయాన్ని తిరిగి పొందేందుకు, బాధితులకు తిరిగి ఇవ్వడానికి ప్రయత్నాలు జరుగుతాయని ఈడి పేర్కొంది.

# కరెన్సీ నోట్లు చిత్తు కాగితాలు అవుతాయి!

## రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత సంచలన ప్రకటన

రిచ్ డాడ్ పూర్ డాడ్ రచయిత రాబర్ట్ కియోసాకి ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తం చేశారు. ఫియాట్ కరెన్సీలు తమ విలువను కోల్పోయి కాగితపు ముక్కలుగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ద్రవ్యోల్బణం, ఆర్థిక సంక్షోభాల నుండి తమను తాము రక్షించుకోవడానికి బంగారం, వెండి, బిట్‌కాయిన్‌లలో పెట్టుబడి పెట్టాలని ఆయన సూచించారు. ఆర్థిక విషయాలకు సంబంధించి విలువైన సూచనలు, సలహాలు ఇచ్చే రిచ్ డాడ్ పూర్ డాడ్ పుస్తక రచయిత రాబర్ట్ కియోసాకి మరోసారి సంచలన ప్రకటన చేశారు. ఇక విధంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై హెచ్చరికలు జారీ చేశారు. ఇప్పుడు వాడుకలో ఉన్న నోట్లు (డాలర్, రూపాయి వంటి ఫియాట్ కరెన్సీలు) భవిష్యత్తులో కేవలం కాగితపు ముక్కలుగా మిగిలిపోయే ప్రమాదం ఉందని అన్నారు. ఆ టైమ్‌లో మిమ్మల్ని రక్షించేది బంగారం మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. రాబర్ట్ కియోసాకి ఫియాట్ కరెన్సీల పతనంపై చేసిన ఈ హెచ్చరిక ఇప్పుడు సంచలనంగా మారింది. ఇష్టమొచ్చినట్లు ప్రభుత్వాలు నోట్లు ముద్రించడం, పెరిగిపోతున్న దేశాల అప్పుల భారం వల్ల కరెన్సీ తన అసలు విలువను కోల్పోతోందని ఆయన అభిప్రాయపడుతున్నారు. ద్రవ్యోల్బణం అనే భూతం మీ జేబులోని డబ్బును తినేస్తోందని హెచ్చరిస్తున్నారు. ఆర్థిక మాంద్యం, బ్యాంకింగ్ సంక్షోభం తలెత్తినప్పుడు స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతాయి. కానీ బంగారం ఎప్పుడూ తన విలువను కోల్పోదని అన్నారు. కొన్ని ఏళ్లుగా బంగారం తన విలువను నిలుపుకుంది. దీనిని ఏ ప్రభుత్వం కూడా కావాలని సృష్టించలేదు, కనుక దీని




విలువను తగ్గించలేరు. యుద్ధాలు, రాజకీయ అస్థిరత ఉన్న సమయంలో బంగారం పెట్టుబడిదారులకు ఒక 'సేఫ్ హెవెన్' లాంటిది. కేవలం బంగారం మీద మాత్రమే కాకుండా, భవిష్యత్తు ఆర్థిక షాక్‌ల నుంచి తప్పించుకోవడానికి కియోసాకి ఒక మూడు అంచెల వ్యూహాన్ని సూచిస్తున్నారు. దీర్ఘకాలిక స్థిరత్వం కోసం బంగారం , తక్కువ ధరలో లభించే వెండి, డిజిటల్ యుగంలో విప్లవాత్మక ఆస్తిగా బిట్‌కాయిన్‌ను సూచించారు.

# మాములోడు కాదుగా.. జీతం 18 వేలు..

## ఆస్తులు మాత్రం 20 కోట్లు.. ఎలా సంపాదించాడో తెలిస్తే..





ఆదాయానికి మించిన ఆస్తులు ఉన్నాయన్న ఆరోపణలు రావడంతో ఓ హోంగార్డ్ ఇంట్లో సోదాలు నిర్వహించిన ఏసీబీ అధికారులకు దిమ్మ తిరిగి మైండ్ బ్లాక్ అయ్యే విషయాలు తెలిశాయి. ఆ హోమ్ గార్డ్ స్థిర, చర ఆస్తులు విలువ చూసి ఏసీబీ అధికారులు నోరెళ్లబెట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక హోమ్ గార్డ్ వద్ద ఇంత భారీ మొత్తం ఆస్తులు ఉండడం ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సంచనం సృష్టిస్తుంది. ఇంతకు అతని ఆస్తుల విలువెంతో తెలుసా? విజయ నగరం జిల్లా పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న నెట్టి శ్రీనివాసరావుపై ఆదాయానికి మించిన ఆస్తులున్నాయన్న ఆరోపణలు రావడంతో.. ఆయన ఇంటితో పాటు పలు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. గుర్ల మండలంతో పాటు విశాఖపట్నంలో రెండు ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో శ్రీనివాసరావు భారీగా చర, స్థర ఆస్తులు కూడబెట్టినట్టు అధికారులు గుర్తించారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం: శ్రీనివాసరావు గతంలో సుమారు 15 సంవత్సరాల పాటు ఏసీబీలో హోమ్ గార్డ్‌గా విధులు నిర్వహించారు. అలా ఏసీబీ కార్యాలయంలో పనిచేసిన శ్రీనివాస్ అదే ఆదాయ వనరుగా మార్చుకున్నారు. అవినీతి అధికారులకు ఎసిబి పై ఉన్న భయాన్ని అడ్డుపెట్టుకొని పెద్దఎత్తున అవినీతికి పాల్పడినట్లు అధికారులు గుర్తించారు. ఇతని పై వచ్చిన అనేక అవినీతి ఆరోపణలు నేపథ్యంలో ఏడాది క్రితం ఏసీబీ అధికారులు ఆయనను జిల్లా పోలీస్ కార్యాలయానికి సరెండర్ చేశారు. ఏసీబీలో పనిచేస్తున్న సమయంలో అవినీతికి పాల్పడుతున్న అధికారులకు ముందస్తు సమాచారం ఇచ్చి భారీగా సొమ్ము చేసుకున్నట్లు ఏసీబీకి ఫిర్యాదులు అందినట్టు తెలుస్తోంది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి నెలవారీ వసూళ్లు, జిల్లా స్థాయి అధికారులను బ్లాక్ మెయిల్ చేయడం, అలాగే ఆకాశరామన్న లెటర్స్ పేరుతో అధికారుల పై ఫిర్యాదులు వచ్చాయని వారిని హెచ్చరిస్తూ డబ్బులు డిమాండ్ చేసిన ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. అలాగే జిల్లాలోని పలువురు రెవెన్యూ అధికారులను బెదిరించి జగనన్న కాలనీల్లో సుమారు 50కి పైగా ప్రభుత్వ స్థలాలను అక్రమంగా సొంతం తనతో పాటు తన బంధువులు, కుటుంబసభ్యుల పేరిట సొంతం చేసుకున్నట్లు తెలుస్తుంది. విశాఖపట్నం, విజయనగరం సహా పలు ప్రాంతాల్లో స్థలాలు, అపార్ట్మెంట్ ఫ్లాట్లు, ఇతర స్థిరాస్తులు కొనుగోలు చేసినట్లు ఏసీబీ అధికారులు కీలక డాక్యుమెంట్స్ స్వాధీనం చేసుకున్నారు. ప్రాథమిక సమాచారం మేరకు మార్కెట్ వాల్యూ ప్రకారం శ్రీనివాసరావు సుమారు 20 కోట్ల వరకు అక్రమంగా సంపాదించి ఉండవచ్చని అంచనా వేస్తున్నారు అధికారులు. సోదాల సందర్భంగా కీలక పత్రాలు, ఆస్తుల వివరాలు, లావాదేవీలపై ఏసీబీ అధికారులు దృష్టి సారించారు. అందులో భాగంగా హోం గార్డ్ శ్రీనివాస్ డైరీలో రాసిన కీలక ఆధారాలు సేకరించారు. ఏ ఏ అధికారి నుంచి ఎంత వస్తున్నాయి? వారి మధ్య జరిగిన ఆర్థిక లావాదేవీలు, పలువురు జిల్లా అధికారులతో పాటు గతంలో ఎసిబిలో పనిచేసిన పలువురు అధికారుల ఆర్థిక లావాదేవీలు అన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

# ఏపీలోని రైతులకు అదిరిపోయే గుడ్‌న్యూస్..

## కొత్త యాప్ తీసుకొచ్చిన ప్రభుత్వం.. అన్నీ సేవలు ఒకేచోట..



ఏపీలోని రైతుల కోసం ప్రభుత్వం మరో కొత్త యాప్ అందుబాటులోకి తెచ్చింది. వివరాలన్నీ ఒకేచోట లభించేలా యాప్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్‌ను రైతులందరూ డౌన్‌లోడ్ చేసుకుని వినియోగించాలని వ్యవసాయశాఖ సూచించింది. ఈ మేరకు రైతుల మొబైల్స్‌కు డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా యాప్ లింక్‌లు పంపుతోంది. ఆంధ్రప్రదేశ్‌లోని రైతులకు రాష్ట్ర ప్రభుత్వం మరో తీపికబురు అందించింది. రైతులకు సమాచారం మొత్తం ఒకేచోట లభించేలా సరికొత్త యాప్‌ను రూపొందించింది. తాజాగా ఈ యాప్‌ను అధికారికంగా లాంచ్ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న రైతులందరికీ ఈ యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. దీంతో రైతులు వ్యవసాయ సమాచారం, పంట సమాచారం, వాతావరణ పరిస్థితులు, మార్కెట్ ధరలు, ప్రభుత్వ పథకాలు లాంటి వివరాలన్నీ ఒకేచోట చూసుకోవచ్చు. సమాచారం మొత్తం ఒకేచోట ఉండటంతో వెదర్ రిపోర్ట్, ప్రభుత్వ పథకలు, సబ్సిడీ వివరాలతో రైతులు ప్రయోజనం పొందవచ్చు. ఇప్పటికే వాట్సప్ గవర్నెన్స్ ప్రవేశపెట్టిన ప్రభుత్వం.. అన్ని రంగాల్లో టెక్నాలజీని ప్రవేశపెడుతోంది. అందులో భాగంగా రైతులకు ఉపయోగపడేలా ఈ కొత్త యాప్‌ను లాంచ్ చేసింది.

### మరో కొత్త యాప్

ఏపీలోని రైతుల కోసం వ్యవసాయ శాఖ నూతనంగా వెబ్‌సైట్‌తో పాటు రెండు యాప్‌లను తీసుకొచ్చింది. https://agriculture.ap.gov.in/home వెబ్‌సైట్‌తో పాటు ఏపీ అగ్రీ, APAIMS 2.0 పేరుతో రెండు యాప్‌లను ప్రవేశపెట్టింది. ఈ యాప్స్ ద్వారా వివిధ పంటల సాగు, చీడ పీడల వివరాలు, వాతావరణ, మార్కెట్ సమాచారం, ప్రభుత్వ రాయితీ పథకాలు మొదలగు అన్నీ వివరాలు తెలుసుకోవచ్చని ఏపీ వ్యవసాయశాఖ తెలిపింది. ఆండ్రాయిడ్, ఐఓఎస్ రెండు వెర్షన్లలో ఈ యాప్స్‌ను ప్రవేశపెట్టింది. ఈ యాప్‌లను అందరూ డౌన్‌లోడ్ చేసుకోవాల్సిందిగా రైతుల ఫోన్లకు ప్రభుత్వం మెస్సేజ్‌లను పంపుతోంది.

### ఫార్మర్ చాట్

ఇక ఏపీ ప్రభుత్వం ఫార్మర్ చాట్ అనే యాప్‌ను కూడా అందుబాటులోకి తెచ్చింది. డిజిటల్ గ్రీన్ ట్రస్ట్ సహకారంతో ఈ యాప్ రూపొందించారు. ఈ యాప్ వ్యవసాయానికి సంబంధించి అన్ని సలహాలు రైతులకు అందిస్తుంది. రైతులకు ఏమైనా అనుమాలు ఉంటే వాటన్నింటికి సమాధానాలు ఇస్తుంది. ఇక వ్యవసాయమే కాకుండా పాడి, కోళ్ల, మత్స్య సాగు వంటి అనుబంధ రంగాల గురించి కూడా వివరాలు అందిస్తోంది. ఇక చీడ పురుగుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలను యాప్ ద్వారా సులభంగా రైతులు తెలుసుకోవచ్చు. తక్కువ ఖర్చు పెట్టుబడి పెట్టి ఎక్కువ రాబడి ఎలా సాధించాలనే విషయాలను కూడా చెబుతుంది. ఈ యాప్ ద్వారా కేవలం నిపుణులు అందించిన సమాచారాన్ని మాత్రమే రైతులకు అందేలా సహాయపడుతుంది. గ్రామాల్లోని రైతులకు సాగు పద్ధతులపై ఈ యాప్ ద్వారా అవగాహన పొందవచ్చని వ్యవసాయ శాఖ పేర్కొంది. పంట సాగుకు సంబంధించిన ప్రతీ ప్రశ్నకు ఇందులో సమాధానం తెలుసుకోవచ్చు. వ్యవసాయ శాఖ కూడా సాంకేతికతను ఉపయోగించుకుని రైతులకు సేవలు అందిస్తోంది. అందులో భాగంగానే ఈ యాప్స్ తీసుకొచ్చింది.

## కొత్త ఇళ్ల కోసం

# ఎదురుచూస్తున్న వారికి గుడ్‌న్యూస్..

## ప్రభుత్వం నుంచి బిగ్ అప్డేట్..



ఏపీలో కొత్త ఇళ్ల మంజూరు కోసం ఎదురుచూస్తున్నవారికి కూటమి ప్రభుత్వం శుభవార్త అందించింది. త్వరలోనే కొత్త ఇళ్లను మంజూరు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. జూన్ నాటికి టిడ్కో ఇళ్లను పూర్తి చేసి ప్రజలకు అందించాలని నిర్ణయం తీసుకున్నారు. ఏపీ ప్రజలకు రాష్ట్ర ప్రభుత్వం భారీ గుడ్‌న్యూస్ తెలిపింది. కొత్త ఇళ్లు కట్టుకోవాలనుకునేవారి కోసం కీలక ప్రకటన చేసింది. సొంతిళ్లు నిర్మించుకోవాలనే ఆశ ప్రతీఒక్క సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఉంటుంది. కానీ సొంతిల్లు కట్టుకోవాలంటే లక్షల్లో డబ్బులు అవసరమవుతాయి. పేదలు, సామాన్యులు దగ్గర అంత సొమ్ము ఉండే పరిస్థితి ఉండదు. దీంతో సామాన్యుల సొంతింటి కలను సాకారం చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆర్థిక సాయం అందిస్తోంది. పేదలకు సొంతిళ్ల నిర్మణానికి నిధులు అందిస్తోంది. అలాగే ఇట్టు కట్టుకునేందుకు స్థలం లేనివారికి ఉచితంగా స్థలం కేటాయించి ఇంటిని నిర్మిస్తోంది. ఈ పథకంపై తాజాగా ప్రభుత్వం కీలక ప్రకటన చేసింది. ఏపీలో సొంతింటి కోసం ఎదురుచూసేవారికి ఇది శుభవార్తగా చెప్పవచ్చు.

### 2029 నాటికి పక్కా ఇళ్లు

ఏపీలో అర్హులైన ప్రతీఒక్కరికీ 2029 నాటికి పక్కా ఇళ్లు నిర్మించి ఇస్తామని మంత్రి పార్థసారధి తెలిపారు. ఈ మేరకు కేబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. 10 లక్షల మంది ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్నారని, వారితో 7.5 లక్షల మంది అర్హులు ఉండవచ్చని తెలిపారు. వీరందరికీ 2029 నాటికి ఇల్లు నిర్మించి ఇస్తామని స్పష్టం చేశారు. అప్పటికల్లా శాశ్వత గృహాలు నిర్మించి ఇస్తామని పార్థసారధి చెప్పారు. ఇక మిగిలిన 2.65 లక్షల మందికి 2029 నాటికి స్థలాలు కేటాయిస్తామని మంత్రి తెలిపారు. అటు ఈ ఏడాది జూన్ నాటికి దాదాపు 2.61 లక్షల టిడ్కో ఇళ్లను పూర్తి చేసి పేదలకు పింపిణీ చేస్తామన్నారు. ఈ ఇళ్ల నిర్మాణ కోసం హడ్కో నుంచి రూ.4,451 కోట్ల రుణం తీసుకునేందుకు కేబినెట్ ఆమోదముద్ర వేసిందన్నారు. ఈమేరకు మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు.

### పీఎం అవాస్ యోజన

అటు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోన్న పీఎం అవాస్ యోజన పథకంతో కలిసి రాష్ట్ర ప్రభుత్వం అర్హులకు ఇళ్లను మంజూరు చేస్తోంది. ఇటీవల వీటికి దరఖాస్తులను ఆహ్వానించగా.. లక్షలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు పరిశీలన చేపట్టిన తర్వాత లబ్దిదారులను ఎంపిక చేయనున్నారు. అనంతరం వారికి కొత్త ఇళ్లను మంజూరు చేయనున్నారు. ఈ పథకంలో భాగంగా కొత్తగా ఇంటిని నిర్మించుకునేవారికి లబ్దిదారులక రూ.2.50 లక్షల వరకు ఆర్థిక సాయం అందించనున్నారు. అలాగే బ్యాంకు నుంచి రుణాలు అందేలా చర్యలు చేపట్టనున్నారు. త్వరలోనే పీఎం అవాస్ యోజన పథకం కింద దరఖాస్తు చేసుకున్నవరికి ఇళ్లు మంజూరు కానున్నాయి. ఏపీలో ఇళ్ల నిర్మాణ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. దీంతో కొత్త ఇళ్ల కోసం ఎదురుచూసేవారికి త్వరలోనే శుభవార్త అందనుంది.

# నేతన్నలకు ఏపీ సర్కార్ గుడ్ న్యూస్..

## ఏప్రిల్ నుంచి కొత్త స్కీమ్.. లక్ష కుటుంబాలకు లబ్ది..




నేతన్నలకు ఏపీ సర్కార్ అదిరిపోయే న్యూస్ తెలిపింది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మగ్గాలకు ఉచిత విద్యుత్ అమలుకు సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. ఈ నిర్ణయంతో దాదాపు లక్షకు పైగా నేతన్న కుటుంబాలకు భారీ ఆర్థిక వెసులుబాటు కలగనుంది. అసలు ఎప్పటి నుంచి ఈ పథకం అమల్లోకి రానుంది? ఎవరు అర్హులు..? అనేది తెలుసుకుందాం.. ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం చేనేత రంగానికి పూర్వవైభవం తీసుకువచ్చే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీని నెరవేరుస్తూ నేతన్నల ఇళ్లల్లో వెలుగులు నింపేందుకు ఏప్రిల్ 1 నుంచి ఉచిత విద్యుత్ పథకాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత అధికారిక ప్రకటన చేశారు. ఈ పథకాన్ని ప్రభుత్వం రెండు విభాగాలుగా విభజించి లబ్ధిదారులను ఎంపిక చేసింది. తద్వారా అటు చేనేత, ఇటు మరమగ్గాల కార్మికులకు మేలు జరగనుంది. చేనేత మగ్గాల కార్మికులకు 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కల్పించారు. దీంతో 93 వేల కుటుంబాలకు లబ్ది చేకూరనుంది. మర మగ్గాలు కార్మికులకు నెలకు 500 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్ అందించనున్నారు. దీంతో 10,534 కుటుంబాలకు లబ్ది జరగనుంది.

నేతన్నల జేబుల్లో మిగిలే సొమ్ము ఎంత?

సాధారణంగా ఒక చేనేత కార్మికుడు మగ్గం నేయడానికి వాడే విద్యుత్ ఖర్చు వారిపై పెను భారంగా మారుతోంది. ఈ పథకం ద్వారా సగటున ఒక కుటుంబానికి నెలకు రూ. 720 వరకు విద్యుత్ బిల్లు తగ్గుతుంది. ఏడాదికి సుమారు రూ.8,640 నేతన్నల కుటుంబాలకు ఆదా అవుతుంది. ఈ మిగులు ఆదాయం వారి కుటుంబ అవసరాలకు, పిల్లల చదువులకు ఎంతో తోడ్పడనుంది.

హామీలు అమలు

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతన్నల కష్టాలను స్వయంగా చూశారని, అందుకే పాదయాత్రలో ఇచ్చిన హామీని ఇప్పుడు అమలు చేస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. కేవలం విద్యుత్ మాత్రమే కాకుండా చేనేత కార్మికుల కోసం మరికొన్ని సంక్షేమ చర్యలు కూడా ప్రభుత్వం తీసుకుందని ఆమె గుర్తు చేశారు. చేనేత కార్మికులకు పెన్షన్ వయస్సును 50 ఏళ్లకు తగ్గించడంతో పాటు నెలకు రూ. 4,000 పెన్షన్ అందిస్తూ వారి వృద్ధాప్యానికి భరోసా ఇస్తున్నట్లు తెలిపారు. వస్త్ర పరిశ్రమలో ఎదురవుతున్న పోటీని తట్టుకోలేక, విద్యుత్ బిల్లుల భారంతో ఇబ్బంది పడుతున్న నేతన్నలకు ఈ ఉచిత విద్యుత్ నిర్ణయం ఒక గొప్ప బూస్ట్ అని చెప్పొచ్చు.

# అర్ధరాత్రి కానిస్టేబుల్ భార్యకు ఆ వీడియోలతో మెసేజ్..




గురుడికి సోషల్ మీడియాలో ఓ మహిళ పరిచయమైంది.. ఇంకెందుకు ఆలస్యం వెంటనే.. ఆమెను బుట్టలో వేసుకోవాలనుకున్నాడు.. ఆ మహిళ ఎవరు..? ఏంటి అనేది తెలియక.. అర్ధరాత్రి అశ్లీల ఫోటోలు, అశ్లీల వీడియోలు, అసభ్యకర మెసేజ్‌లు పెట్టాడు.. కట్ చేస్తే, జైలు పాలయ్యాడు ఓ జిమ్ ఓనర్.. గురుడికి సోషల్ మీడియాలో ఓ మహిళ పరిచయమైంది.. ఇంకెందుకు ఆలస్యం వెంటనే.. ఆమెను బుట్టలో వేసుకోవాలనుకున్నాడు.. ఆ మహిళ ఎవరు..? ఏంటి అనేది తెలియక.. అర్ధరాత్రి అశ్లీల ఫోటోలు, అశ్లీల వీడియోలు, అసభ్యకర మెసేజ్‌లు పెట్టాడు.. కట్ చేస్తే, జైలు పాలయ్యాడు ఓ జిమ్ ఓనర్.. కానిస్టేబుల్ భార్యకే అసభ్యకర మెసేజ్లు పెట్టి.. జిమ్ ఓనర్ ఇరుక్కుపోయిన ఘటన ఏపీలోని అనంతపురంలో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. కదిరి పట్టణానికి చెందిన లోటస్ జిమ్ నిర్వాహకుడు రమేష్ నాయక్ కు సోషల్ మీడియాలో ఓ మహిళ పరిచయమైంది. ఫేస్‌బుక్‌లో పరిచయమైన మహిళ నుంచి ఇన్‌స్టాగ్రామ్ ఐడి తీసుకున్నాడు.. అనంతరం ఇన్‌స్టాగ్రామ్ నుంచి మెసేజ్లు చేయటం ప్రారంభించాడు. పరిచయమైన మహిళ కానిస్టేబుల్ భార్య అని తెలియక.. మనోడు ఒక అడుగు ముందుకేసి.. ఆమెను ఎలాగైనా బుట్టలో వేసుకోవాలని స్పీడును పెంచాడు.. కానిస్టేబుల్ భార్యకు అర్ధరాత్రి సమయంలో అశ్లీల వీడియోలు, అశ్లీల ఫోటోలు, అసభ్యకర మెసేజులు పెట్టి జిమ్ ఓనర్ రమేష్ వేధించడం మొదలుపెట్టాడు. ఇలా అసభ్యకరంగా మెసేజ్లు పెడుతూ రమేష్ వేధిస్తూ వస్తున్నాడు.. ఇక అతని వేధింపులు భరించలేక సదరు మహిళ ఈ విషయాన్ని భర్త, ఏఆర్ కానిస్టేబుల్ నాగ బాషాకు తెలియజేసింది. ఇంకేముంది కానిస్టేబుల్ భార్యతోనే సరసాలు ఆడతావా అని.. ఆ కానిస్టేబుల్.. జిమ్ నుంచే ఓనర్ రమేష్ ను కొట్టుకుంటూ పోలీస్ స్టేషన్ లాక్కొచ్చాడు. అనంతపురంలో ఏఆర్ కానిస్టేబుల్ గా పనిచేస్తున్న నాగ భాష, అతని భార్య కదిరి పోలీస్ స్టేషన్ లో రమేష్ పై ఫిర్యాదు చేశారు. దీంతో మహిళతో అసభ్యకరంగా ప్రవర్తించి.. వేధిస్తున్న రమేష్ పై కేసు నమోదు చేసి పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.

క్రీడా వాయిస్

# ఆ సబ్జెక్ట్‌లో అంత వీక్..

## టెన్త్‌లో కింగ్ కోహ్లీ మార్కుల లిస్ట్ చూశారా..?




ప్రస్తుత రోజుల్లో మార్కులు, ర్యాంకుల చుట్టూనే విద్యార్థుల ప్రపంచం తిరుగుతోందనడంలో సదేహం లేదు. అయితే, కేవలం అకడమిక్ మార్కులు మాత్రమే ఒక వ్యక్తి భవిష్యత్తును నిర్ణయించలేవని ప్రపంచ అత్యుత్తమ క్రికెటర్ విరాట్ కోహ్లీ నిరూపించారు. విరాట్ కోహ్లీ అంటే నేడు ప్రపంచ క్రికెట్‌లో ఒక బ్రాండ్. రికార్డుల రారాజుగా పేరుగాంచిన కింగ్ కోహ్లీ, తన పాఠశాల రోజుల్లో ఒక సాధారణ విద్యార్థిగానే ఉన్నాడు. ప్రస్తుతం వైరల్ అవుతున్న ఆయన పదో తరగతి మార్కుల జాబితా చూస్తే ఈ విషయం ఇట్టే తెలిసిపోతుంది. విరాట్ కోహ్లీ గణితం, సైన్స్ లో తక్కువ మార్కులు సాధించడం గమనార్హం. కానీ, అదే సమయంలో ఆయనకు క్రీడల పట్ల ఉన్న ఆసక్తిని ఈ మార్కులు ఎప్పుడూ ఆపలేకపోయాయి.జితిన్ యాదవ్ అనే ఐఏఎస్ విరాట్ కోహ్లీ మార్కుల జాబితాను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. "నీ మార్కుల షీట్‌లో నీ ప్యాషన్ ఎక్కడా కనిపించదు" అని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక స్టేట్‌మెంట్ మాత్రమే కాదు, లక్షలాది మంది విద్యార్థులకు ఒక గొప్ప ప్రేరణ. మార్కులు తక్కువ వచ్చాయని నిరాశ చెందే వారికి, జీవితం కేవలం తరగతి గదితో ముగిసిపోదని కోహ్లీ నిరూపించారు.

**మ్యాథ్స్, సైన్స్‌లో తడబాటు – గ్రౌండ్‌లో మాత్రం తోపు..**

విరాట్ తన పదో తరగతిలో సైన్స్ థియరీలో కేవలం 32 మార్కులు మాత్రమే సాధించాడు. ప్రాక్టికల్స్ లో కలిపి 55 మార్కులు వచ్చాయి. ఇక గణితంలో అతి తక్కువగా 51 మార్కులు మాత్రమే వచ్చాయి. అయితే, విచిత్రమేమిటంటే నేడు మైదానంలో భారీ లక్ష్యాలను ఛేదించేటప్పుడు కోహ్లీ వేసే లెక్కలు ప్రపంచంలో మరెవరూ వేయలేరు. ఏ బౌలర్‌ను ఎప్పుడు ఎదుర్కోవాలి, ఎన్ని బంతుల్లో ఎన్ని పరుగులు చేయాలి అనే విషయంలో కోహ్లీని మించిన 'ఛేజింగ్ మాస్టర్' క్రికెట్‌లో లేరనడంలో అతిశయోక్తి లేదు. కోహ్లీ విజయ ప్రస్థానంలో ఆయన తండ్రి ప్రేమ్‌నాథ్ కోహ్లీ పాత్ర మరచిపోలేనిది. కొడుకు చదువులో రాణించకపోయినా, అతనికి ఉన్న క్రికెట్ నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించారు. ఈ రోజు విరాట్ కోహ్లీ సాధించిన ఖ్యాతిలో ఆ ప్రోత్సాహం ఎంతో ఉంది. కేవలం ర్యాంకుల కోసం పిల్లలపై ఒత్తిడి తెచ్చే తల్లిదండ్రులకు కోహ్లీ సక్సెస్ స్టోరీ ఒక కనువిప్పు. "పర్ఫెక్షన్ కంటే ప్యాషన్ ముఖ్యం" అనే సూత్రం కోహ్లీ జీవితానికి అతికినట్లు సరిపోతుంది. మార్కులు జీవితంలో ఒక భాగమే కానీ జీవితం కాదు. ప్రతి ఒక్కరిలోనూ ఒక ప్రత్యేక నైపుణ్యం ఉంటుందని, దానిని గుర్తించి కష్టపడితే విరాట్ కోహ్లీలా ప్రపంచాన్ని ఏలవచ్చని ఆయన మార్కుల జాబితా మనకు గుర్తు చేస్తోంది.

# వామ్మో.. 16 ఏళ్లుగా నిరాశేనా..

## టీ20 ప్రపంచకప్‌లో ఆ రికార్డ్ బ్రేక్ చేసే టీమిండియా ప్లేయర్ ఎవరు..?




టీ20 ప్రపంచకప్ 2026 కోసం రంగం సిద్ధమైంది. ఇప్పటికే అన్ని జట్లు తమ పూర్తి స్క్వాడ్స్‌తో రెడీగా ఉన్నాయి. ఫిబ్రవరి 7 నుంచి మొదలుకానున్న ఈ మెగా టోర్నీలో డిపెండింగ్ ఛాంపియన్‌గా భారత జట్టు బరిలోకి దిగనుంది. 2026లో భారతదేశంతోపాటు శ్రీలంకలో జరగనున్న టీ20 ప్రపంచ కప్‌నకు అంతా సిద్ధమైంది. ఈ క్రమంలో భారత జట్టు ఫిబ్రవరి 7న అమెరికాతో తన తొలి లీగ్ మ్యాచ్ ఆడనుంది. టీమిండియా డిఫెండింగ్ ఛాంపియన్ గా, టోర్నమెంట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగనుంది. సంజు శాంసన్ అభిషేక్ శర్మతో కలిసి ఓపెనర్‌గా బరిలోకి దిగనున్నాడు. అయితే, గత 16 సంవత్సరాలలో భారత జట్టు తరపున ఓ అద్భుతాన్ని ఫ్యాన్స్ మిస్సవుతున్నారు. మరి ఈసారి సంచలనానికి హీరోగా ఎవరు నిలవనున్నారో చూడాలి. ముఖ్యంగా ముగ్గురి పేర్లు వినిపిస్తున్నాయి. వారిలో అభిషేక్ శర్మతోపాటు సంజూ శాంసన్, ఇషాన్ కిషన్ పేర్లు వినిపిస్తున్నాయి. అసలు ఆ రికార్డు ఏంటి, 16 సంవత్సరాలుగా ఎందుకు సాధించలేకపోయారో ఓసారి చూద్దాం. ఇప్పటి వరకు మనం మాట్లాడుతున్న ఆ రికార్డు ఏంటంటే.. టీ20 ప్రపంచకప్ లో టీమిండియా తరపున సెంచరీ నమోదు కావడం. కాగా, ఇప్పటి వరకు ఒకే ఒక్క టీమిండియా ప్లేయర్ సెంచరీ పూర్తి చేశాడు. సురేష్ రైనా 2010లో సౌతాఫ్రికాపై ఈ సెంచరీ చేశాడు. దీంతో సురేష్ రైనా టీ20 ప్రపంచకప్ హిస్టరీలో తొలి సెంచరీ చేసిన టీమిండియా ప్లేయర్ గా నిలిచాడు. మరి యువ రక్తంతో నిండిన సూర్యసేనలో ఆ ఘనత సాధించేది ఎవరు, 16 ఏళ్ల రికార్డ్ ను బద్దలు కొట్టేది ఎవరో ఓసారి చూద్దాం..

**ఎవరు బాదేస్తారు..?**

ఈ లిస్ట్ లో అభిషేక్ శర్మ ముందుగా గుర్తుకు వస్తాడు. కానీ అతనికంటే ముందు సంజూ శాంసన్ ఈ లిస్ట్ లో తొలి వ్యక్తిగా నమోదయ్యే ఛాన్స్ ఉందని అటు ఫ్యాన్స్ తోపాటు మాజీలు కూడా భావిస్తున్నారు. సంజూ శాంసన్ సెంచరీ తప్పకుండా బాదేస్తాడని చెప్పింది ఎవరో కాదు.. భారత జట్టు తరపున టీ20 ప్రపంచ కప్ లో తొలి సెంచరీ చేసిన సురేష్ రైనా చెప్పడం గమనార్హం. కాగా, శాంసన్ ఇటీవలి పేలవమైన ఫామ్‌ను కూడా ఆయన ఎత్తి చూపాడు. ఇది తాత్కాలిక దశ అంటూ చెప్పుకొచ్చాడు. "సంజు సామ్సన్ ఆ జాబితాలో ఉండవచ్చు. అతను ఓపెనింగ్ బ్యాటింగ్‌కు దిగే సామర్థ్యం కలిగి ఉన్నాడు. అతను ఇప్పటికే దక్షిణాఫ్రికాలో సెంచరీ చేశాడు. అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్ కూడా ఉన్నారు. వీరిలో ఒకరు కూడా చేరగలరు. కానీ ఏదో ఒక విధంగా, ఈ టీ20 ప్రపంచ కప్‌లో సంజు సెంచరీ చేయగలడని నేను భావిస్తున్నాను" అని రైనా తెలిపాడు. "నా అభిప్రాయం ప్రకారం ఫామ్ తాత్కాలికం. సంజుకి ఆ క్లాస్ ఉంది. టీ20 క్రికెట్‌లో చాలా పరుగులు చేశాడు. సూర్యకుమార్ యాదవ్‌ను చూడండి. అతను దాదాపు ఒక సంవత్సరం నుంచి పరుగులు చేయలేదు. అయినప్పటికీ, కోచ్ అతనికి మద్దతు ఇచ్చాడు. సంజు విషయంలో కూడా అదే కథ ఉందని నేను భావిస్తున్నాను. అతనికి అవకాశం వస్తే, అతను ఖచ్చితంగా బాగా రాణిస్తాడు" అని చెప్పుకొచ్చాడు.

**సంజు సామ్సన్ టీ20ఐ గణాంకాలు..**

56 టీ20ఐలలో 48 ఇన్నింగ్స్‌లలో, శాంసన్ 24.36 సగటు, 147.86 స్ట్రైక్ రేట్‌తో 1072 పరుగులు చేశాడు. అతని అత్యధిక స్కోరు 111. దానికి తోడు 3 సెంచరీలు, 3 హాఫ్ సెంచరీలు చేశాడు. కానీ, అతని ఇటీవలి ఫామ్ బాగా లేదు. అతని చివరి నాలుగు మ్యాచ్ లలో స్కోర్లు చూస్తే 11, 10, 6, 0, 24గా ఉన్నాయి. 2026 సంవత్సరం మంచి ఆరంభానికి రాలేదు. కానీ, ఇంకా సమయం ఉంది.

**సంజు శాంసన్ టీ20 ప్రపంచ కప్‌లో సెంచరీ సాధించగలడా?**

జనవరి 31న న్యూజిలాండ్‌తో జరిగే మ్యాచ్‌లో శాంసన్ తన ఫామ్‌ను తిరిగి పొందాల్సి ఉంది. ఆ తర్వాత టీ20 ప్రపంచ కప్ వస్తుంది. మరి శాంసన్ సెంచరీ సాధిస్తాడా, సురేష్ రైనా మాట నిజం అవుతుందా లేదా అనేది చూడాలి.

# ఉత్కంఠగా సాగుతున్న క్రికెట్ మ్యాచ్..

## ఎంట్రీ ఇచ్చిన కుక్క.. బాల్‌తో జంప్..!



ఆసక్తిగా సాగుతున్న ఆట మధ్యలో జరిగే కొన్ని అనూహ్య సంఘటనలు తెగ వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా ఆటగాళ్ల హావభావాలు, ప్రేక్షకుల వేషధారణ, ప్లకార్డుల ప్రదర్శన ఇలా ప్రతిదీ నెటిజన్లను ఆకట్టుకుంటాయి. ఇక, తమ అభిమాన ఆటగాడి కోసం గ్రౌండ్‌లోకి పరిగెత్తు కొచ్చే సన్నివేశాలను అప్పుడప్పుడూ వైరల్ అవుతుంటాయి. అలాంటి వింత సంఘటనే ఇప్పుడు ఒక క్రికెట్ మ్యాచ్‌లో జరిగింది. ఆసక్తిగా సాగుతున్న ఆట మధ్యలో జరిగే కొన్ని అనూహ్య సంఘటనలు తెగ వైరల్ అవుతుంటాయి. ముఖ్యంగా ఆటగాళ్ల హావభావాలు, ప్రేక్షకుల వేషధారణ, ప్లకార్డుల ప్రదర్శన ఇలా ప్రతిదీ నెటిజన్లను ఆకట్టుకుంటాయి. ఇక, తమ అభిమాన ఆటగాడి కోసం గ్రౌండ్‌లోకి పరిగెత్తు కొచ్చే సన్నివేశాలను అప్పుడప్పుడూ వైరల్ అవుతుంటాయి. అలాంటి వింత సంఘటనే ఇప్పుడు ఒక క్రికెట్ మ్యాచ్‌లో జరిగింది. అయితే, ఇక్కడ గ్రౌండ్‌లోకి దూసుకొచ్చింది మనిషి కాదు.. ఓ పెంపుడు. అదీ ఏకంగా ఆటగాళ్లందరినీ పరుగులు పెట్టించింది. ప్రస్తుతం సోషల్ మీడియాలో ఒక ఫన్నీ వీడియో వైరల్ అవుతోంది. ఇది క్రికెట్ అభిమానుల ముఖాల్లో చిరునవ్వులు తెప్పిస్తుంది. ఈ వీడియో ఐర్లాండ్‌లోని ఒక దేశీయ మహిళా క్రికెట్ మ్యాచ్‌లో జరిగింది. అక్కడ ఎవరూ ఊహించని దృశ్యం మైదానంలో అకస్మాత్తుగా కనిపించింది. బ్యాట్స్‌మన్ బంతిని కొట్టిన వెంటనే, ఒక చిన్న కుక్క మైదానంలోకి ప్రవేశించింది. ఉత్కంఠగా సాగుతున్న క్రికెట్ మ్యాచ్ అంతా క్షణంలో మాయమైంది. అక్కడున్న ఆటగాళ్లతో పాటు అంపైర్లు, పేక్షకులు నవ్వు ఆపుకోలేకపోయారు. వైరల్ వీడియోలో మ్యాచ్ జోరుగా సాగుతోంది. బౌలర్ బాల్ వేశారు. బ్యాట్స్‌మన్ షాట్ కొట్టారు, బంతి మైదానం వైపు దూసుకుపోయింది. ఇంతలోనే అకస్మాత్తుగా, ఒక కుక్క మైదానం మధ్యలోకి పరిగెత్తుకుంటూ వచ్చింది. బంతి దాని పక్కనే పడింది. ఫీల్డర్ స్పందించేలోపు, కుక్క బంతిని నోటితో పట్టుకుని మైదానం అంతటా పరిగెత్తడం ప్రారంభించింది. మ్యాచ్ కొన్ని సెకన్ల పాటు పూర్తిగా ఆగిపోయింది. మైదానంలో నవ్వులు విరబూశాయి. ఆటగాళ్ళు నవ్వుతూ కనిపించారు. ప్రేక్షకులు ఈ ప్రత్యేకమైన క్షణాన్ని పూర్తిగా ఆస్వాదించారు. చివరికి, చాలా ప్రయత్నం తర్వాత, కుక్కను మైదానం నుండి తొలగించి, బంతిని తిరిగి తీసుకున్నారు. ఆ తర్వాత మ్యాచ్ తిరిగి ప్రారంభమైంది. ఈ దృశ్యాన్ని చూసి ఆటగాళ్ళు, అంపైర్లు, మైదానంలో ఉన్న ప్రేక్షకులు ఆశ్చర్యపోయారు. వీడియోలో ఒక మహిళా ఫీల్డర్ బంతిని తిరిగి పొందడానికి కుక్క వెంట పరిగెత్తాల్సి వచ్చింది. కుక్క కూడా అంతే తెలివైనది. తానూ కూడా క్రికెట్‌ను పూర్తిగా ఆస్వాదిస్తున్నట్లుగా ఇక్కడ, అక్కడ పరిగెత్తింది. మొత్తం సన్నివేశం ఒక కామెడీ సినిమాలోని సన్నివేశాన్ని తలపించింది. @Rajiv1841 అనే ఖాతా ద్వారా షేర్ చేసిన ఈ వీడియోను ఇప్పటికే లక్షలాది మంది వీక్షించారు. చాలామంది దీనిని లైక్ చేశారు. సోషల్ మీడియా వినియోగదారులు ఈ వీడియోపై రకరకాలుగా స్పందిస్తున్నారు. ఒక వినియోగదారు, "ఆ పేదవాడు క్రికెటర్ కావాలని కోరుకున్నాడు, కానీ చివరికి కుక్కగా మారాడు." అని వ్రాశాడు. మరొకరు, "ఆ కుక్క మొత్తం మ్యాచ్ TRPని పెంచింది." అని అన్నారు. మరొక వినియోగదారు, "కుక్కకు కూడా బాగా ఫీల్డింగ్ ఎలా చేయాలో తెలుసు." అని పేర్కొన్నారు.

# ఆ విజయాలకే మిడిసిపడితే కష్టం..

భారత టెస్ట్ క్రికెట్ ప్రస్తుతం పరివర్తన దశను ఎదుర్కొంటుందని టీమిండయా మాజీ కోచ్ రాహుల్ ద్రావిడ్ తెలిపారు. ఐపీఎల్, వైట్ బాల్ క్రికెట్ కారణంగా ఆటగాళ్లకు రెడ్ బాల్ ప్రిపరేషన్ సమయం లభించడం లేదని, ఇది సాంకేతిక లోపం కంటే మానసిక, సమయపాలన సవాల్ అని ఆయన పేర్కొన్నారు. దేశవాళీ క్రికెట్‌పై దృష్టి సారించకపోతే టెస్ట్ హోదా కోల్పోయే ప్రమాదముందని ఆయన హెచ్చరించారు. ఫిబ్రవరి 7 నుంచి టీ20 ప్రపంచకప్ 2026 మొదలుకానుంది. ప్రస్తుతం టీమిండియా న్యూజిలాండ్ జట్టుతో టీ20 సిరీస్ ఆడుతోంది. జనవరి 31న చివరి మ్యాచ్ లో ఇరుజట్లు పోటీపడనున్నాయి. ఇప్పటికే సిరీస్ గెలిచిన భారత జట్టు, ఆధిక్యాన్ని పెంచుకోవాలని చూస్తోంది. టీ20ల్లో అదరగొడుతోన్నా.. వన్డేలు, టెస్ట్ ల్లో మాత్రం తేలిపోతోంది భారత జట్టు. ఈ క్రమంలో టీమిండియా మాజీ ప్లేయర్, కోచ్ రాహుల్ ద్రవిడ్ భారత జట్టును హెచ్చరించాడు.భారత టెస్ట్ క్రికెట్ ప్రస్తుతం ఒక క్లిష్టమైన పరివర్తన దశను ఎదుర్కొంటోందని మాజీ ప్రధాన కోచ్ రాహుల్ ద్రావిడ్ చెప్పుకొచ్చాడు. గత దశాబ్ద కాలంగా స్వదేశంలో తిరుగులేని శక్తిగా వెలుగొందిన టీమిండియా ఇటీవల న్యూజిలాండ్ చేతిలో వైట్‌వాష్‌కు గురవడం, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలో చవిచూస్తున్న పరాజయాలతో తన పట్టును కోల్పోతున్నట్లు కనిపిస్తోంది. గౌతమ్ గంభీర్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత కూడా ఈ పరిస్థితిలో పెద్దగా మార్పు రాకపోవడం అభిమానులను ఆందోళనకు గురిచేస్తోంది. ద్రావిడ్ ప్రకారం, దీనికి ప్రధాన కారణం ఆటగాళ్లలో సాంకేతిక లోపం కంటే కూడా ఫార్మాట్ల మధ్య మారే క్రమంలో వారు ఎదుర్కొంటున్న మానసిక, సమయపాలన పరమైన సవాళ్లు. నేటి క్రికెటర్లు ఏడాది పొడవునా ఐపీఎల్, అంతర్జాతీయ వైట్ బాల్ క్రికెట్‌లో మునిగి తేలుతున్నారు. ఒక టెస్ట్ సిరీస్‌కు కేవలం మూడు, నాలుగు రోజుల ముందు మాత్రమే వేదికకు చేరుకోవడం వల్ల ఎర్ర బంతితో ఆడే సహజమైన నైపుణ్యాన్ని అలవర్చుకోవడానికి వారికి

**గంభీర్, గిల్‌లకు ఇచ్చిపడేసిన టీమిండియా మాజీ ప్లేయర్**



సమయం సరిపోవడం లేదు. ముఖ్యంగా స్పిన్‌కు అనుకూలించే పిచ్‌లపై భారత బ్యాటర్లు తలపడటం వెనుక ఉన్న అసలు రహస్యం ఇదేనని ఆయన స్పష్టం చేశారు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వంటి దిగ్గజాలు జట్టు మార్పు దశలో ఉన్న సమయంలో మిడిల్ ఆర్డర్‌లో స్థిరత్వం లోపించడం జట్టును మరింత దెబ్బతీస్తోంది. మూడు ఫార్మాట్లు ఆడే ఆటగాళ్లు ఆరు నెలల తర్వాత నేరుగా టెస్ట్ మ్యాచ్‌లో బరిలోకి దిగినప్పుడు రెడ్ బాల్ కదలికను, పిచ్ స్వభావాన్ని అర్థం చేసుకోవడానికి అవసరమైన మజిల్ మెమరీని కోల్పోతున్నారు. ఇది కేవలం బ్యాటింగ్ వైఫల్యం మాత్రమే కాదు, టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన అంకితభావం, తయారీలో ఏర్పడిన ఒక నిర్ణయాత్మక లోపమని ద్రావిడ్ బలంగా నొక్కి చెప్పారు. టెస్ట్ క్రికెట్ పతనానికి ద్రావిడ్ చూపిస్తున్న మరో కీలక కోణం మారుతున్న క్రికెట్ సంస్కృతి, షెడ్యూలింగ్ ఒత్తిడి. పూర్వం ఫ్రాంచైజీ క్రికెట్ లేని రోజుల్లో ఆటగాళ్లు టెస్ట్ సిరీస్‌కు ముందు కనీసం నెల రోజుల పాటు రంజీ ట్రోఫీ లేదా నెట్స్ ప్రాక్టీస్‌లో ఎర్ర బంతితో గడిపేవారు. ఆ ఓపికే గత తరం ఆటగాళ్లను గంటలకొద్దీ క్రీజ్‌లో నిలబెట్టేది. కానీ ప్రస్తుతం శుభ్ మన్ గిల్ వంటి యువ ఆటగాళ్లు ఒకవైపు టీ20 ఫార్మాట్‌లో మెరుపులు మెరిపిస్తూనే మరుసటి వారమే టెస్ట్ మ్యాచ్‌లో డిఫెన్సివ్ మైండ్‌సెట్‌లోకి మారాల్సి రావడం ఒక అసాధ్యమైన టాస్క్ లాగా మారుతోంది. సాయి సుదర్శన్, కరుణ్ నాయర్ వంటి ప్రతిభావంతులు అందుబాటులో ఉన్నా వారికి లభిస్తున్న పరిమిత అవకాశాలు, నిరంతరం మారుతున్న జట్టు కూర్పు వారి ఆత్మవిశ్వాసాన్ని దెబ్బతీస్తున్నాయి. ముఖ్యంగా సీమింగ్ ట్రాక్‌లపై పేస్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంలోను, టర్నింగ్ ట్రాక్‌లపై స్పిన్నర్లను సమర్థవంతంగా అడ్డుకోవడంలోను మన బ్యాటర్లు విఫలమవుతున్నారు. ద్రావిడ్ మాటల్లో చెప్పాలంటే, టెస్ట్ క్రికెట్ అనేది కేవలం నైపుణ్యానికి సంబంధించింది కాదు, అది ఒక ప్రత్యేకమైన జీవనశైలి, ఏకాగ్రతకు సంబంధించింది. కేవలం వైట్ బాల్ విజయాలతో సంతృప్తి పడితే టెస్ట్ ఫార్మాట్‌లో టీమిండియా తన నెంబర్ వన్ హోదాను శాశ్వతంగా కోల్పోయే ప్రమాదం ఉంది. సీనియర్ల రిటైర్మెంట్ తర్వాత ఏర్పడే శూన్యాన్ని పూరించాలంటే యువ ఆటగాళ్లకు దేశవాళీ క్రికెట్‌లో ఎర్రబంతితో ఎక్కువ సమయం గడిపేలా బోర్డు ప్రణాళికలు సిద్ధం చేయాలి. లేనిపక్షంలో అడపాదడపా విదేశీ విజయాలు మినహా స్వదేశీ కోటలు కూడా కూలిపోయే ముప్పు పొంచి ఉంది. భారత క్రికెట్ తన పూర్వ వైభవాన్ని సంతరించుకోవాలంటే కేవలం టీ20 మెరుపుల మీద కాకుండా టెస్ట్ క్రికెట్‌కు అవసరమైన ఓపిక, సాంకేతికతపై మళ్లీ దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందని ద్రావిడ్ విశ్లేషణ స్పష్టం చేస్తోంది.

సినీ వాయిస్ CINEMA

# ఆ సినిమా నాకు చాలా స్పెషల్..

## కానీ ఆ పాత్ర అస్సలు నచ్చలేదు.. హీరోయిన్ సంగీత..



దక్షిణాదిలో తమకంటూ ఓ గుర్తింపు తెచ్చుకున్న హీరోయిన్లలో సంగీత ఒకరు. తక్కువ సమయంలోనే నటిగా అలరించి మెప్పించింది. తెలుగు, తమిళం భాషలలో పలు చిత్రాల్లో నటించింది. ఇప్పుడు సహాయ నటిగా అలరిస్తుంది. సంగీత అంటే ఠక్కున గుర్తొచ్చే చిత్రం ఖడ్గం. ఈ సినిమాలో అమాయకమైన నటనతో కట్టిపడేసింది. టాలీవుడ్ హీరోయిన్ సంగీత గురించి ప్రత్యేకంగా పరిచయం అక్కర్లేదు. తెలుగు, తమిళంలో పలు సినిమాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకుంది. సంగీత ఖడ్గం సినిమా తన కెరీర్‌లో అత్యంత కీలకమైన, మరచిపోలేని అనుభవాలను అందించిన చిత్రంగా పేర్కొన్నారు. ఈ సినిమా తన జీవితానికి, కెరీర్‌కు ఒక మలుపు అని ఆమె అన్నారు. ఖడ్గంలో తనకు ఎన్నో మంచి అనుభవాలు ఉన్నాయని, ఇదొకటి అని చెప్పడం కష్టం కానీ, ఈ సినిమా తన కెరీర్‌నే మార్చివేసిందని వివరించారు. షూటింగ్ మొదటి రోజు జరిగిన ఒక సంఘటనను గుర్తు చేసుకుంటూ, అప్పటికి దర్శకుడు వంశీ తప్ప తనకు యూనిట్‌లో ఎవరూ తెలియదని సంగీత తెలిపారు. మేకప్ మ్యాన్ తన ముఖానికి పసుపు రంగు మేకప్‌ను, రోజ్ ఇక్కడ, జుట్టు నిటారుగా, జిడ్డుగా ఉండేలా చేశాడు అని, ఇది పూర్తిగా తప్పుగా ఉందని ఆమె అన్నారు. మేకప్ ఎప్పుడూ నటీనటులకు ప్లస్ అవ్వాలి కానీ, తనకు అది మైనస్ మైనస్ మైనస్ గా అనిపించిందని సంగీత పేర్కొన్నారు. మేకప్ పూర్తయ్యాక, అద్దంలో తనను తాను చూసుకోవడానికి కూడా సిగ్గుపడ్డానని, బయటకు వచ్చి షాట్ ఇవ్వడానికి భయపడి, వంశీని లోపలికి వచ్చి చూడమని కోరానని తెలిపారు. వంశీ వచ్చి, "అరే, బాగుందే. పర్‌ఫెక్ట్, ఫెంటాస్టిక్. అవుట్ ఆఫ్ ద వరల్డ్ యు ఆర్!" అని ప్రశంసించడంతో ఆమె ఆశ్చర్యపోయానని.. ఇది వంశీకి అలవాటైన మాటలని, ఆయన అద్భుతమైన ప్రశంసలతో వెంటనే షూటింగ్ ప్రారంభించమని చెప్పారని సంగీత గుర్తు చేసుకున్నారు. బయటకు వెళ్లిన తర్వాత యూనిట్ సభ్యులు "బాగుంది, బాగుంది" అని అన్నా, అక్కడి జనంలో కొందరు "వంశీకి పిచ్చి పట్టిందా? ఈ అమ్మాయిని వేశారేంటి? రవితేజ పక్కన ఈ అమ్మాయా?" అని గుసగుసలాడటం విన్నానని, ఆ మాటలు తన ఆత్మవిశ్వాసాన్ని పూర్తిగా దెబ్బతీశాయని ఆమె చెప్పారు. సినిమా విడుదలైన తర్వాత కూడా తాను థియేటర్‌లో చూడలేదని, చెన్నైలో ఒక ప్రివ్యూ థియేటర్‌లో చూశానని, అప్పుడు కూడా సినిమా ప్రభావం తనకు పూర్తిగా అర్థం కాలేదని తెలిపారు. అయితే, ఖడ్గం విడుదలైన తర్వాత ఇక్కడ వచ్చిన స్పందన చూసి, సినిమా ఎంతటి విజయం సాధించిందో, ఎంతటి ప్రభావం చూపిందో తెలిసిందని సంగీత వివరించారు. అందుకు దర్శకుడు వంశీకి ఎల్లప్పుడూ ధన్యవాదాలు చెబుతానని అన్నారు. ఖడ్గంలో "ఒక్క ఛాన్స్" డైలాగ్ గురించి అడిగినప్పుడు, అది ఏడుస్తూ చెప్పాల్సిన సందర్భం అని, మళ్లీ చెప్పాలంటే కష్టం కానీ, చెప్పడానికి ప్రయత్నిస్తానని ఆమె అన్నారు. నటిగా తన కెరీర్‌లో క్లాసికల్ డాన్స్‌తో కూడిన సినిమాలో నటించాలనే తన కల ఇంకా ఉందని, తాను ఇంకా నటిస్తున్నానని, జీవితం ఉందని పేర్కొన్నారు. ఈ అబ్బాయి చాలా మంచివాడు సినిమాలో ఒక చిన్న క్లాసికల్ డాన్సర్ పాత్ర చేసినా, అది డాన్స్ బేస్డ్ సినిమా కాదని సంగీత వివరించారు.



# రాధికకు ఆఫర్స్ రావడం లేదా..?

## లేక కావలనే బ్రేక్ తీసుకుంటుందా.?

నేహా శెట్టి.. ఈ ముద్దుగుమ్మ సినిమాల్లో కనిపించి చాలా రోజులు అయిపొయింది. మోడల్ గా కెరీర్ మొదలు పెట్టి ఆతర్వాత హీరోయిన్ గా మారింది. నేహా శెట్టి 2016లో కన్నడ సినిమా ముంగారు మలే 2తో సినీరంగంలోకి ఆడుగుపెట్టింది. ఆతర్వాత టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది ఈ ముద్దుగుమ్మ. నేహా శెట్టి.. ఈ ముద్దుగుమ్మ సినిమాల్లో కనిపించి చాలా రోజులు అయిపొయింది. మోడల్ గా కెరీర్ మొదలు పెట్టి ఆతర్వాత హీరోయిన్ గా మారింది. నేహా శెట్టి 2016లో కన్నడ సినిమా ముంగారు మలే 2తో సినీరంగంలోకి ఆడుగుపెట్టింది. ఆతర్వాత టాలీవుడ్ లోకి అడుగుపెట్టింది ఈ ముద్దుగుమ్మ. తెలుగులో మెహబూబా, గల్లీ రౌడీ, డీజే టిల్లు సినిమాలతో మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. పూరీజగన్నాధ్ దర్శకత్వంలో వచ్చిన మెహబూబా సినిమాతో ఎంట్రీ ఇచ్చి మంచి గుర్తింపు తెచ్చుకుంది. ఈ సినిమా ప్రేక్షకులను ఆకట్టుకోలేకపోయిన ఈ భామ అందానికి మంచి మార్కులు పడ్డాయి. మోడలింగ్ లోకి వచ్చిన నేహా, 2014లో మిస్ మంగళూరు అందాల పోటీతో గెలిచింది. మిస్ సౌత్ ఇండియా 2015 రన్నరప్‌గా నిలిచింది. తెలుగులో మెహబూబా, గల్లీ రౌడీ, మోస్ట్ ఎలిజిబుల్ బ్యాచిలర్, డిజే టిల్లు, బెదురులంక 2012, రూల్స్ రంజన్, టిల్లు స్క్వేర్, గ్యాంగ్స్ అఫ్ గోదావరి సినిమాల్లో నటించింది. టిల్లు స్క్వేర్‌లో చిన్న పాత్ర చేసింది. అలాగే పవన్ కళ్యాణ్ నటించిన ఓజీ సినిమాలో స్పెషల్ సాంగ్ చేసింది. కానీ ఆ సాంగ్ ను సినిమాలోనుంచి తీసేశారు. యూట్యూబ్ లో తర్వాత ఆ సాంగ్ ని విడుదల చేశారు. కానీ అంతగా గుర్తింపు రాలేదు. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ హీరోయిన్‌గా సినిమాలు చేయడం లేదు. దాంతో ఆమె అభిమానులు వెయిట్ చేస్తున్నారు. కావాలనే స్పీడ్ తగ్గించిందా.. లేక ఆమెకు ఆఫర్స్ రావడం లేదా.? అని అభిమానులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఇక సోషల్ మీడియాలో ఈ ముద్దుగుమ్మ షేర్ చేసే ఫోటోలకు మంచి క్రేజ్ ఉంటుంది.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రికలో
వెలువడుతున్న ప్రత్యేక శీర్షికలు...




# కేకపెట్టించిన కుర్ర భామ..

## పూజిత పొన్నాడ ఫోటోలకు నెటిజన్స్ ఫిదా

కింగ్ నాగార్జున నటించిన ఊపిరి సినిమాతో పరిచయం అయ్యింది అందాల భామ పూజిత పొన్నాడ. కానీ ఆ సినిమా ద్వారా అంతగా గుర్తింపు రాలేదు. ఆతర్వాత అక్కినేని నాగచైతన్య ప్రేమమ్ సినిమాలో కాలేజ్ స్టూడెంట్ గా కనిపించింది. ఈ రెండు సినిమాల్లో తన క్యూట్ నెస్ తో ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. కింగ్ నాగార్జున నటించిన ఊపిరి సినిమాతో పరిచయం అయ్యింది అందాల భామ పూజిత పొన్నాడ. కానీ ఆ సినిమా ద్వారా అంతగా గుర్తింపు రాలేదు. ఆతర్వాత అక్కినేని నాగచైతన్య ప్రేమమ్ సినిమాలో కాలేజ్ స్టూడెంట్ గా కనిపించింది. ఈ రెండు సినిమాల్లో తన క్యూట్ నెస్ తో ఆకట్టుకుంది ఈ ముద్దుగుమ్మ. ఆతర్వాత మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ హీరోగా నటించిన రంగస్థలం సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకుంది పూజిత. రంగస్థలం సినిమాలో ఆది పినిశెట్టి ప్రేయసి గా కనిపించింది. సినిమాలో ఆమె కనిపించేది కొంతసేపే అయినా కూడా తన అందంతో నటనతో కట్టిపడేసింది పూజిత. రామ్ చరణ్ రంగస్థలం సినిమా తర్వాత వరుస అవకాశాలు అందుకుంది ఈ చిన్నది. ఆ తర్వాత రాజ్ తరుణ్ రాజుగాడు, బ్రాండ్ బాబు, హ్యాపీ వెడ్డింగ్, రాజశేఖర్ కల్కి, వేర్ ఈజ్ వెంకట లక్ష్మి, రన్, మిస్ ఇండియా, కథ కంచికి మనం ఇంటికి, ఓదెల రైల్వే స్టేషన్ సినిమాల్లో మెప్పించింది. అలాగే మాస్ మహారాజ రవితేజ రావణాసుర సినిమాల్లో కీలక పాత్ర పోషించింది. కానీ ఆ సినిమా కూడా పెద్దగా విజయం సాధించలేదు. దాంతో ఈ ముద్దుగుమ్మకు అనుకుంత క్రేజ్ మాత్రం రావడం లేదు. వరుసగా సినిమాలు చేస్తునా.. అందం అభినయం రెండూ ఉన్న కూడా ఈ అమ్మడికి అంతగా గుర్తింపు రావడంలేదు. ఇటీవలే పవర్ స్టార్ పవన్ కల్యాణ్ నటించిన హరిహర వీరమల్లు సినిమాలో పూజిత కనిపించి ఆకట్టుకుంది. అలాగే ఓ తమిళ సినిమాలోనూ నటిస్తోందీ అందాల తార. తాజాగా సోషల్ మీడియాలో కొన్ని క్రేజీ ఫోటోలు షేర్ చేసింది పూజిత.. ఈ ఫోటోలకు నెటిజన్స్ ఫిదా అవుతున్నారు.



VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603(146158), viswamvoice@gmail.com